www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

భోగి శుభాకాంక్షలు

ఆదివారం | 14-1-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 270 | హైదరాబాద్ సిటీ*

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ. 8.01, చవితి తె. 4.59 వరకు; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 10.23 తదుపరి శతభిషం; వర్జ్యం: సా.4.54-6.21; దుర్ముహూర్తం: సా.4.28-5.12; అమృతఘడియలు: రా.1.36-3.03; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.56

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఇంకొక్క స్మాష్..


'మలేసియా' ఫైనల్లో సాత్విక్ జోడీ

సెమీస్‌లో ప్రపంచ చాంపియన్లకు షాక్
టాప్ ర్యాంక్ జంటతో టైటిల్‌ఫైట్ నేడు

కౌలాలంపూర్: భారత బ్యాడ్మింటన్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అరుదైన ఘనతకు చేరువయ్యారు. కెరీర్‌లో రెండో సూపర్ 1000 సిరీస్ టైటిల్ నెగ్గేందుకు అడుగు దూరంలో నిలిచారు. మలేసియా ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్-చిరాగ్ 21-18, 22-20తో కొరియాకు చెందిన ప్రపంచ చాంపియన్, మూడో ర్యాంక్ జంట సియో సెంగ్ జె-కాంగ్ మిన్ హ్యుక్ షిద్‌ను చిత్తుచేసింది. తొలిగేమ్ సులువుగానే నెగ్గిన సాత్విక్ జోడీ.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా 47 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. గతేడాది జూన్‌లో ఇండోనేసియా ఓపెన్‌తో కెరీర్‌లో తొలి సూపర్ 1000 టైటిల్ సాధించిన సాత్విక్ జోడీ.. ఆ టోర్నీలోనూ సెమీస్‌లో ఇదే ప్రత్యర్థిని ఓడించి ఫైనల్ చేరడం విశేషం. ఆదివారం జరిగే టైటిల్ పోరులో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్ వన్ జోడీ లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్‌తో సాత్విక్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది.

షూటర్ విజయ్‌వీర్‌కు ఒలింపిక్ బెర్త్



జకర్తా: ఆసియా షూటింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో శనివారం జరిగిన 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ.. క్వాలిఫికేషన్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచి భారత్‌కు 17వ ఒలింపిక్ బెర్త్ అందించాడు. ఇక, ఫైనల్స్‌లో సిద్ధూ రజతం దక్కించుకున్నాడు. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ రజతం, ఆషి చౌక్సీ కాంస్యం సాధించారు.

సిరీస్‌పై భారత్ నజర్

అఫ్ఘానిస్థాన్‌తో రెండో టీ20 నేడు
ఏడాది తర్వాత కోహ్లీ తొలి మ్యాచ్



ఇండోర్: భారత్-అఫ్ఘానిస్థాన్ మధ్య రెండో టీ20 ఆదివారం ఇక్కడ జరగనుంది. మొదటి మ్యాచ్‌లో సునాయాసంగా గెలుపొందిన టీమిండియా..రెండో టీ20నీ నెగ్గి సిరీస్‌ను చేజిక్కించుకోవాలని భావిస్తోంది. తొలి మ్యాచ్‌కు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్ రెండో టీ20కి సిద్ధమయ్యారు. అయితే సంవత్సరం విరామం తర్వాత టీ20 జట్టులోకి పునరాగమనం చేస్తున్న విరాట్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. ఇక అఫ్ఘాన్‌పై సిరీస్ విజయం దక్కితే జట్టులోని యువ క్రికెటర్లకు అది ఇచ్చే కిక్కే వేరు. కారణం..భవిష్యత్‌లో కూడా టీమిండియాలో చోటు కోసం యువ ఆటగాళ్లు ప్రధానంగా పోటీలో ఉండేందుకు సిరీస్ గెలుపు తోడ్పడటమే. ఈ ఏడాది పొట్టి వరల్డ్ కప్ జరగనుండడంతో.. సెలెక్టర్ల దృష్టిలో పడాలంటే జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ రెండో మ్యాచ్‌లో మరింతగా రాణించాల్సి ఉంటుంది. జట్టులో చోటుకోసం ఇషాన్ కిషన్‌తో పోటీపడుతున్న వికెట్ కీపర్, బ్యాటర్ జితేశ్ శర్మకు అఫ్ఘాన్‌తో చివరి రెండు మ్యాచ్‌లు కీలకం కానున్నాయి. లోయరార్డర్‌లో 30కిపైగా స్కోర్లు సాధిస్తున్నా జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకోవాలంటే జితేశ్ ఇంకా భారీ స్కోర్లు చేయాలి. నిరుడు వెస్టిండీస్‌పై టీ20ల అరంగేట్రంలో అదరగొట్టిన హైదరాబాదీ తిలక్ వర్మ ఆపై అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోతున్నాడు. భారత జట్టు సుదీర్ఘ ప్రణాళికల్లో తానూ ఉండాలంటే 21 ఏళ్ల తిలక్ బ్యాట్ ఝుళిపించాల్సిందే. అయితే విరాట్ అందుబాటులో ఉండడంతో..తుది 11 మందిలో తిలక్‌కు చోటు దక్కుతుందా అన్నది చూడాలి. మొదటి మ్యాచ్‌లో రెండు వికెట్లతో భళా అనిపించిన లెఫ్టామ్ స్పిన్నర్ అక్షర్ అదే జోరు కొనసాగించి తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని చూస్తున్నాడు. పునరాగమనం చేసిన వాషింగ్టన్ సుందర్‌కు ఈ మ్యాచ్ ఎంతో కీలకం. మరోవైపు మొదటి మ్యాచ్ పరాజయాన్ని పక్కనబెట్టి..జూలు విదల్చడం ద్వారా సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలని అఫ్ఘానిస్థాన్ పట్టుదలగా ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్/గిల్, విరాట్, శివమ్ దూబే, రింకూ సింగ్, జితేశ్ శర్మ (కీపర్), అక్షర్, సుందర్, కుల్దీప్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, ముకేశ్/ఆవేశ్.

అఫ్ఘానిస్థాన్: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మనుల్లా (కీపర్), హజ్రతుల్లా/రహమత్ షా, ఒమర్ జాయ్, మహ్మద్ నబీ, నజీబుల్లా జద్రాన్, కరీమ్ జానత్, గుల్బదీన్ నైబ్, ముజీబుర్ రహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఫరూఖీ.

పిచ్/వాతావరణం

వికెట్ ఫ్లాట్‌గా ఉంటుంది. చిన్న బౌండరీలు కావడంతో భారీ స్కోర్లు నమోదవుతాయి. మొహాలీలో మాదిరి అతి చలిగా కాకుండా వాతావరణం అహ్లాదకరంగా ఉండే అవకాశముంది.

జొకోకు ఎదురుందా?

ఉ. 5.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



● ప్రపంచ రికార్డు వేటలో నొవాక్
● నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ఆటగాడి రికార్డుకు అడుగు దూరంలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. తాజా సీజన్‌ను గ్రాండ్‌గా ఆరంభించాలనుకొంటున్నాడు. ఆదివారం నుంచి జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంప్ జొకో మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. మరోసారి ఇక్కడ విజేతగా నిలిస్తే అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ఒకే ఒక్కడిగా నొవాక్ ప్రపంచ రికార్డు నెలకొల్పుతాడు. ప్రస్తుతం 24 టైటిళ్లతో మార్గరెట్ కోర్ట్‌తో జొకో సమంగా ఉన్నాడు. ఇక, ఈ వేదికపై 2019, 2020, 2021లో హ్యాట్రిక్ టైటిళ్లు నెగ్గిన నొవాక్‌ను వ్యాక్సిన్ తీసుకోని కారణంగా 2022లో ఆడనివ్వలేదు. అయితే, 2023లో బరిలోకి దిగి విజేతగా నిలిచాడు. మరోవైపు నొవాక్ చిరకాల ప్రత్యర్థి రఫెల్ నడాల్ గాయంతో ఈ టోర్నీకి దూరమైనా.. రెండో సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) నుంచి జొకోకు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గతేడాది రన్నరప్ స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)తోపాటు రుబ్లేవ్, రూడ్ కూడా జొకోకు సవాల్ విసిరేందుకు సిద్ధమయ్యారు. కాగా, గతవారం జరిగిన యునైటెడ్ కప్‌లో నొవాక్ మణికట్టుకు గాయమైంది. కానీ, తాను ఫిట్‌గా ఉన్నట్టు చెప్పిన జొకో.. తొలి రౌండ్‌లో క్వాలిఫయర్ డినో ప్రిజ్‌మిక్ (క్రొయేషియా)తో తలపడనున్నాడు.

కొత్త చాంపియన్ వచ్చేనా?

ఈసారి మహిళల విభాగంలో పోటీ రసవత్తరంగా ఉంది. గతేడాది జరిగిన నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల్లో వేర్వేరు క్రీడాకారిణులు విజేతలుగా నిలిచారు. అయితే, ఇక్కడ డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక (బెలారస్), టాప్‌సీడ్ ఇగా స్వియటెక్ (పోలెండ్) మధ్య టైటిల్ పోరు జరగొచ్చన్నది టెన్నిస్ పండితుల అంచనా. మూడో సీడ్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్), అమెరికా టీనేజర్, యూఎస్ ఓపెన్ విజేత కొకో గాఫ్ కూడా టైటిల్ ఫేవరెట్లలో ఉన్నారు. తొలి రౌండ్‌లో క్వాలిఫయర్ ఎల్లా సిడెల్ (జర్మనీ)తో సబలెంక, సోఫియా కెనిన్‌తో స్వియటెక్ తలపడనున్నారు. వింబుల్డన్ చాంప్ వండ్రసోవా, జెస్సికా పెగుల కూడా టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉన్నారు. కాగా, తల్లి అయ్యాక బరిలోకి దిగుతున్న మాజీ చాంప్ ఒసాక, వెటరన్లు అజరెంకా, వోజ్నియాకి కూడా టైటిల్‌పై కన్నేశారు.

అవకాశాలు చేజార్చుకొని..

అమెరికా చేతిలో భారత్ ఓటమి
ఒలింపిక్ మహిళల హాకీ క్వాలిఫయర్స్



రాంచి: పారిస్ విశ్వ క్రీడల బెర్త్ పట్టేయాలని పట్టుదలగా బరిలో దిగిన భారత మహిళల జట్టుకు ఆరంభంలోనే చుక్కెదురైంది. శనివారం ఇక్కడ ప్రారంభమైన ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ..గ్రూప్ 'బి' తమ తొలి పోరులో సవితా పూనియా సారథ్యంలోని భారత జట్టు 0-1తో 24వ ర్యాంకర్ అమెరికా చేతిలో పరాజయం చవిచూసింది. అబిగెయిల్ తోమెర్ (16వ ని.) చేసిన ఏకైక గోల్‌తో అమెరికా విజయ దక్కించుకుంది. ప్రపంచ ర్యాంకుల్లో ఆరో స్థానంలో ఉన్న భారత్..మ్యాచ్‌లో సింహభాగం బంతిని తన అధీనంలోనే ఉంచుకుంది. కానీ ప్రత్యర్థి రక్షణ శ్రేణిని ఛేదించలేకపోయింది. ఏడు పెనాల్టీ కార్నర్లు లభించినా ఒక్క దానినీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో మన మహిళలు తలపడతారు. మొదటి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ 3-0తో ఇటలీని చిత్తు చేయగా..జపాన్ 2-0తో చెక్ రిపబ్లిక్‌పై, జర్మనీ 3–0తో చిలీపై విజయం సాధించాయి.

హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయం

రోహిత్ అజేయ శతకం

షిల్లాంగ్: తాజా రంజీ సీజన్‌లో హైదరాబాద్ వరుసగా రెండో విజయం సాధించింది. ఏకంగా ఇన్నింగ్స్ 81 పరుగుల భారీ తేడాతో మేఘాలయను చిత్తు చేసిన హైదరాబాద్ రెండ్రోజుల్లోనే మ్యాచ్‌ను ముగించడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 182/4తో శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 346/7 వద్ద డిక్లేర్ చేసింది. రోహిత్ రాయుడు సెంచరీ (124 నాటౌట్)తో అదరగొట్టగా, మిలింద్ (50 నాటౌట్) అర్ధ శతకంతో రాణించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ 154 పరుగులకే కుప్పకూలింది. తనయ్ 3 వికెట్లు, మిలింద్, రవితేజ చెరో 2 వికెట్లు తీశారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 111 రన్స్‌కు ఆలౌటైంది. రోహిత్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

అల్టిమేట్ ఖో-ఖో చాంపియన్ జెయింట్స్

● ఫైనల్లో చెన్నైపై గుజరాత్ గెలుపు
● తెలుగు యోధాస్‌కు 4వ స్థానం



కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2 టైటిల్‌ను గుజరాత్ జెయింట్స్ కైవసం చేసుకొంది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో గుజరాత్ 31-26తో చెన్నై క్విక్‌గన్స్‌ను ఓడించింది. కాగా, తెలుగు యోధాస్ జట్టు మరోసారి నిరాశపరిచింది. మూడోస్థానం కోసం జరిగిన ప్లేఆఫ్ పోరులో యోధాస్ 24-32తో డిఫెండింగ్ చాంప్ ఒడిశా జుగర్‌నాట్స్ చేతిలో ఓడి నాలుగో స్థానానికి పరిమితమైంది. అటాకర్లు టచ్‌పాయింట్లు తీసుకురావడంలో విఫలమవడంతో తెలుగు యోధాస్‌కు పరాజయం తప్పలేదు.

బోపన్న జోడీ రన్నరప్‌తో సరి



అడిలైడ్: భారత టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ఈ సీజన్‌ను రన్నరప్‌తో టైటిల్‌తో మొదలుపెట్టాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి బోపన్న అడిలైడ్ ఇంటర్నేషనల్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మూడోసీడ్ రాజీవ్ రామ్- సాలిస్‌బరీ జంట 7-5, 7-5, 11-9తో బోపన్న ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది.

పుణె జోరుకు జైపూర్ బ్రేక్

జైపూర్: పుణెరి పల్టన్ వరుస 8 విజయాలకు డిఫెండింగ్ చాంప్ జైపూర్ పింక్ పాంథర్స్ బ్రేకులు వేసింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో శనివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 36-34తో పుణెరి పల్టన్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 42-37తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది.

ఓటమితో ఆరంభం

ఏఎఫ్‌సీ కప్‌లో భారత్‌కు నిరాశ

అల్ రయాన్ (కతార్): ఏఎఫ్‌సీ ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఆరంభంలోనే నిరాశ ఎదురైంది. గ్రూప్-బీలో భాగంగా శనివారం జరిగిన తమ తొలి పోరులో భారత్ 0-2తో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. ఆసీస్ తరఫున రెండు గోల్స్‌ను జాక్సన్ ఇర్విన్ (50వ), జోర్డాన్ బ్రాస్ (73వ) కొట్టారు. గ్రూప్‌లో తన రెండో మ్యాచ్‌ను భారత్ ఈనెల 18న ఉజ్బెకిస్థాన్‌తో ఆడనుంది.

టాటా కన్స్యూమర్ గూటికి 2 కంపెనీలు

డీల్ విలువ రూ.7,000 కోట్లు

న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపీఎల్) ఒకేసారి రెండు కంపెనీలను కొనుగోలు చేసింది. చింగ్స్ సీక్రెట్, స్మిత్ అండ్ జోన్స్ బ్రాండ్ల ఉత్పత్తుల తయారీదారు క్యాపిటల్ ఫుడ్స్‌తో పాటు హెల్త్ అండ్ వెల్‌నెస్ ఉత్పత్తుల విక్రయ కంపెనీ ఆర్గానిక్ ఇండియాను టేకోవర్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ రెండు డీల్స్ మొత్తం విలువ రూ.7,000 కోట్లు. అందులో, క్యాపిటల్ ఫుడ్స్‌ను రూ.5,100 కోట్లకు, ఆర్గానిక్ ఇండియాను రూ.1,900 కోట్లకు దక్కించుకుంది. వేగంగా వృద్ధి చెందుతున్న, పోటీ అధికంగా ఉన్న ఈ రెండు సెగ్మెంట్లలో టీసీపీఎల్ నిలదొక్కుకునేందుకు ఈ కొనుగోళ్లు దోహదపడనున్నాయి. అంతేకాదు, ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో విస్తరణ ద్వారా టాటా కన్స్యూమర్ పూర్తిస్థాయి ఎఫ్ఎంసీజీ కంపెనీగా రూపాంతరం చెందేందుకు సైతం తోడ్పడనున్నాయి.

క్యాపిటల్ ఫుడ్స్‌లో తొలుత 75 శాతం వాటా కొనుగోలుకు కంపెనీ ప్రమోటర్లు, ఇతర వాటాదారులతో టీసీపీఎల్ షేర్ల కొనుగోలు అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఈ లావాదేవీ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. మిగతా 25 శాతం వాటాను సైతం మూడేళ్లలో టేకోవర్ చేయనున్నట్లు టాటా కన్స్యూమర్ వెల్లడించింది. ఆర్గానిక్ ఇండియా కొనుగోలు లావాదేవీ సైతం పూర్తిగా నగదు రూపంలో జరగనుందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో క్యాపిటల్ ఫుడ్స్ ఆదాయం రూ.705.5 కోట్లు, ఆర్గానిక్ ఇండియా రెవెన్యూ రూ.324.4 కోట్లుగా నమోదైంది.

2027 నాటికి దేశంలో 10 కోట్ల ధనికులు

గోల్డ్‌మన్ శాక్స్ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్ల (2027 నాటికి)లో ధనిక భారతీయులు 10 కోట్లకు చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ప్రస్తుతం వీరి సంఖ్య 6 కోట్ల స్థాయిలో ఉందని, 2027 నాటికి 67 శాతం వృద్ధితో పది కోట్లకు చేరుకోవచ్చని తాజా నివేదికలో పేర్కొంది. కనీసం 10,000 డాలర్ల (రూ.8.3 లక్షలు) వార్షికాదాయం కలిగిన వారిని ఈ జాబితాలో చేర్చింది. ప్రస్తుతం వేతన జీవుల్లో 4 శాతం మాత్రమే ఏటా 10,000 డాలర్లకు పైగా ఆదాయం ఆర్జిస్తున్నారని, దేశ తలసరి ఆదాయం 2,100 డాలర్ల (రూ.1.75 లక్షలు)కు దాదాపు ఐదు రెట్లు అధికమిదని రిపోర్టులో ప్రస్తావించింది. 2019-23 మధ్య కాలంలో ధనిక భారతీయులు ఏటేటా 12 శాతం చొప్పున పెరుగుతూ వచ్చారని, ఇదే కాలానికి దేశ జనాభా ఒక శాతం చొప్పున పెరిగిందని గోల్డ్‌మన్ శాక్స్ అంటోంది. గత మూడేళ్లలో సంపన్న వర్గం వేగంగా వృద్ధి చెందడం ద్వారా దేశంలో ఈక్విటీలు, బంగారం, స్థిరాస్తి ఆర్థిక, భౌతిక ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది. ప్రధానంగా ఈక్విటీ, బంగారం ఆస్తులు అధికంగా పెరిగాయని, గత 3-4 ఏళ్లలో స్థిరాస్తి ధరలు గరిష్ఠ వృద్ధిని నమోదు చేసుకున్నాయంటోంది. 2023లో డీమ్యాట్ ఖాతాలు 2.8 రెట్లు పెరిగి 11.4 కోట్లకు చేరుకున్నాయని, బీఎస్ఈ 200 లిస్టెడ్ కంపెనీల స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు సైతం గణనీయంగా పెరిగాయంది. 2019-23 మధ్యకాలంలో భారతీయుల వద్దనున్న బంగారం విలువ 63 శాతం పెరిగి 1.8 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుందని రిపోర్టు తెలిపింది. ధనిక వర్గం పెరుగుదల పలు రంగాలపై సానుకూల ప్రభావం చూపిందని గోల్డ్‌మన్ శాక్స్ అంటోంది. ఎఫ్ఎంసీజీ, పాదరక్షలు, ఫ్యాషన్ వస్త్రాలు, ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహన విభాగాల్లో ప్రీమియం ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. అధిక ఆదాయ వర్గాల వినియోగ అవసరాలపై దృష్టి సారించిన కంపెనీలు మెరుగైన పనితీరు కనబర్చాయి.

జువెలరీ, పర్యాటకం, ప్రీమియం రిటైల్, ప్రీమియం హెల్త్‌కేర్ సేవల వ్యాపారాలు భారీగా లాభపడ్డాయని రిపోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి క్రెడిట్ కార్డు హోల్డర్లు 80 శాతం పెరగగా.. కార్డుల ద్వారా వ్యయాలు 250 శాతం పెరిగాయని తెలిపింది.

ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా మైక్రోసాఫ్ట్

Microsoft

రెండో స్థానానికి యాపిల్

న్యూయార్క్: అమెరికన్ స్టాక్ మార్కెట్లో శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, యాపిల్‌ను వెనక్కినెట్టి మైక్రోసాఫ్ట్ ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. ఈ వారంలో మైక్రోసాఫ్ట్ షేర్లు 3 శాతానికి పైగా పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) 2.89 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో యాపిల్ షేర్లు 3 శాతానికి పైగా క్షీణించడంతో, సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ 2.87 లక్షల కోట్ల డాలర్లకు జారుకుంది. గురువారం ఇంట్రాడే ట్రేడింగ్‌లోనూ కొద్ది సమయం పాటు మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాప్ యాపిల్‌ను మించినప్పటికీ, మళ్లీ కిందికి జారుకుంది. ప్రపంచంలోని విలువైన కంపెనీల లిస్ట్‌లో మైక్రోసాఫ్ట్ నం.1 స్థానానికి చేరుకోవడం 2021 తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్ జీపీటీ అభివృద్ధి సంస్థ ఓపెన్‌ఏఐలో పెట్టుబడులతో పాటు చాట్‌జీపీటీని తన ఉత్పత్తుల్లో వినియోగించుకోనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించడం కంపెనీ షేర్ల ర్యాలీకి దోహదపడింది. కాగా, యాపిల్ ఐఫోన్ల గిరాకీ మందగించడం సంస్థ షేర్ల విలువ క్షీణతకు కారణమైంది.

డీమార్ట్ లాభం రూ.690 కోట్లు

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రిటైల్ చెయిన్ డీమార్ట్‌ను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ నికర లాభం 17 శాతం వృద్ధి చెంది రూ.690.41 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.589.64 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల నుంచి వచ్చిన ఆదాయం కూడా 17.31 శాతం వృద్ధితో రూ.13,572.47 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ.12,656.46 కోట్లుగా ఉన్నట్లు అవెన్యూ సూపర్‌మార్ట్స్ పేర్కొంది. కాగా డిసెంబరు ముగిసే నాటికి మొత్తం స్టోర్ల సంఖ్య 341గా ఉందని తెలిపింది.

భారత మార్కెట్లోకి తొలిసారిగా యాంటీ డయాబెటిక్ ఔషధం లిరాగ్లుటైడ్ బయోసిమిలర్‌ను తీసుకువచ్చినట్లు గ్లెన్‌మార్క్ వెల్లడించింది. లిరాఫిట్ బ్రాండ్ పేరుతో ఈ బయోసిమిలర్ ఔషధాన్ని విడుదల చేసినట్లు తెలిపింది. టైప్-2 మధుమేహ రోగుల్లో గ్లైసిమిక్‌ను నియంత్రించటంలో ఈ ఔషధం సమర్థవంతంగా పనిచేస్తుందని పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,270 ▲	58,000 ▲	78,000 ▲
ముంబై	62,515 ▲	57,264 ▲	71,530 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
14 జనవరి		విశాఖపట్నం	599
చిత్తూరు	563	వరంగల్	542
గోదావరి	555	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	గోదావరి	101
వరంగల్	102	విజయవాడ	101
కరీంనగర్	102	గుంటూరు	102
మహబూబ్‌నగర్	102	ఒంగోలు	102
కర్నూలు	102	చిత్తూరు	103
విశాఖపట్నం	96		

నయా ఫండ్స్..

ఓల్డ్ బ్రిడ్జ్ ఎంఎఫ్.. ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్

ఓల్డ్ బ్రిడ్జ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్.. 'ఓల్డ్ బ్రిడ్జ్ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్' పేరుతో కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ ఫండ్. ఈ ఫండ్ గరిష్ఠంగా 30 మల్టీక్యాప్ షేర్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈ నెల 17న ప్రారంభమై 19న ముగుస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే రూ.2,500 పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.

బంధన్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. ఈ ఫండ్.. భారత ఈక్విటీలతో పాటు అంతర్జాతీయ ఈక్విటీలు, ఆర్బిట్రేజ్, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, బంగారం, వెండి.. విభాగాల్లో పెట్టుబడులు పెడుతుంది. ఇందులో 50 శాతం పెట్టుబడులు భారత ఈక్విటీల్లోని లార్జ్,మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌ల్లో పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 24.

మిరే అసెట్ అలోకేషన్ ఫండ్

మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్.. రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్లతో మిరే అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. గ్రోత్ ఆప్షన్, ఇన్‌కమ్ డిస్ట్రిబ్యూషన్ కమ్ క్యాపిటల్ విత్‌డ్రాయల్ (ఐడీసీడబ్ల్యూ) ఆప్షన్స్‌తో దీన్ని తీసుకువచ్చింది. ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లుగా ఎస్ అండ్ పీ బీఎస్ఈ 200 టీఆర్ఐ, నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ డెట్ ఇండెక్స్ ఉండనున్నాయి. డెట్, గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో కూడా పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే రూ.500 నుంచి పెట్టుబడులు పెట్టుకుంటూ పోవచ్చు. ఈ నెల 24న ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది.

బజాజ్ ఫిన్‌సర్వ్.. నిఫ్టీ 50 ఈటీఎఫ్, నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్

బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్.. తొలిసారిగా రెండు కొత్త ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను విడుదల చేసింది. బజాజ్ ఫిన్‌సర్వ్ నిఫ్టీ 50 ఈటీఎఫ్, నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. భారత స్టాక్ మార్కెట్లో ఇవి రెండు కీలకమైన బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లుగా ఉన్నాయని, వీటిల్లో ఇన్వెస్టర్లు వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన తోడ్పాటును ఈ ఈటీఎఫ్‌లు అందించనున్నాయని బజాజ్ ఫిన్‌సర్వ్ వెల్లడించింది. ఈ ఈటీఎఫ్‌లను ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో లిస్టింగ్ చేయనుంది. ఈ ఫండ్స్‌కు నిఫ్టీ 50 టీఆర్ఐ, నిఫ్టీ బ్యాంక్ టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లుగా ఉన్నాయి. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 18.

అపార్ట్‌మెంట్ రెసిడెన్స్ సంఘాలు జీఎస్టీ చెల్లించాలా?


రాంబాబు గొండాల

ఇదీ GST

ఒకప్పుడు అపార్ట్‌మెంట్ అంటే నాలుగైదు అంతస్తులకు మాత్రమే పరిమితమై ఉండేవి. వీటిలో కనీస అవసరాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ప్రజల జీవన శైలి మారటం, అభిరుచుల్లో మార్పులతో పాటు బ్యాంకింగ్ సేవలు అందరికీ అందుబాటులోకి రావటంతో వివిధ సదుపాయాలు ఉండే బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. వీటిలో సకల సౌకర్యాలు ఉండటంతో చాలా మంది వీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. బిల్డర్ తాను అపార్ట్‌మెంట్ కట్టే సమయంలో అన్ని సౌకర్యాలు కల్పించినా ఆ తర్వాత వాటిని మెయింటెయిన్ చేయటం చాలా ఖర్చుతో కూడుకున్న పని. అందుకే అపార్ట్‌మెంట్‌లో నివసించే వారు ఒక సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటారు. దీన్ని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లేదా సొసైటీగా వ్యవహరిస్తారు.

ఈ అసోసియేషన్ పని ఏమిటంటే అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని పనులు అంటే.. సెక్యూరిటీ, లిఫ్ట్, కామన్ ఏరియా, పార్క్‌లు, ఆట స్థలాలు మొదలైన వాటిని చూసుకుంటుంది. దీనిలో అపార్ట్‌మెంట్‌లోని అందరూ.. సభ్యులుగా వ్యవహరిస్తారు. నెలవారీ ఖర్చుల కోసం ప్రతి సభ్యుడి నుంచి కొంత మొత్తం మెయింటెనెన్స్ చార్జీల కింద వసూలు చేస్తారు. మరి ఇలా వసూలు చేసే మెయింటెనెన్స్ చార్జీల మీద ఆయా సంక్షేమ సంఘాలు జీఎస్టీ చెల్లించాలా? చెల్లించాల్సి వస్తే దాని విధివిధానాలు ఏమిటి? ఇలాంటి సందేహాలు చాలా మందికి ఉన్నాయి.

ముందుగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జీఎస్టీ చెల్లించాలా అంటే.. కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. తమ సభ్యుల ద్వారా వసూలు చేసే మొత్తం.. సంవత్సరానికి రూ.20 లక్షలు దాటనంత వరకు ఆయా సంక్షేమ సంఘాలకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఒకవేళ ఆ మొత్తం రూ.20 లక్షలు దాటితే రిజిస్ట్రేషన్ తప్పకుండా తీసుకోవాలి. ఇంకా సభ్యుడి నుంచి వసూలు చేసే నెలవారీ మెయింటెనెన్స్ చార్జీ నెలకు రూ.7,500 మించకపోతే ఎలాంటి జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు.

ఉదాహరణకు ఒక అపార్ట్‌మెంట్‌లో మూడు బెడ్‌రూముల ఫ్లాట్‌కు మెయింటెనెన్స్ చార్జీ నెలకు రూ.8,000, రెండు బెడ్‌రూముల ఫ్లాట్‌కు రూ.7,000 అనుకుందాం. అప్పుడు మూడు బెడ్‌రూముల ఫ్లాట్‌కు సంబంధించిన మెయింటెనెన్స్ చార్జీల మీద అంటే రూ.8,000 మీద మాత్రమే జీఎస్టీ కడితే సరిపోతుంది. అయితే ఇక్కడా ఒక సందేహం రావచ్చు. రూ.7,500 వరకు పన్ను మినహాయింపు ఉంది కాబట్టి.. అది పోను మిగతా మొత్తం మీద అంటే రూ.500 మీద జీఎస్టీ కడితే సరిపోతుందా అని. అయితే దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక వివరణ ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఒక నెల మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటినట్లయితే.. మొత్తం చార్జీ మీద జీఎస్టీ కట్టాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు చెప్పుకున్న ఉదాహరణలో రూ.500 మీద కాకుండా మొత్తం రూ.8,000 మీద జీఎస్టీ కట్టాల్సి ఉంటుంది. అలాగే ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఫ్లాట్లు ఉంటే జీఎస్టీ కోసం మెయింటెనెన్స్ చార్జీ మొత్తంగా కలిపి చూడాలా లేదా విడివిడిగా చూడాలా అనే సందేహం కూడా చాలా మందికి ఉంటుంది. పైన చెప్పిన ఉదాహరణలో ఒకే వ్యక్తికి ఒక ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్, డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఉన్నాయనుకుందాం. రెండింటి మీద కలిపి రూ.15,000 మెయింటెనెన్స్ చార్జీ కట్టాల్సి వస్తుంది. ఈ మొత్తం పన్ను మినహాయింపు పరిమితి రూ.7,500కి మించి ఉంది కాబట్టి మొత్తం మీద జీఎస్టీ కట్టాల్సి ఉంటుందా? దీనికి కూడా ఒక వివరణ ఇవ్వటం జరిగింది. ఒక వ్యక్తికి ఎన్ని ఫ్లాట్స్ ఉన్నప్పటికీ ఏ ఫ్లాట్‌కు అయితే మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటుతుందో దాని మీద మాత్రమే జీఎస్టీ కట్టాల్సి ఉంటుంది. కొన్ని అపార్ట్‌మెంట్స్‌లో తక్కువ సంఖ్యలో ఫ్లాట్స్ ఉన్నప్పుడు మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటినప్పటికీ. వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటకపోవచ్చు. అలాంటప్పుడు కూడా ఆయా అసోసియేషన్స్‌కు జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఇంకొక విషయం ఏమిటంటే ఈ వెల్ఫేర్ సొసైటీ తాము పొందిన వస్తు సేవల మీద జీఎస్టీ నియమ నిబంధనల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

భోగి శుభాకాంక్షలు

'ఇండియా' చైర్మన్‌గా ఖర్గే



- విపక్ష కూటమి ఏకగ్రీవ ఆమోదం.. కన్వీనర్‌గా నితీశ్ పేరు ప్రతిపాదన
- తిరస్కరించిన జేడీయూ అధినేత.. బదులుగా ఉమ్మడి కమిటీకి సూచన
- వర్చువల్‌గా భేటీ.. ఎన్నికల సన్నద్ధత, కార్యక్రమాలు, విధానాలపై చర్చ
- దేశవ్యాప్తంగా బహిరంగ సమావేశాలు.. నిర్వహణ కోసం కమిటీ 2

ధరలు, నిరుద్యోగమే ప్రధాన ఎజెండా



- నేడు ప్రారంభం కానున్న రాహుల్ న్యాయ్‌యాత్ర
- మొత్తం 100 నియోజకవర్గాల మీదుగా యాత్ర

ఆదివారం | 14-1-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 270 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

సొంతూళ్లకు సంబురంగా..

- హైదరాబాద్‌లో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట
- ఏపీ, తెలంగాణ జిల్లాలకు 1600 బస్సులు
- ఉచిత ప్రయాణంలో భారీసంఖ్యలో మహిళలు
- టికెట్ రేట్లను పెంచేసిన ప్రైవేటు ఆపరేటర్లు
- సొంతవాహనాలపై లక్షలాది మంది ప్రయాణం
- విజయవాడ నేషనల్ హైవేపై ట్రాఫిక్ కష్టాలు
- కి.మీ. మేర గంటలపాటు నిలిచిన వాహనాలు

పద పద.. పతంగి

- సికింద్రాబాద్‌లో కైట్స్, స్వీట్స్ పండగ షురూ
- 16 దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ రాక

పందెం నీదా.. నాదా!

- ఆంధ్రప్రదేశ్‌లో కోళ్లు.. కొట్లు.. అన్నీ సిద్ధం

అరిసెలూ ఆన్‌లైన్‌లోనే..

- సకినాలు సహా పిండివంటలన్నీ ఔట్ సోర్సింగ్
- నగరాలు, పట్టణాల్లో కానరాని ఇంటి వంట
- ఈ సీజన్‌లో 80 టన్నులకు పైగానే విక్రయాలు



పరేడ్‌గ్రౌండ్‌లో పతంగుల పండుగ ప్రారంభం సందర్భంగా ఎగురవేసిన భారీ గాలిపటం



రెండు దారులూ ఏపీవైపే.. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మాజిగూడెం వద్ద విజయవాడ వైపు ఇరువైపులా (రాంగ్‌రూట్‌లో) వెళుతున్న వాహనదారులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి పండుగ సందడి రాజధాని నగరంలో, శివార్లలో ముందే వచ్చింది. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్‌లోని బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు శనివారం కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం అందుబాటులోకి రావటంతో మహిళా ప్రయాణికులు భారీసంఖ్యలో తరలి వచ్చారు. ఆర్టీసీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసినా కూడా వచ్చిన జనం తాకిడికి అవి సరిపోలేదు. ఇదే అదునుగా ప్రైవేటు బస్సు సర్వీసుల వాళ్లు అడ్డగోలుగా టికెట్ ధరలు పెంచి సొమ్ము చేసుకున్నారు. ఏపీకి చెందిన నగర

మిగతా 11వ పేజీలో...

బస్సు మంటల్లో మసైపోయి..

- గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. మంటలు చెలరేగి మహిళ సజీవ దహనం
- 37 మంది ప్రయాణికులు సురక్షితం.. ఆరుగురు ప్రయాణికులు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- ప్రమాద బాధితులందరూ ఆస్పత్రికి తరలింపు.. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం 7

రైతుబంధుకు లైన్‌క్లియర్!

- 16న ఆర్బీఐ నుంచి 2 వేల కోట్ల రుణం 3
- కేంద్రం నుంచి 9 వేల కోట్ల రుణం మంజూరు
- ఈ పథకానికి రూ.7,625 కోట్లు అవసరం
- సర్దుబాటు చేయాల్సినది రూ.6,600 కోట్లు
- ఫిబ్రవరితో నగదు బదిలీ పూర్తయ్యే అవకాశం

మహిళలకు 'పీఎం కిసాన్' డబుల్!

- ప్రస్తుతం 6 వేలు.. 10 లేదా 12 వేలకు పెంపు
- మిగతా రైతులకు రూ.8 వేలు లేదా 9 వేలు
- లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్రం కసరత్తు 2

విదేశీ వేదికపై 'అయోధ్య' వేడుక 2

- అమెరికాలోని 10 రాష్ట్రాల్లో భారీ బిల్‌బోర్డులు
- మారిషస్‌లో 10 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు
- వీధుల్లో ర్యాలీలు, కూడళ్లలో ఎల్‌సీడీ స్క్రీన్లు

'హైదరాబాద్-విజయవాడ' మధ్య పారిశ్రామిక కారిడార్

- కొత్తగా ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలపండి
- హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌కు అనుమతులివ్వండి
- ఫార్మాసిటీకి కొత్త ప్రతిపాదనలు పంపేందుకు అంగీకరించండి
- వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌కు గ్రీన్‌ఫీల్డ్ హోదా కల్పించండి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఖర్గే, రాహుల్‌తో రేవంత్ భేటీ.. ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చ
- రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సంక్రాంతి శుభాకాంక్షలు



ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్

న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో హైదరాబాద్-విజయవాడ (వయా మిర్యాలగూడ) నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. దీనికి అనుమతులు ఇస్తే.. రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదల వుతాయని తెలిపారు. ఇవే కాకుండా.. ఫార్మాసిటీకి సంబంధించి గత ప్రభుత్వ చేసిన ప్రతిపాదనల్ని ఉపసంహరించుకొని నూతన ప్రతిపాదనలు పంపేందుకు

మిగతా 12వ పేజీలో...

కాళేశ్వరంలో రూపాయి ఖర్చుకు వచ్చేది 52 పైసలే

- ఈ ఎత్తిపోతల ప్రాజెక్టు ఆర్థికంగా అంత ప్రయోజనకరం కాదు
- విద్యుత్తు, రుణ బాకీలకు ఏటా వ్యయం రూ.28,270 కోట్లు
- కరెంటు ఖర్చు అంచనాలకు డబుల్.. ఏటా రూ.10 వేల కోట్లు
- ఏటా 21,682 కోట్ల ఆదాయమన్నారు.. వచ్చేది 14,709 కోట్లే
- 87 వేల కోట్లతో సృష్టించిన కొత్త ఆయకట్టు 40 వేల ఎకరాలే
- ముసాయిదా నివేదికలో తేల్చి చెప్పిన కాగ్ 12





టాయ్‌లెట్ ముచ్చట్లు!

- మీ కమోడ్ మీతో మాట్లాడుతుంది
- బోర్ కొట్టకుండా పాటలూ వినొచ్చు
- మాట్లాడే బ్రష్.. పారదర్శక టీవీ..
- పక్షుల్ని గుర్తించి చూపే బైనాక్యులర్
- అలెక్సా లాంటి చాట్‌జీపీటీ టూల్ 2
- సీఈఎస్-24 వింత ఉత్పత్తుల్లో!

మహిళలకు 'పీఎం కిసాన్' సాయం డబుల్!

» 10 వేలు లేదా 12 వేలకు పెంచే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 13: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులకు పీఎం కిసాన్ సాయాన్ని పెంచేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు కసరత్తు చేస్తోంది. 2019 ఎన్నికలకు ముందు తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 11 కోట్ల మంది రైతులకు ఏడాదికి రూ.6 వేలు అందుతోంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే మహిళా రైతులకు ఈ మొత్తాన్ని రెట్టింపు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వారికి రూ.10 వేలు లేదా 12 వేలు.. మిగతా రైతులకు రూ.8 వేలు లేదా రూ.9 వేలకు పెంచాలని యోచిస్తున్నారు. ఈ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయనున్నట్లు సమాచారం.

కేజ్రీకి నాలుగోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 13: ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం మరోసారి సమన్లు జారీ చేసింది. వివాదాస్పద ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి ఈ నెల 18న విచారణకు హాజరు కావాలని కోరింది. మనీ లాండరింగ్ ఆరోపణలు ముడిపడి ఉన్న ఈ కేసులో కేజ్రీకి సమన్లు ఇవ్వడం మూడు నెలల్లోనే ఇది నాలుగోసారి. కాగా, ఆయన ఒక్కసారీ విచారణకు హాజరవలేదు.

బెంగాల్‌లో సాధువులపై దాడి.. 12 మంది అరెస్టు

కోల్‌కత్తా, జనవరి 13: పశ్చిమ బెంగాల్‌లో సాధువులపై ఓ గుంపు చేసిన దాడి.. మరోసారి అధికార టీఎంసీ, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి కారణమయింది. దీంతో స్పందించిన పోలీసులు వీడియో ఆధారంగా 12 మందిని అరెస్టు చేసి, విచారణ ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్‌లో గంగా సాగర్ నదీతీరాన ఉండే ఓ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఒంటి నిండా బూడిద పూసుకున్న సాధువులు ఆ క్షేత్ర దర్శనానికి వెళ్తూ.. దారి తెలుసుకోవడానికి వారికి ఎదురయిన మహిళల వద్దకు వెళ్లారు. వారిని చూసి భయాందోళనలతో మహిళలు కేకలు వేశారు. దీంతో అక్కడ ఉన్న స్థానికులు ఆగ్రహంతో సాధువులపై విచక్షణారహితంగా దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాధువులను రక్షించారు. కేసు పెట్టడానికి వారు నిరాకరించడంతో పోలీసులు వారిని సురక్షితంగా దూద్‌సాగర్‌కు పంపించారు. పురూలియాలో జరిగిన ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమంలో హల్‌చల్ అయింది.

మమ్మల్ని బెదిరించే హక్కు ఏ దేశానికీ లేదు

» మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 13: తమను బెదిరించే హక్కు ఏ దేశానికీ లేదని మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు వ్యాఖ్యానించారు. భారత్, మాల్దీవుల మధ్య ఇటీవల దౌత్యపర వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకొంది. లక్షదీవుల పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీపై ఆ దేశ మంత్రులు తగని వ్యాఖ్యలు చేయడం, దాంతో ఆ దేశంలో జరపాల్సిన విహార యాత్రలను పలువురు భారతీయులు రద్దు చేసుకోవడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇది జరుగుతున్న సమయంలోనే ముయిజ్జు తన మొట్టమొదటి అధికారిక పర్యటన నిమిత్తం చైనా వెళ్లారు. అయిదు రోజుల పాటు అక్కడ పర్యటించిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. "మేం చిన్నవారమే కావచ్చు. అయితే మమ్మల్ని బెదిరించడానికి మీకు మేం లైసెన్సు ఏమీ ఇవ్వలేదు" అని అన్నారు.

పినరయి కుమార్తె కంపెనీకి రూ.కోట్లు చెల్లింపు

» దర్యాప్తునకు ఆదేశించిన కేంద్రం

తిరువనంతపురం, జనవరి 13: కేరళ సీఎం పినరయి విజయన్ కుమార్తె టి.వీణ నిర్వహిస్తున్న ఎక్సలాజిక్ సొల్యూషన్స్ కంపెనీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. ఆ కంపెనీకి అక్రమంగా కోట్లాది రూపాయలు మళ్లినట్టు అనుమానిస్తోంది. దీనిపై విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీ వేసినట్టు శుక్రవారం రాత్రి కార్పొరేట్ వ్యవహారాల శాఖ తెలిపింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అనే సంస్థకు ఎక్సలాజిక్ సొల్యూషన్స్ సలహాదారుగా ఉంది. అయితే ఎలాంటి సేవలు అందించకుండానే ప్రతి నెలా సొమ్ము పొందుతోందన్న ఫిర్యాదులు వచ్చాయి.

తక్షణ, సురక్షిత కనెక్టివిటీకి 'సంభవ్'

» అధునాతన మొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసిన ఆర్మీ

న్యూఢిల్లీ, జనవరి 13: భారత రక్షణ వ్యవస్థ సామర్థ్యం మరింత పెరిగేలా కీలక ముందడుగు పడింది. తక్షణ కనెక్టివిటీ, సురక్షితమైన కమ్యూనికేషన్‌ను అందించేందుకు వీలుగా భారత ఆర్మీ దేశీయంగా ఒక సురక్షితమైన మొబైల్ ఎకోసిస్టమ్ 'సంభవ్'ను అభివృద్ధి చేసింది. సంభవ్ (సెక్యూర్ ఆర్మీ మొబైల్ భారత్ వెర్షన్) అత్యాధునిక 5జీ వ్యవస్థపై పనిచేస్తుంది. ఈ సాంకేతికత భారత రక్షణ సామర్థ్యాన్ని పెంచడంలో గణనీయమైన ముందడుగు వంటిదని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రముఖ విద్యా, పారిశ్రామిక రంగ నిపుణుల సహకారంతో భారత ఆర్మీ సంభవ్‌ను అభివృద్ధి చేసింది. రెండు విడతల్లో మొత్తం 35 వేల సెట్లను అందుబాటులోకి తేవాలని భారత సైన్యం భావిస్తోంది. తొలి విడతగా 2,500 సెట్లను ఈ నెల 15లోగా అందుకోనుంది.

పీవోకేలో బ్రిటిష్ హైకమిషనర్ పర్యటనపై

తీవ్ర నిరసన వ్యక్తం చేసిన భారత్

న్యూఢిల్లీ, జనవరి 13: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని మీర్పూర్‌లో బ్రిటిష్ హై కమిషనర్ పర్యటించడాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ పర్యటన తీవ్ర అభ్యంతరకరమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లోని బ్రిటిష్ హై కమిషనర్ జానే మారియట్ జనవరి 10న ఇస్లామాబాద్ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. ఇది పూర్తిగా భారత సార్వభౌమాధికారంలోకి చొరబడడమేనని భారత్ పేర్కొంది. ఈ మేరకు భారత్‌లోని బ్రిటిష్ హై కమిషనర్‌కు భారత్ విదేశాంగ శాఖ కార్యదర్శి తన తీవ్ర నిరసనను తెలిపారు. పీవోకేలోని ప్రాంతాలన్నీ భారత్‌లో అంతర్భాగమేనని అలాగే, అంతర్జాతీయ సమాజం కూడా తమ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని కోరింది.

తైవాన్‌లో మళ్లీ అధికార పార్టీదే అధ్యక్ష పీఠం

తైపీ (తైవాన్): తైవాన్ ఓటర్లు చైనా హెచ్చరికలను పట్టించుకోలేదు. అధికార పార్టీకే మూడోసారి అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టారు. శనివారం తైవాన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఇందులో తైవాన్ అధికార పార్టీ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డీపీపీ) అధ్యక్ష అభ్యర్థి లాయ్ చింగ్-తే విజయం సాధించారు. ఆయనకు ఓటు వేయవద్దని చైనా హెచ్చరించినప్పటికి బేఖాతరు చేసిన తైవాన్ ఓటర్లు అధికారపార్టీ వైపే మొగ్గు చూపారు.

అటల్‌సేతుపై కారులో

ఒకవైపు ప్రయాణిస్తే రూ.250

» వంతెనపై రానుపోను రూ.375

» టోల్ చార్జీలను సవరించిన మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై, జనవరి 13: అటల్ సేతు (ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్) వంతెన మీదుగా ప్రయాణించే వాహనాల నుంచి వసూలు చేసే టోల్ ఫీజుల్లో మహారాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రజల విజ్ఞప్తుల మేరకు సవరణలు చేసింది. ఈ వంతెనపై ప్రయాణించే కారుకు ఒకవైపు వెళ్లేందుకు రూ.250, రానుపోను రూ.375 వసూలు చేస్తారు. రోజువారీ పాస్‌కు రూ.625, నెలవారీ పాస్ అయితే రూ.12,500 చెల్లించాలి. అయితే ఇవి మరీ ఎక్కువగా ఉన్నాయన్న విమర్శలు రావడంతో దూరం వారీగా ఫీజును నిర్ణయించారు. సేవ్రీ నుంచి శివాజీనగర్ వరకైతే రూ.200, శివాజీనగర్ నుంచి నగర్ గవహాన్ (1.5 కి.మీ) వరకు రూ.50 వసూలు చేస్తారు. ఇక బస్సులు, రెండు ఇరుసుల లారీలకు ఒకవైపు టోల్ కింద రూ.830 చార్జి చేస్తారు. రెండు వైపులకైతే రూ.1,245గా నిర్ణయించారు. రోజువారీ పాస్ అయితే రూ.2,075, నెలవారీ పాస్ కింద రూ.41,500 వసూలు చేస్తారు. కాగా, ఓవర్‌సైజ్ వాహనాలకు ఒకవైపునకు రూ.1,580, రానూపోనుకు రూ.2,370, రోజువారీ పాస్ కింద రూ.3,950, మంత్లీ పాస్ కింద రూ.79 వేలు టోల్ ఫీజుగా నిర్ణయించారు. అటల్ సేతును దక్షిణ ముంబయిలోని సేవ్రీ నుంచి నవీ ముంబయిలోని నవ్ సేవా వరకు 21.8 కిలోమీటర్ల పొడవున నిర్మించారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతుండగా వంతెను మీదుగా వెళ్తే కేవలం 15-20 నిమిషాల్లో వెళ్లవచ్చు. దేశంలోనే పెద్దదైన ఈ సముద్ర వంతెనను రూ.21,200 కోట్ల వ్యయంతో నిర్మించారు. టోల్ వసూలుకు సింగపూర్‌లో అమల్లో ఉన్న ఓపెన్ రోడ్ టోలింగ్ (ఓఆర్‌టీ) విధానాన్ని అనుసరిస్తున్నారు.

'ఇండియా' చైర్మన్‌గా ఖర్గే

కూటమి ఏకగ్రీవ ఆమోదం.. కన్వీనర్‌గా నితీశ్ పేరు ప్రతిపాదన.. తిరస్కరించిన జేడీయూ అధినేత

» వర్చువల్‌గా భేటీ అయిన కూటమి

» లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై చర్చ

» ముందస్తు పనుల వల్ల భేటీకి హాజరుకాని మమత, అఖిలేశ్, ఉద్ధవ్



న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పట్నా, జనవరి 13: ప్రతిపక్ష కూటమి ఇండియా చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా జేడీయూ అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పేరును కూటమి నేతలు ప్రతిపాదించారు. అయితే, ఆయన సున్నితంగా తిరస్కరించారు. శనివారం ఇండియా కూటమి పార్టీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యాయి. ఏప్రిల్-మే నెలలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధత గురించి చర్చలు జరిపాయి. ఈ సందర్భంగానే, కూటమికి నేతృత్వం వహించే నాయకుడి ఎంపికపై చర్చ జరిగింది. ఈ పదవికి కాంగ్రెస్ నుంచే ఎవరైనా ఉంటే బాగుంటుందని స్వయంగా నితీశ్‌కుమార్ పేర్కొన్నారు. మిగిలిన నేతలు కూడా దీనికి అంగీకరించారు. ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గే పేరు ముందుకు రాగా, హాజరైన నేతలందరూ ఆమోదం తెలిపారు. తద్వారా ఆయన ఇండియా కూటమి చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అయితే, కూటమి కన్వీనర్ పదవిని నితీశ్‌కుమార్ కోరుకుంటున్నారని కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఇదే సమావేశంలో.. చైర్‌పర్సన్ తర్వాత స్థానమైన కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టవలసిందిగా కోరుతూ పలువురు నితీశ్ పేరును ప్రతిపాదించారు. దీనిని నితీశ్ సున్నితంగానే తిరస్కరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై జేడీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఝా మాత్రం భిన్నంగా స్పందించారు. సదరు ప్రతిపాదనకు నితీశ్ ఇప్పటి వరకైతే ఆమోదం తెలుపలేదని, దీనిపై తమ పార్టీలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పటం విశేషం. శనివారం నాటి సమావేశానికి నితీశ్‌తోపాటు సంజయ్ కుమార్ ఝా కూడా హాజరయ్యారు. ఖర్గేకు చైర్‌పర్సన్ పదవిని అప్పగించటంపై నితీశ్ నిరాశ చెందారా అన్న విలేకర్ల ప్రశ్నకు.. అటువంటిదేమీ లేదని, ఆ పదవిని కాంగ్రెస్‌కు చెందిన వారే ఎవరైనా తీసుకోవాలని స్వయంగా నితీశే ప్రతిపాదించారన్నారు. కాగా, ఇండియా కూటమి వర్చువల్ భేటీకి.. ముందస్తు కార్యక్రమాల కారణంగా మమతాబెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన) హాజరు కాలేదు. కన్వీనర్‌గా నితీశ్ నియామకంపై వారితోనూ చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సమావేశంలో నితీశ్ కుమార్ (జేడీయూ), శరద్ పవార్ (ఎన్సీపీ), స్టాలిన్, కనిమొళి (డీఎంకే), హేమంత్ సోరెన్ (జేఎంఎం) తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం అందిస్తాం: పవార్


కూటమి సమావేశం అనంతరం ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను విలేకర్లు సంప్రదించగా, కన్వీనర్ పదవి కోసం నితీశ్ పేరును ప్రతిపాదించినప్పటికీ.. అసలు కన్వీనర్ పదవే అవసరం లేదని, దాని బదులు కొన్ని పార్టీల అధినేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేయటం మంచిదని నితీశ్ అభిప్రాయపడ్డారని పవార్ చెప్పారు. 'ఓట్ల కోసం ఎవరో ఒక నేతను ముందు పెట్టాల్సిన అవసరం లేదు. ఎన్నికల తర్వాత ఒక నేతను మేం ఎన్నుకుంటాం. ప్రజలకు ప్రత్యామ్నాయం అందిస్తామన్న నమ్మకంతో ఉన్నాం. 1977లో కూడా నాటి ప్రతిపక్షాలు ఎన్నికల ముందే మొరార్జీ దేశాయ్ పేరును ప్రధాని అభ్యర్థిగా ఏమీ ప్రచారం చేయలేదు' అని గుర్తు చేశారు. కూటమి అనుసరించాల్సిన విధానాల గురించి చర్చ జరిగిందని, సీట్ల పంపకాలపై మాట్లాడుకోలేదని వెల్లడించారు. దేశవ్యాప్తంగా సంయుక్తంగా బహిరంగ సభలు నిర్వహించాలని, ఆ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

తన పరిమితుల్ని కాంగ్రెస్ తెలుసుకోవాలి: తృణమూల్

ఇండియా కూటమి వర్చువల్ సమావేశానికి తమ అధినాయకురాలు మమతా బెనర్జీ పలు ముందస్తు కార్యక్రమాల కారణంగా హాజరు కాలేదని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు తెలిపారు. బెంగాల్‌లో రాజకీయ పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉన్న పరిమితుల్ని, బలహీనతల్ని ఆ పార్టీ అధిష్ఠానం గుర్తించాలన్నారు. బెంగాల్‌లో బీజేపీని ఓడించే పోరాటానికి తాము నేతృత్వం వహిస్తామని, కాంగ్రెస్ ఇందుకు అంగీకరించాలన్నారు. కాగా, బెంగాల్‌లో సీట్ల పంపకాలపై ఢిల్లీకి చర్చలకు రావాల్సిందిగా ఇటీవల కాంగ్రెస్ పంపిన ఆహ్వానాన్ని తృణమూల్ తిరస్కరించింది. కాగా, ఇండియా కూటమి వర్చువల్ మీటింగ్‌ను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎద్దేవా చేస్తూ.. 'అదొక వర్చువల్ కూటమి. కాబట్టి వర్చువల్ సమావేశాలే జరుపుతుంది' అని పేర్కొన్నారు.

చైర్‌పర్సన్ పదవి వద్దన్న రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి భేటీలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని కూటమి చైర్‌పర్సన్‌గా నియమించాలని జేఎంఎం నేత, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రతిపాదించారు. తాను భారత్‌జోడో న్యాయ యాత్ర చేపడుతున్నందున ఆ బాధ్యత తీసుకోలేనని రాహుల్ సున్నితంగా తిరస్కరించారు. ఖర్గే పేరును సీపీఎం నేత సీతారాం ఏచూరి ప్రతిపాదించగా మిగతా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా సీట్ల పంపిణీ విషయంపై తమ మధ్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని సమావేశం తర్వాత ఖర్గే తెలిపారు. రాహుల్ యాత్రలో వీలును బట్టి పాల్గొనాల్సిందిగా ఖర్గే చేసిన అభ్యర్థనకు మిత్రపక్షాలు సానుకూలంగా స్పందించాయి.



ఉగ్రవాదం నిర్మూలనకు

'ఆపరేషన్ సర్వశక్తి'

కశ్మీర్‌లోని పీర్ పంజాల్ కొండల్లో అమలు.. పాక్ కుయుక్తులకు చెక్

న్యూఢిల్లీ, జనవరి 13: జమ్మూ-కశ్మీర్‌లో పాకిస్థాన్ ప్రోద్బలంతో జరుగుతున్న ఉగ్రవాద చర్యలను అణచివేసేందుకు భారతసైన్యం సన్నద్ధమైంది. ఇందుకు 'ఆపరేషన్ సర్వశక్తి' వ్యూహాన్ని అమలు చేయనుంది. ఇటీవలికాలంలో రాజౌరీ-పూంచ్ సెక్టారులోని పీర్ పంజాల్ పర్వతశ్రేణి దక్షిణ భాగంలో ఉగ్రవాద కార్యకలాపాలు అధికమయ్యాయి. ఉగ్రవాదుల దాడుల్లో ఇప్పటికే 20 మంది భద్రత సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. గత నెల 21న డేరా కీ గలీ ప్రాంతంలో ఉగ్రవాదుల కాల్పుల్లో నలుగురు జవాన్లు మరణించారు. దాంతో పీర్ పంజాల్ కొండల్లో ఉగ్రవాదుల ఏరివేతకు భద్రత బలగాలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందుకోసమే ఆపరేషన్ సర్వశక్తికి రూపకల్పన చేశారు. శ్రీనగర్‌లోని చినార్ కార్ప్స్, నగ్రోటాలోని వైట్ నైట్ కార్ప్స్, జమ్మూ-కశ్మీర్ పోలీసు, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ ఆపరేషన్ గ్రూపు, నిఘావర్గాలు అన్నీ మరింత సమన్వయంతో పనిచేయనున్నాయి. గతేడాది పీర్ పంజాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 'ఆపరేషన్ సర్ప్ వినాశ్' చేపట్టి విజయం సాధించారు. ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్‌పాండే మాట్లాడుతూ పీర్ పంజాల్ ప్రాంతంలో గతేడాదికే పూర్తిగా ఉగ్రవాద నిర్మూలన జరిగిందని, కానీ 'పశ్చిమ దిశ శత్రువు' దాన్ని మళ్లీ రాజేస్తోందని చెప్పారు. దీన్ని ఎదుర్కోవడానికి ఆయన నార్తర్న్ కమాండ్ అధికారులతో క్షుణ్ణంగా చర్చలు జరిపారు. ఆర్మీ ప్రధాన కార్యాలయం, ఉధంపూర్‌లోని నార్తర్న్ కమాండ్ కార్యాలయం సునిశిత పర్యవేక్షణలో ఈ ఆపరేషన్‌ను అమలు చేయనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జరిపిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం అనంతరం ఈ ఆపరేషన్‌కు రూపకల్పన చేశారు.



ధరలు, నిరుద్యోగమే ప్రధాన ఎజెండా

» నేడు ప్రారంభం కానున్న రాహుల్ న్యాయ్‌యాత్ర

ఇంఫాల్, జనవరి 13: పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, సామాజిక న్యాయం ప్రధాన అంశాలుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్‌యాత్ర మణిపూర్ రాష్ట్రం నుంచి ఆదివారం ప్రారంభం కానుంది. 15 రాష్ట్రాల్లోని 100 లోక్‌సభ నియోజకవర్గాల మీదుగా సాగే ఈ న్యాయ్‌యాత్ర భారత్ జోడో యాత్ర లాగే పార్టీకి పేరు తెస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యల మీద పార్లమెంటులో మాట్లాడనివ్వనందున.. ప్రజలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం దక్కాలని కోరుతూ న్యాయ్‌యాత్ర చేపడుతున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ ప్రధానంగా చేపడుతున్నందున.. కాంగ్రెస్ నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలను ఈ యాత్ర ద్వారా వెలుగులోకి తేవాలని భావిస్తోంది. అసలైన సమస్యలపై ప్రజల దృష్టి పడకుండా భావోద్వేగ అంశాలను రాజకీయాలకు వాడుకుంటూ దేశ ప్రజలను మోసం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆయన 'ఎక్స్'లో ఒక పోస్టు చేస్తూ... మన కలల భారతం ఇదేనా...? జీవన ప్రమాణాలు ముఖ్యమా... భావోద్వేగ అంశాలా...? ఆందోళనల్లో నినాదాలివ్వడమా... ఉద్యోగాలా? ప్రేమ... ద్వేషమా? ఏది ముఖ్యం అనేదానిపై యువత ఆలోచించాలన్నారు.



విదేశాల్లో 'అయోధ్య'

ప్రత్యక్ష ప్రసారాలు

» అమెరికాలోని 10 రాష్ట్రాల్లో భారీ బిల్‌బోర్డుల ఏర్పాటు

» ఆఫ్రికాలోని మారిషస్‌లో 10 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు

వాషింగ్టన్, పోర్ట్ లూయిస్, జనవరి 13: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ జరపనున్న నేపథ్యంలో అమెరికాలోని పదికిపైగా రాష్ట్రాలలో రామమందిరానికి సంబంధించిన భారీ బిల్‌బోర్డులను 40కిపైగా ఏర్పాటు చేస్తున్నట్లు వీహెచ్‌పీ-అమెరికా ప్రధానకార్యదర్శి అమితాబ్ వీడబ్ల్యూ మిత్తల్ తెలిపారు. ఇప్పటికే టెక్సాస్, ఇల్లినాయిస్, న్యూయార్క్, న్యూజెర్సీ జార్జియా రాష్ట్రాలలో ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అరిజోనా, మిస్సోరీ రాష్ట్రాలలో ఈనెల 15వ తేదీన రామమందిర బిల్‌బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే అమెరికాలోని హిందువులు భారీ కారు ర్యాలీలు నిర్వహించారు. అలాగే, ఆఫ్రికా ఖండంలోని మారిషస్ దేశంలో హిందువులైన ఉద్యోగులు ఈనెల 22న పూజల్లో పాల్గొనేందుకు రెండు గంటలు అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు ఆ దేశ కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం మారిషస్ జనాభాలో హిందువులు దాదాపు 48.5 శాతం ఉన్నారు. కాగా, ఆ దేశ జనాభాలో 68%వరకు భారత సంతతికి చెందినవారే. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో వచ్చే 10 రోజులు మారిషస్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మారిషస్ సనాతన ధర్మ టెంపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఘూర్బిన్ భోజ్‌రాజ్ తెలిపారు. వీధుల్లో ర్యాలీలు, చారిత్రక, ముఖ్యమైన భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించడంతోపాటు ముఖ్యమైన కూడళ్లలో ఎల్‌సీడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి మందిర ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు చెప్పారు. ఈనెల 22న అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ రామాలయ ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు మారిషస్ సీనియర్ మంత్రి అంజీవ్ రామ్‌ధన్య చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రమిదలు కూడా వెలిగించనున్నట్టు తెలిపారు.

టాయ్‌లెట్ ముచ్చట్లు!

మీ కమోడ్ మీతో మాట్లాడుతుంది.. బోర్ కొట్టకుండా పాటలూ వినొచ్చు



కాలంతోపాటు పరుగులు తీస్తూ.. క్షణం తీరిక లేనివారు చాలా మంది టాయ్‌లెట్‌లో న్యూస్‌పేపర్ చదవడం తెలిసిందే..! కొందరు పుస్తకాల పురుగులైతే టాయ్‌లెట్‌లోనూ ఏదో ఒకటి చదువుతూనే ఉంటారు. మరికొందరు మేధావులు తమ ఆలోచనలకు టాయ్‌లెట్‌లోనే పదును పెడుతుంటారు. కానీ, ఇకపై ఎంచక్కా టాయ్‌లెట్‌తో మాట్లాడొచ్చు..! బోర్ కొడితే.. ఇష్టమైన పాటను వినిపించమని టాయ్‌లెట్‌ను అడగొచ్చు కూడా..! టాయ్‌లెట్‌లో పనైపోయాక ఫ్లష్ నొక్కమని ఆదేశిస్తే వెంటనే చేసిపెడుతుంది. మోషన్ సెన్సర్‌తో ఒక వ్యక్తి టాయ్‌లెట్‌లోకి వెళ్లగానే కమోడ్ కవర్ ఆటోమేటిక్‌గా తెరుచుకుంటుంది.. అక్కడి నుంచి వెళ్లగానే మూసుకుంటుంది. 2024లో కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీతో రూపుదిద్దుకున్న కొన్ని ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో మాట్లాడే టాయ్‌లెట్ అగ్రస్థానంలో నిలిచింది. లాస్‌వెగాస్‌లో జరుగుతున్న కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ షో(సీఈఎస్-2024)లో దీంతోపాటు మరికొన్ని వినూత్న ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

సెంట్రల్ డెస్క్

ప్లంబింగ్ పరికరాల తయారీ దిగ్గజం కోహ్లెర్ 'ప్యూర్‌వాష్ ఈ930 బైడెట్ టాయ్‌లెట్ సీట్‌ను సీఈఎస్‌లో ప్రదర్శించింది. దీని ధర రూ.1.77లక్షలు (2,139డాలర్లు). దీన్ని చాలా మోడళ్ల వెస్టర్న్ కమోడ్‌లకు బిగించవచ్చు. దీన్ని బిగించాక టాయ్‌లెట్ స్మార్ట్‌గా మారుతుందని కోహ్లెర్ చెబుతోంది. "దీని సెల్ఫ్ వాషింగ్ టెక్నాలజీలో అతినీల లోహిత(యూవీ) లైట్ ఉంటుంది. బ్యాక్టీరియా అంతు చూసేలా టాయ్‌లెట్‌ను శుభ్రపరుస్తుంది. అవసరమైతే హీటర్‌ను ఉపయోగించుకుని వేన్నీళ్లతో శుభ్రం చేస్తుంది. రూమ్‌ఫ్రెష్నర్‌లనూ స్ప్రే చేసి టాయ్‌లెట్‌ను శుభ్రంగా పెడుతుంది. సీటుపై తేమలేకుండా ఎయిర్ డ్రైయర్‌ను వాడుతుంది. గూగుల్ హోమ్, గూగుల్ అసిస్ట్, అమెజాన్ అలెక్సాలతో ప్యూర్‌వాష్ ఈ930ని అనుసంధానం చేయొచ్చు. వాయిస్ కమాండ్/రిమోట్‌తో ఆపరేట్ చేయవచ్చు.

చాట్‌జీపీటీకి భౌతిక రూపం



ఏఐ లాంగ్వేజ్ మోడల్ చాట్‌జీపీటీ గురించి తెలియని వారు ఉండరు. సీఈఎస్-2024లో చాట్‌జీపీటీకి భౌతిక రూపాన్నిస్తూ ఓపెన్ ఏఐ సంస్థ 'వీహెడ్' పరికరాన్ని ప్రదర్శించింది. ఈ పరికరాన్ని చాట్‌జీపీటీ తలగా అభివర్ణించింది. అలెక్సా మాదిరిగానే ఆదేశాలకు అనుగుణంగా అత్యంత వేగంగా సమాధానాలను ఇస్తుంది.

నువ్వు పళ్లను సరిగ్గా తోమట్లేదు!



సీఈఎస్-2024లో ఏఐ ఆధారిత మరో ఆవిష్కరణ ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అదే మాట్లాడే ఎలక్ట్రానిక్ టూత్‌బ్రష్- ఓక్లీన్ ఎక్స్ అల్ట్రా..! ఈ బ్రష్‌ను వాడేవారు తమ నోట్లోకి కంప్యూటర్‌ను పంపి స్కాన్ చేసుకున్నట్లే. పళ్ల పటుత్వం, బలహీనతలను ఈ టూత్‌బ్రష్ ఇట్టే కనిపెడుతుంది. ఏఐ వాయిస్ కమాండ్స్ ద్వారా పళ్లను మరింత శుభ్రం చేసుకోవచ్చు. ఈ బ్రష్‌కు కస్టమ్ మోడ్స్, ఇంటరాక్టివ్ స్క్రీన్ మోడ్ ఉంటాయి. ఇది నిమిషానికి 84వేల కదలికలతో పళ్లను శుభ్రం చేస్తుంది. ఇందులో 5 రకాల బ్రషింగ్ మోడ్స్ ఉంటాయి. దీని ధర సుమారు రూ.10 వేలు.

గురకను తగ్గించే దిండు



నిద్రలో గురక చాలా మందికి సమస్యే! సర్కేడియన్ రిథమ్ సిండ్రోమ్‌తోపాటు పలు కారణాలు గురకకు దారి తీస్తాయి. సీపాప్ లాంటి పరికరాలెన్నో దీనికి విరుగుడుగా మార్కెట్లో ఉన్నాయి. సీఈఎస్ ప్రదర్శనలో పరిశోధకులు ఓ స్మార్ట్ దిండు ను పరిచయం చేశారు. ఏఐ పరిజ్ఞానంతో పనిచేసే ఈ దిండు (ద డెరుస్సీ యాంటీ-స్నోర్ స్మార్ట్ పిల్లో) నిద్రించే వ్యక్తి గురక కొట్టినట్లు గుర్తించగానే.. శ్వాస ఇబ్బంది లు తొలగేలా దిండు స్థాయిలో మార్పులు చేస్తుంది. దీంతో89% దాకా గురక తగ్గుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

మీరు చూస్తున్న పక్షి పేరు చెప్పేస్తుంది





స్వరోవ్‌స్కీ సంస్థ రూపొందించిన బైనాక్యులర్లు.. మనం చూస్తున్న పక్షుల పేర్లను చెప్పేస్తాయి. 'మెర్లిన్ బర్డ్ ఐడీ' డేటాబేస్ ద్వారా 9 వేల రకాల పక్షులను ఈ బైనాక్యూలర్లలో నిక్షిప్తం చేశారు. ఎవరైనా ఈ బైనాక్యూలర్ ద్వారా ఒక పక్షిని చూస్తే.. ఏఐ ద్వారా దాని పేరు, శాస్త్రీయ నామం మొదలు.. వివరాలన్నింటినీ చకచకా చెప్పేస్తుంది. ఇవే కాకుండా.. సీఈఎస్‌లో ఎన్నెన్నో వింతలు, విశేషాలున్నాయి. మాంసాన్ని ఏఐ సాయంతో గ్రిల్ చేసే పరికరం, ఏఐ ద్వారా ఫోన్లలోని యాప్‌లను నియంత్రించే టూల్, తెరపైన ప్రత్యక్షమై ఏఐ ద్వారా కోరిన వివరాలు అందించే 'ర్యాబిట్'.. ఇలా ఎన్నో కొంగొత్త ఆవిష్కరణలున్నాయి.

పారదర్శక టీవీ



ఎలక్ట్రానిక్స్ షోలో టీవీల ఉత్పత్తి దిగ్గజం ఎల్‌జీ 'ట్రాన్స్‌పరెంట్ టీవీ ఎల్‌జీ 77ఇంచ్ ఓఎల్ఈడీ టీ'ని ప్రదర్శించింది. ఈ టీవీ పూర్తి పారదర్శకంగా ఉంటుంది. అంటే.. టేబుల్‌పై టీవీని పెడితే.. టెలివిజన్ సెట్ వెనక ఉన్న వస్తువులను స్పష్టంగా చూడవచ్చు. టీవీ కార్యక్రమాలను వీక్షిస్తున్నప్పుడు కూడా అవసరమనుకుంటే.. బ్యాక్‌గ్రౌండ్‌ను చూసేలా ఈ టీవీలో ఫీచర్లున్నాయి.

సరయూ నదీ తీరం జిగేల్

రామమందిర ప్రారంభం సందర్భంగా వెలుగులు

ముఖ్య కూడళ్లలో రామచరిత మానస్ శ్లోకాల హోర్డింగులు

అయోధ్య, జనవరి 13: అయోధ్యలో రామమందిరానికి ఈనెల 22న ప్రాణప్రతిష్ఠ జరపనున్న సందర్భంగా సరయూ నది తీరాన్ని ప్రమిదలు, బాణసంచా కాంతులతో జిగేల్ మనిపించనున్నారు. ఆలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 18 నుంచి ఆ ప్రాంతంలో ప్రైవేటు భవనాల నిర్మాణాలపై నిషేధం అమలు చేస్తున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. భక్తులకు పర్యాటక ప్రదేశాల సమాచారం తెలియజేసేందుకు 250 మంది వరకు పోలీసు గైడ్‌లను నియమించినట్టు చెప్పారు. దీంతోపాటు డిజిటల్ టూరిస్ట్ యాప్‌ను ఆదివారం ప్రారంభించనున్నారు. అయోధ్యలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ విద్యుత్ కాంతులతో అలంకరించనున్నారు. నగరంలోని ముఖ్య కూడళ్లలో రామచరిత మానస్ శ్లోకాలతో హోర్డింగ్‌లను, తప్పిపోయినవారి కోసం 'లాస్ట్ అండ్ ఫౌండ్' కేంద్రాలను సమాచార శాఖ ఏర్పాటు చేయనుంది. అత్యాధునిక 4కే సాంకేతికతతో వివిధ డీడీ ఛానళ్లలో వివిధ భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసారమాధ్యమాల శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. కాగా, అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి వెళ్లరాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ నిర్ణయించారు. తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అయోధ్య రామాలయ ట్రస్టు ప్రధానకార్యదర్శి చంపత్ రాయ్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. ప్రారంభోత్సవం జరిగాక కుటుంబంతో కలిసి రామమందిరానికి వస్తానని లేఖలో ఆయన తెలిపారు.

రైతుబంధుకు లైన్‌క్లియర్!

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఉపశమనం దక్కనుంది. రైతుబంధు చెల్లింపులకు నిధుల కొరత రూపంలో ఉన్న అడ్డంకులు తొలగున్నాయి. నత్తనడకన సాగుతున్న రైతుబంధు నిధుల జమ వ్యవహారం సంక్రాంతి పండుగ తర్వాత పుంజుకోనుంది.. రైతుబంధు పథకం కోసం రెండు, మూడు రోజుల్లో నిధులు సర్దుబాటు కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 9 వేల కోట్ల రుణం మంజూరుచేయగా అందులో ఈనెల 16వ తేదీన రూ. 2 వేల కోట్లు వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా రైతుబంధు పథకం కింద నగదు బదిలీకి మార్గం సుగమమైంది. సంక్రాంతి పండుగ మరుసటి రోజు ఖజానాకు నిధులు రాగానే... చెల్లింపులను ప్రారంభించి, ఫిబ్రవరిలో పూర్తిచేయటానికి సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. యాసంగి సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబరు 9వ తేదీన ప్రారంభించిన విషయం తెలిసిందే! అయితే ఖజనాలో డబ్బులు నిండుకోవటంతో రైతుబంధుకు నిధులు సర్దుబాటు చేయటం కష్టంగా మారింది. తొలుత ఒకఎకరం వరకు చెల్లింపులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు సుమారు 21 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1,050 కోట్లు జమ చేశారు. నిధులు సర్దుబాటైతే రెండెకరాల వరకు, ఆతర్వాత మూడెకరాల వరకు... ఇలా రోజు రోజుకు విస్తీర్ణం పెంచుకుంటూ నగదు బదిలీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కానీ నిధుల కొరత కారణంగా నెల రోజుల్లో రూ.వెయ్యి కోట్ల వరకే చెల్లింపులు చేయగలిగింది. రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల విస్తీర్ణానికి రైతుబంధు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 69 లక్షల మంది రైతులకు రూ. 7,625 కోట్ల నిధులు కావాలి. ఇందులో ఇప్పటిదాకా కేవలం వెయ్యి కోట్ల వరకే నిధులు సర్దుబాటయ్యాయి. ఇంకా 48 లక్షల మంది రైతులకు చెల్లించటానికి సుమారు రూ. 6,600 కోట్ల వరకు నిధులు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 9 వేల కోట్ల రుణం మంజూరు చేసింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలతో కూడిన చివరి త్రైమాసికానికి అప్పు తీసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వటంతో రాష్ట్ర ప్రభుత్వానికి కాస్త ఊరట లభించింది. ఈ క్రమంలో ఈనెల 16 తేదీన ఆర్బీఐ నిర్వహించే వేలంపాటలో పాల్గొని రూ. 2 వేల కోట్లకు లోన్ ఇండెంట్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన రూ. 7 వేల కోట్లను కూడా విడతలవారీగా తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అయితే తొలి విడతలో రూ. 2 వేల కోట్లు రాగానే... రైతుబంధు పథకానికే కేటాయించాలని సర్కారు భావిస్తోంది. ఆర్బీఐ నుంచి ఖజానాకు నిధులు వస్తున్న కొద్దీ... వాటిని రైతుబంధుకు కేటాయించే అవకాశాలున్నాయి.

బీఆర్‌ఎస్‌కు 11 ఎకరాలు కేటాయించడం అక్రమం

» హైకోర్టులో మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో బీఆర్‌ఎస్‌కు భూమి కేటాయించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో మరో వ్యాజ్యం దాఖలయింది. ఆపార్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్సీ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం కోసం రూ.వందల కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని తక్కువ మొత్తానికి కేటాయించడం అక్రమమని పేర్కొంటూ న్యాయవాది ఏ వెంకట్రామిరెడ్డి ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిటిషన్‌కు రిజిస్ట్రీ నెంబర్ కేటాయించాల్సి ఉంది. బీఆర్‌ఎస్‌కు హైదరాబాద్‌లో ఇప్పటికే పార్టీ కార్యాలయం ఉన్నప్పటికీ అత్యంత విలువైన 11 ఎకరాల భూములను మళ్లీ కేటాయించడం అక్రమమని పేర్కొంటూ ఇప్పటికే ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) సంస్థ కార్యదర్శి ఎం పద్మనాభ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ ఎకరం మార్కెట్ ధర రూ. 50 కోట్లకు పైగా ఉండగా, దాన్ని రూ.3.41 కోట్లకే ఇచ్చారని తెలిపారు.

నల్లమల గిరిజనులతో రేపు ప్రధాని వర్చువల్ మీటింగ్

» పీఎం జన్‌మన్ పథకం అమలుపై చర్చ!

మన్ననూర్, జనవరి 13 : నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని చెంచులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 15న వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశానికి ఆదివాసీ గురుకుల విద్యాలయం(పీటీజీ)ని ఎంపిక చేశారు. జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్ ఇతర అధికారులతో కలిసి శనివారం సమావేశ స్థలాన్ని పరిశీలించారు. డిజిటల్ తెర ఏర్పాటుపై బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించారు. సమావేశానికి జిల్లా పరిధిలోని అన్ని పెంటల నుంచి చెంచులు, చెంచు ప్రజా ప్రతినిధులు మొత్తం 800 మందిని ఆహ్వానించనున్నట్లు అధికారులు తెలిపారు. చెంచుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం జన్‌మన్ పథకం అమలుపై సమావేశంలో చర్చ ఉంటుందని తెలుస్తోంది. చెంచు పెంటల్లో పాఠశాల భవనాల నిర్మాణం, గృహాల నిర్మాణం, స్వయం ఉపాధి కల్పన, సౌర విద్యుత్ ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గిరిజనులతో మాట్లాడి తెలుసుకోనున్నారు.



యాదాద్రికి భోగ్ సర్టిఫికెట్

ఆలయాధికారులకు అందజేసిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సీఈఓ

యాదగిరిగుట్ట, జనవరి 13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రతిష్ఠాత్మక బ్లిస్‌ఫుల్ హైజీనిక్ ఆఫరింగ్ టు గాడ్(భోగ్) సర్టిఫికెట్ లభించింది. ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికారిక సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కమలావర్ధన్‌రావు శనివారం దేవస్థాన అధికారులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. అంతకు ముందు ఆయన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించగా, దేవస్థాన అధికారులు ఆయనకు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగ్ సర్టిఫికెట్ కోసం దేశంలోని 70కి పైగా ప్రముఖ దేవాలయాలు దరఖాస్తు చేసుకున్నాయని, కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక ఆడిట్ బృందం ఆయా దేవాలయాల్లో పలుమార్లు పర్యటించి స్వామికి నివేదన, విక్రయించే ప్రసాదాలు, ఉచిత అన్నప్రసాదాల తయారీ నాణ్యత, వంటశాల నిర్వహణ, శుచి, శుభ్రత తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి అవగాహన కల్పించినట్లు వివరించారు.

విలేజ్ మోనోగ్రఫీల రూపకల్పన

మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో జీకాట్ చర్చ

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన విలేజ్ మోనోగ్రఫీ(గ్రామ సమగ్ర సమాచారం)ని రూపొందించేందుకు పుణెలోని మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)తో గ్రామోదయ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ(జీకాట్) చర్చలు జరిపింది. ఒక గ్రామానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను రూపొందించేందుకు ఆయా గ్రామాల మోనోగ్రఫీ అవసరమని జీకాట్ వ్యవస్థాపకుడు డిల్లీ వసంత్ తెలిపారు. పుణెలోని ఎంఐటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఆయన ఈ అంశానికి సంబంధించి జీకాట్-ఎంఐటీ మధ్య ఒక ఒప్పందం దిశగా ముందుకెళ్లనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఔటర్' అక్రమాలపై అధికారుల విచారణ

సెలవు రోజు అయినప్పటికీ వివరాల సేకరణ

ఘట్‌కేసర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'దోస్త్‌కు సర్వీస్'.. 'ఔటర్‌లో చీటర్స్' వరుస కథనాలపై అధికారులు విచారణ చేపట్టారు. శనివారం సెలవు రోజు అయినప్పటికీ కలెక్టర్ కార్యాలయానికి చెందిన అధికారి ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయంలో ఔటర్ కోసం సేకరించిన భూముల రికార్డులను పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. కాగా, ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఘట్‌కేసర్‌లో మీడియాతో మాట్లాడారు. ఔటర్ భూముల్లో మాజీ మంత్రి మల్లారెడ్డి అనుచరులు తిష్టవేశారని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి రోడ్లను అభివృద్ధి చేసేందుకు రూ.7.5 కోట్ల నిధులను మంజూరు చేసేందుకు కృషి చేశామని తెలిపారు. నేటికీ స్థలం అప్పగించకపోవడంతో పనులు చేయలేకపోతున్నామని చెప్పారు. అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంక్రాంతి కాంతులు



శ్రీ శుభములిచ్చి తెలుగిళ్ళ సిరులు దెచ్చి
గతపు కార్తీక మాసపు కాంతులిచ్చి
పుష్య మాసపు పూజల పుణ్యమిచ్చి
తెలుగు ముంగిళ్ళ రావమ్మ వెలుగులిచ్చి

గత చితికిన బ్రతుకులలో వెతలు బాపి
మంచి మానవత మమత మనసు నిల్పి
క్రాంతితో భోగి సంక్రాంతి క్రమ రీతి
పెద్ద పండగై రావమ్మ పేర్మి మీర

ఉమ్మడి కుటుంబ బంధాల యూసులేవి
ఉన్న యూరిపై మమకారమున్న నేమి
పల్లె రైతు జీవితములు డొల్లలాయె
ధరలు ఆకాశవీధుల దరికి జేరె

అయిన మాయిళ్ళ ముంగిట యాడ పడుచు
లా గడప గడపలయందు లాటలాడి
పాడిపంటల పండగై భాగ్య రీతి
ముద్దు మురిపాలు తేవమ్మ ముద్దబంతి

చిరము శ్రీశైల మల్లన్న సిరులనివ్వ
ధక్షవాటికా భీమన్న దయను జూప
భవుడు కాలేశ్వరుడు సదా భాగ్యమీయ
మన తెలుగు సీమలెప్పుడూ మహిత కాగ
ఇంటి యింటికిట శుభములీయ రావమ్మ

– రాఘవ మాస్టారు కేదారి

సంక్రాంతి వర్ధిల్లుగాక



మేర లేని ప్రకృతి మంచు చీరగట్టు
సొగసులారబోయు భువి ఉషోదయాన
భక్తి భావ సంపదలకు పట్టు గొమ్మ
సత్కవి ప్రస్తుతంబైన సంకురాత్రి

బంతి పూలు విచ్చంగ సంక్రాంతి వచ్చె
కడగి దాసు పాడంగ సంక్రాంతి వచ్చె
రంగవల్లి పిల్వంగ సంక్రాంతి వచ్చె
గంగిరెద్దు చిందేయ సంక్రాంతి వచ్చె

అరయ సరసాల సరదాలకాకరమ్ము
అంబరంబంటు ప్రజలలో సంబరమ్ము
ఉక్కుప్రకటించు సమరాన కుక్కుటమ్ము
వశమె– వర్ణింప సంక్రాంతి వైభవమ్ము

భాగ్యమొసగు గదా క్రాంతి భావనంబు
శ్రేయమొసగు గదా భవ్యపాయసంబు
చెలిమి పంచు గదా నవజీవనంబు
కలిమి నింపు గదా శుభ కామితంబు

పృథివి మానవ బంధాల వేదిక యిదె
అవని పంచభక్ష్యపు పరమాన్నమిదియె
సంతతానంద సౌభాగ్య సారమిదియె
నూతనోత్సాహమొనగూర్చు చేతనమిదె

శ్రమకు పట్టంబు గట్టు పర్వంబులోన
జానపదకళారూపాలు కాననగును
దానధర్మాల సద్బుద్ధి కాననగును
పూని పసులనర్చించుట కాననగును

కన్నెనంగజాతికి గర్వకారణంబు
అతులమౌ సమైక్యగతికి ఆర్ణవంబు
భాసుర యశోరమణికి సింహాసనంబు
దివ్యపాశుర కాంతి వర్ధిల్లుగాక!!

– మంకు శ్రీను

సకల శుభావహమై...



నింగి నేలు ఉదయాద్రి శోభల
రంగురంగుల రంగవల్లుల
గొబ్బియల గారాల నెలవుల
రాగరంజిత రమ్యవిపంచిగ
సంకురాతిరి తరలి వచ్చెను
సకల శుభావహమై

మంచు ముత్యపు పిలుపునందిన
పుష్యమాసపు పడతి వధువై
మహీతలపు ప్రణయ వేదిక
ముగ్ధమోహన రాగసుధగా
సంకురాతిరి మరల వచ్చెను

కృషికి ఫలితము చేతికందెను
రైతుబిడ్డకు ముదము హెచ్చెను
గంగిరెద్దుల గుణము పోవలె
హేతువాదపు విలువ తెలిసిన
శాంతి పథమె మనది కావలె

భోగిమంటల నింగి కెగసిన
భాగ్యమేమియు కూడిరాదు
ఆ అగ్నిజ్వాలల దహన మవవలె
అంతరంగపు కలుషమంతయు

అపుడె జాతికి తేజ మొదవును
భాగ్యరాసులె పొంగి పొరలును
ప్రజల రాజమె వెలసినపు డదె
నిక్కమగు సంక్రాంతి పర్వము

– పింగళి పాండురంగారావు

కొత్త పొంగలి రుచులతో...



----పాతకు గోరీ కడుతూ
కొత్తకు భేరీ కొడుతూ
భోగి మంటల సయ్యాటలా
బ్రతుకు బ్రతుకులో
సంక్రాంతులు' రావాలి

గంగిరెద్దులు నాట్యమాడినట్టు
బొమ్మల కొలువులు
ముచ్చట గొలిపినట్టు
జంగమ దేవరలు దీవించి నట్టు

పాడి పంటలు పొంగి పొరలే
రైతు సంక్రాంతులు రావాలి

ఇళ్ల ముంగిళ్లలో
ముత్యాల ముగ్గులు మురిసినట్టు
చలిపొద్దు పొడుపులో
సూరీడు ఎర్రబారినట్టు
నవనవోన్మేశంగా
నవ సంక్రాంతులు రావాలి


పడతులు పూల సజ్జలై
పట్టు పరికిణీలు కట్టినట్టు
చెరుకు కంకుల గడలు
తియ్యందనాలను చిమ్మినట్టు
అభి'రుచుల' సంక్రాంతులు రావాలి

పిల్లల భోగిపళ్ల ముచ్చటలా
కోడి పందాల కలహాల హేలలా
రథం ముగ్గులో గొబ్బిల్లలా
కొత్త పొంగలి రుచులతో
కొంగ్రొత్తగా సంక్రాంతి రావాలి..!

తాళం తీసినవారే తంటా తెస్తున్నారు!

భారతీయ నాగరికత విశిష్ట గుణం వైవిధ్యత. భాషలు, మతాలు, సంస్కృతులు, నైసర్గికతలు బహుళమైనవి. వాటిని అలంబన చేసుకున్న సామాజిక సముదాయాలలో భిన్నత్వం బహుముఖీనమైనది. అయితే ఏదీ విడిగా ఉండదు. ఆదానప్రదానాలు నిరంతరం జరుగుతూ ఉంటాయి. ఈ ప్రక్రియ అవిచ్ఛిన్నంగా సాగేందుకు తోడ్పడుతున్న శక్తి ఒకటి ఉన్నది. అదే కనుక లేనట్టయితే భారత్ చాలాకాలం క్రితమే పరస్పరం సంఘర్షించుకుంటున్న సామాజిక బృందాలు, జాతులుగా విచ్ఛిన్నమై వుండేది. ఏమిటా శక్తి? గురుదేవ్ రవీంద్రుడు శతాబ్దం క్రితమే దాని గురించి వివేచించారు. 1917లో 'జాతీయ వాదం'పై ఒక స్ఫూర్తిదాయక వ్యాసంలో ఆయన ఇలా రాశారు: 'భిన్న భిన్న జన సముదాయాలు కలసికట్టుగా ఉండగలిగే ఒక సామాజిక సమైక్యతను రూపొందించేందుకు భారత్ ఏ నాటినుంచో నానా ప్రయోగాలు చేస్తూ వస్తోంది. ఐక్యత పేరిట ఏ సామాజిక సముదాయ స్వేచ్ఛను కట్టడి చేయని సమైక్యత కోసం అన్వేషించింది. ఆ అన్వేషణ ఒక 'సామాజిక సమాఖ్య సంయుక్త రాజ్యాలు' (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఎ సోషల్ ఫెడరేషన్)గా ఫలించింది. ఈ 'సమాఖ్య' ఉమ్మడి నామమే హిందూమతం. రవీంద్రుడు అభివర్ణించిన 'సామాజిక సమాఖ్య సంయుక్త రాజ్యాల' ప్రధాన ప్రతీకలలో శ్రీరామచంద్రుడు ఒకడు. హిందూ మత ఔన్నత్య పునరుద్ధరణకై అయోధ్యలో పునర్నిర్మించిన రామ మందిరాన్ని ఈ నెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. మార్క్సిస్టులు, ఇస్లామిస్టులు, అంబేడ్కరైట్‌లు ఆ రామమందిరాన్ని వ్యతిరేకిస్తున్నారు. భారత జాతీయ మహా పురుషుడుగా రాముడిని గౌరవించేందుకు వారు నిరాకరిస్తున్నారు. తమ జాతీయ మహాకవిగా పాకిస్థాన్ ప్రజలు గౌరవించే అల్లామా ఇక్బాల్ రామాయణ మహానాయకుడిని 'ఇమామ్ -ఎ- హింద్' (భారతదేశ ఆధ్యాత్మిక నాయకుడు) అని ప్రస్తుతించాడు. మరి కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టులు అంబేడ్కర్ వాదులు మొదలైన వారు ప్రధాని ఈ నెల 22న అయోధ్యలో రాముడికి చేయనున్న 'ప్రాణ ప్రతిష్ఠ'ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? విధిగా వికసించే చరిత్రకు వారి వైఖరి సమ్మతమేనా?


ఆధునిక భారతదేశ సమైక్యత బ్రిటిష్ వలసపాలనా దక్షత నిర్మించింది కాదు. 1950లో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం మాత్రమే వాటికి భరోసా. ఆ సమైక్యత మౌలికంగా సాంస్కృతిక, నాగరికతా విధాయకమైనది. భారత్ భావన లేదా భారత జాతీయ అస్తిత్వ నిర్మాణంలో రాముడు ఒక ప్రధాన వ్యక్తి. స్వాతంత్ర్య లబ్ధి వెన్వెంటనే అయోధ్యలోని బాబ్రీ మసీద్ స్థానంలో రామాలయాన్ని పునర్నిర్మించాలని హిందువులు చేసిన డిమాండ్ పూర్తిగా న్యాయసమ్మతమైనది. దేశ విభజన కల్లోల పరిస్థితుల కారణంగా నాడు ఆ డిమాండ్‌పై ప్రజలు శ్రద్ధ చూపలేదు. వామపక్షవాదులు, లౌకికవాదులు విశ్వసిస్తున్నట్టుగా ఆ డిమాండ్ సంఘ్ పరివార్ కృత్రిమంగా సృష్టించింది కాదు. 1980 దశకంలో ఆ డిమాండ్ మళ్లీ ఊపిరిపోసుకున్నప్పుడు ఉత్తరాది రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ నాయకుల కంటే కాంగ్రెస్ పార్టీ నాయకులే ముందుగా దానికి మద్దతు నిచ్చారు! జూన్, 1989లో పాలంపూర్ (హిమాచల్‌ప్రదేశ్)లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాత్రమే అయోధ్యలో రామాలయాన్ని నిర్మించాలన్న తీర్మానాన్ని బీజేపీ ఆమోదించింది.



AKBAR

బ్రాబీ మసీద్ తాళాలు తీసింది 1986లో. అప్పుడు ప్రధానమంత్రి ఎవరు? రాజీవ్ గాంధీ. 1989లో అయోధ్యలో జరిగిన శిలాన్యాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నాటి హోంమంత్రి బూటాసింగ్‌ను రాజీవ్ గాంధీయే పంపించారు. 1989 పార్లమెంటరీ ఎన్నికల ప్రచారాన్ని -ఫైజాబాద్‌లో ప్రారంభిస్తూ 'రామరాజ్యం' స్థాపిస్తానని రాజీవ్ హామీ ఇచ్చారు. మరి, రామాలయం విషయమై కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఊగిసలాట ధోరణితో వ్యవహరిస్తోంది?

బాబ్రీ మసీద్ తాళాలు తెరిచింది ఎప్పుడు? 1986లో. అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నది ఎవరు? రాజీవ్ గాంధీ. ఈ వాస్తవాన్ని నేటి కాంగ్రెస్ నాయకులు ఎలా మరచిపోయారు? 1989 నవంబర్‌లో అయోధ్యలో జరగనున్న శిలాన్యాస్ (శంకుస్థాపన) కార్యక్రమంలో పాల్గొనేందుకు నాటి కేంద్ర హోంమంత్రి బూటాసింగ్‌ను రాజీవ్ గాంధీయే పంపించారు. అంతేనా? 1989 పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని రాజీవ్ గాంధీ -ఫైజాబాద్‌లో ఒక ర్యాలీలో ప్రారంభించారు. ఆ బహిరంగసభలోనే ఆయన 'రామరాజ్యం' స్థాపిస్తానని హామీ ఇచ్చారు.



ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనవలసిందిగా తమకు అందిన ఆహ్వానాలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి తిరస్కరించారు. 'అయోధ్యలో ఆలయ అంశాన్ని సంఘ్ పరివార్ / బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని వారు విమర్శించారు. అదే ప్రకటనలో వారొక వ్యాఖ్య కూడ చేశారు: 'మతం అనేది ఒక వ్యక్తిగత వ్యవహారం'. అవునా? మతం వ్యక్తిగత వ్యవహారమే అయితే అయోధ్యలో రాజీవ్ చేపట్టిన చర్యలను ఎలా అర్థం చేసుకోవాలి? జనవరి 15న తాము అయోధ్యను సందర్శించి సరయు నదిలో స్నానం చేసి రామ్ లల్లాకు పూజలు నిర్వహిస్తామని యూపీలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రకటించారు? సోనియా, రాహుల్, ప్రియాంకలు సైతం సమీప భవిష్యత్తులోనే అయోధ్యలోని రామాలయాన్ని సందర్శిస్తే మనం ఆశ్చర్యపోనవసరం లేదు. అసలు రామాలయం విషయమై కాంగ్రెస్ పార్టీ ఇంతగా ఎందుకు ఊగిసలాట ధోరణిలో వ్యవహరిస్తోంది? హిందువుల మనోభావాలను ఎందుకు ఉపేక్షించింది? తొలుత రామజన్మభూమి ఉద్యమాన్ని వ్యతిరేకించి, ఆ తరువాత ఆ ఉద్యమం పూర్తిగా బీజేపీ గుత్తాధిపత్యంలోకి పోయేందుకు ఎందుకు అనుమతించింది? హిందువుల న్యాయసమ్మతమైన ఆకాంక్షలను గౌరవించి, అంగీకరించాలని ముస్లింలకు ఎందుకు నచ్చచెప్పలేదు?

సరే, ముస్లిం సమాజ మత, సామాజిక, రాజకీయ నాయకులు రామాలయంపై ఎందుకు అంతగా పట్టు విడుపులు లేని ధోరణి ప్రదర్శిస్తున్నారు? తొలుత వారు, అయోధ్యలో రామజన్మభూమిగా హిందువులు విశ్వసించే ప్రదేశంలోని రామాలయాన్ని కూల్చివేసి బాబ్రీమసీద్‌ను నిర్మించారనే వాదనను వామపక్షాలవారితో పాటు తిరస్కరించారు. అసలు ఆ స్థలం రామజన్మభూమి అవునా కాదా అనేది మత విశ్వాసానికి సంబంధించిన విషయం. అయితే ఆ ప్రదేశంలోని ఒక పురాతన ఆలయాన్ని కూల్చి మసీదును కట్టారనడం కొట్టివేయలేని వాస్తవం. బాబ్రీ మసీద్‌ను కాపాడడమనేది భారత్ లోని ముస్లింలకు ఒక జీవన్మరణ సమస్యగా పరిగణించడం ముస్లిం సమాజ పెద్దలు చేసిన తప్పు.

భారత్‌లో లౌకికవాదాన్ని కాపాడేందుకు బాబ్రీ మసీద్‌ను సంరక్షించడం తప్పనిసరి అని కాంగ్రెస్, వామపక్షాలు, ముస్లిం నాయకులు ముక్తకంఠంతో వాదించడం మరో తప్పు. దీనివల్ల, ఆచరణలో లౌకికవాదం ముస్లింలకు సానుకూలంగాను, తమకు వ్యతిరేకంగాను ఉంటుందని హిందువులు భావించేందుకు ఆస్కారమేర్పడింది. ఇంతకూ ముస్లిం నాయకులు తమ మొండి వైఖరితో ఏమి సాధించినట్టు? ఆత్మ పరిశీలన చేసుకుంటారా? కాలమే చెప్పాలి.

ఊహించినట్టుగానే అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా హిందూ మత విజయోత్సవ వాతావరణాన్ని సృష్టించడంలో మోదీ ప్రభుత్వం, సంఘ్ పరివార్ సఫలమయ్యాయి. ఆలయ నిర్మాణం పూర్తి-కాకముందే ప్రారంభోత్సవానికి పూనుకోవడం రాబోయే పార్లమెంటరీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే. రామాలయాన్ని నిర్మిస్తోంది రాజకీయ ప్రయోజనాల కోసమేనా అనే ప్రశ్నను రామభక్తులు తప్పక వేసుకోవాలి. అయోధ్య రామాలయం మన సమాజ నైతిక వ్యక్తిత్వాన్ని సమున్నతం చేసేందుకు తోడ్పడుతుందా లేక మత దురహంకారం మరింతగా పెచ్చరిల్లడానికి కారణమవుతుందా? అనే విషయాన్ని కూడా హిందువులు నిష్పాక్షికంగా ఆలోచించాలి. హిందూ ధర్మ సుగుణాలను మనం చిత్తశుద్ధితో ఆవాహన చేసుకోవాలి. మన నిత్య జీవితంలో వాటిని ఆచరించాలి. లేనిపక్షంలో భారతీయ ప్రజాస్వామ్యం, లౌకికవాద విలువలు, సంప్రదాయాలకు ఎనలేని హాని చేయడమే అవుతుంది.

> **అయోధ్య రామాలయం మన సమాజ నైతిక వ్యక్తిత్వాన్ని సమున్నతం చేసేందుకు తోడ్పడుతుందా లేక మత దురహంకారం మరింతగా పెచ్చరిల్లడానికి కారణమవుతుందా?**

అయోధ్యలో రామాలయ స్వప్నం సాకారమవుతోంది. అయితే రామరాజ్యం -ధర్మ పాలన- ఎక్కడ? నైతిక విలువలు, ఆర్థిక, సామాజిక న్యాయం విషయమేమిటి? మనం దయా స్వభావంతో ప్రవర్తిస్తున్నామా? భిన్న వర్గాలతో సమన్వయ దృక్పథంతో సాగుతున్నామా? అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవ సంబరంలో ఉన్న దేశ ప్రజలు మన కాలం మహోన్నత రామభక్తుడి మాటలను గుర్తు చేసుకోవలసిన అవసరమున్నది. దేశ విభజనతో ప్రజ్వరిల్లిన మతకలహాలు రక్తపుటేర్లను పారిస్తూ ఉధృతమవుతున్న వేళ 1947 అక్టోబర్‌లో మహాత్మా గాంధీ తన 'హరిజన్' పత్రికలో ఇలా రాశారు: 'నేను విశ్వసించే హిందూ ధర్మం అన్ని మతాలను గౌరవించమని నాకు బోధించింది. ఈ బోధనను పాటించడంలోనే రామరాజ్యం రహస్యం ఉన్నది'. ఆయన ఇంకా ఇలా రాశారు: 'రామరాజ్యం రూపంలో భగవంతుడిని చూడాలని మీరు కోరుకుంటున్నారా? అలా అయితే అందుకు మీరు ముందుగా ఆత్మశోధన చేసుకోవాలి. మీ తప్పులను మీరు ఎక్కువ చేసి చూసుకోవాలి. మీ ఇరుగుపొరుగువారి తప్పులను ఉపేక్షించాలి. ఇదే నిజమైన పురోగతికి ఏకైక మార్గం'. ఈ సత్యవాక్కుల ద్వారా హిందువులు, ముస్లింలు, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, మితవాదులు... ప్రతీ ఒక్కరితోనూ మహాత్ముడు మాట్లాడారు.

■ -సుధీంద్ర కులకర్ణి

జన్మభూమిలో రఘురాముడు

అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో, జనవరి 22, 2024 మధ్యాహ్నం 12.20 గంటల శుభముహూర్తాన జరుగనున్న 'ప్రాణ ప్రతిష్ఠ వేడుక' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అదే రోజున దేశ ప్రజలంతా వారివారి ఇళ్లల్లో 'రామజ్యోతి' వెలిగించి ఆ వేడుకను జరుపుకోవాలని, పెద్ద సంఖ్యలో ఒకేసారి అందరూ అయోధ్యకు వచ్చి ఇబ్బందికి గురికావద్దనీ విజ్ఞప్తి చేశారు.


'శ్రీ రామజన్మ భూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్' సభ్యులు ఎంపిక చేసిన, 51 అంగుళాల 'రామ్ లల్లా' విగ్రహానికి ప్రాణశక్తిని ఆవాహన చేసే 'ప్రాణ ప్రతిష్ఠ వేడుక'ను, ఆలయాల ఆచారానికి, సాంప్రదాయానికి అనుగుణంగా నిర్వహిస్తున్నారు నిర్వాహకులు. దీన్ని పురస్కరించుకుని ఏడు రోజులపాటు నిర్విరామంగా జరుగనున్న సాంప్రదాయ, ఆచారబద్ధమైన కార్యక్రమాలు జనవరి 16న ప్రారంభం అవుతున్నాయి. వీటికి పూర్వరంగంలో, ట్రస్ట్ కార్యదర్శి చంపట్ రాయ్ పవిత్ర అక్షతల పంపిణీ కార్యక్రమానికి ఆంగ్ల నూతన సంవత్సరం నాడు లాంఛనంగా శ్రీకారం చుట్టారు.

మహర్షి వాల్మీకి రచించిన ఆదికావ్యం సంస్కృత రామాయణంలో 'రామజన్మభూమి'గా ప్రసిద్ధికెక్కిన అయోధ్యకు సంబంధించిన అనాది కాలంనాటి అనేక విషయాలను స్పష్టంగా వర్ణించారు. ఇప్పటిలాగానే, ఆ కాలంలో కూడా సరయూ నది ఒడ్డున వున్న అయోధ్యా నగరానికి ఒకవైపున 'గంగా, పంచల ప్రదేశ్', మరోవైపున 'మిథిలా' ఉండేవి. కాలక్రమేణా అయోధ్య పరిమాణంలో కుంచించుకుపోవడమే కాకుండా, అక్కడి నదులు వాటి మార్గాన్ని మార్చుకున్నాయి. వర్తమాన పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా నరేంద్ర మోదీ విజన్ మేరకు అయోధ్య నగరాన్ని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నారు. పరంపరగా వస్తున్న దాని అద్భుతమైన వారసత్వాన్ని సంరక్షించే దిశగా పనులు జరుగుతున్నాయి.

సంస్కృత భాషలో వాల్మీకి రచించిన రామాయణాన్ని, మూలంలోని 24,000 శ్లోకాలకు, శ్లోకానికి ఒకటి చొప్పున, తెలుగులో 24,000 పద్యాలతో, ప్రతిపదార్థ తాత్పర్యసహితంగా, ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధికెక్కిన స్వర్గీయ వావిలికొలను సుబ్బారావు తొమ్మిది సంపుటాలలో 'శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం మందరం' పేరుతో వందేళ్ల క్రితం అనువదించారు. ఈ మందర సంపుటాలను సమకాలీన 'ఆధ్యాత్మిక, బహువిషయ విజ్ఞానసర్వస్వాలు'గా విస్తృతంగా భావిస్తారు. సంస్కృత వాల్మీకి రామాయణం, వావిలికొలను సుబ్బారావు తెలుగు యథావాల్మీకం అలనాటి అయోధ్యను కళ్లకు కట్టినట్లు వివరిస్తాయి. సరయూ నదీతీరంలోని కోసల దేశంలో వున్న అయోధ్యా నగరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో వుండేవారు. చక్కటి రాజవీధులతో అలరారుతూ, అందాలొలికే ఆ అయోధ్యాపురం 'లక్ష్మీపురం'నే మరిపించేది. స్వర్గ నగరమైన అమరావతికి దీటుగా వుండేది. అయోధ్యాపురంలోని బ్రాహ్మణులు అడిగిన వారికి లేదనకుండా శక్తికొలది దాన ధర్మాలు చేసేవారు. వేదాధ్యయనం చేయడం వారికి నిత్యకృత్యం. బ్రాహ్మణులు ఉపదేశించిన కార్యాలలో ఆసక్తి కలిగి క్షత్రియులు నడచుకునేవారు. వైశ్యులు రాజులకు అనుకూలంగా వుండేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు చేదోడువాదోడుగా కులవృత్తులలో నిమగ్నమై కార్మిక, కర్షక వర్గాల వారు ఉండేవారు. అయోధ్యా నగరంలోని ప్రజలందరు సద్గుణవంతులే.

అయోధ్యా నగరాన్ని ఇక్ష్వాకుల సూర్య వంశానికి చెందిన దశరథ మహారాజు, సమర్థులైన మంత్రుల తోడ్పాటుతో పరిపాలించేవాడు. చైత్ర మాసం, శుక్లపక్షం, నవమి తిథి నాడు, పునర్వసు నక్షత్రంలో, అభిజిల్లగ్నం, కర్కాటక లగ్నంలో, చంద్రుడిని కూడిన బృహస్పతి కలిగిన ఉదయాన, దశరథుడి జ్యేష్ఠ భార్య కౌసల్యాదేవి జగత్ పాలకుడైన శ్రీమహావిష్ణువు అర్ధాంశమూర్తి శ్రీరాముడికి జన్మనిచ్చింది. ఆ విధంగా, అలనాటి అయోధ్య శ్రీరాముడి జన్మస్థలం, లేదా, రామజన్మభూమి అయింది. ఆ పరంపరతో, అదే అయోధ్య, ఈ నాడు 'రామ్ లల్లా విగ్రహం' ఉండే చారిత్రాత్మక రామ మందిరానికి నిలయమైంది.

> **మహర్షి వాల్మీకి రచించిన ఆదికావ్యం సంస్కృత రామాయణంలో 'రామజన్మభూమి'గా ప్రసిద్ధికెక్కిన అయోధ్యకు సంబంధించిన అనాది కాలంనాటి అనేక విషయాలను స్పష్టంగా వర్ణించారు. 'రామ్ మందిర్' నిర్మాణానికి పరిపూర్ణ కృషి చేసిన వ్యక్తిగా నరేంద్రమోదీని యావత్ హిందూ సమాజానికి చెందిన ఆబాలగోపాలం, ఆసేతు హిమాచలం ఎప్పటికీ జ్ఞాపకం ఉంచుకుంటుంది.**



ఆధునిక భారతదేశ చరిత్రలో 'అయోధ్య వివాదం' వివిధ న్యాయ స్థానాలలో ఒక ప్రాధాన్యతను సంతరించుకున్నది. అయోధ్యలోని ఒక ప్రాచీన కట్టడంలో వున్న వివాదాస్పద స్థలంలోనే శ్రీరాముడు జన్మించాడని, అదే ఆయన జన్మభూమని, అక్కడొక రామాలయం వుండేదని, దాన్ని 1528 లో బాబర్ కూలగొట్టించి బాబ్రీ మసీదు నిర్మించాడని అందువల్ల ఆ స్థలంపై హక్కు తమదేనని హిందువులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదానికి స్వస్తివాక్యం పలుకుతూ, నవంబర్ 9, 2019న ఐదుగురు సభ్యులున్న సుప్రీంకోర్ట్ ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వానికి ఏకగ్రీవంగా ఇచ్చిన ఆదేశంలో, అయోధ్యలో వివాదాస్పద స్థలంలో 'రామ్ మందిర్ దేవాలయం' నిర్మించడానికి ట్రస్ట్‌ను, ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయమని చెప్పింది.

ఆలయాన్ని నిర్మించేందుకు 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని హిందువుల ఆరాధ్య దైవం, సాక్షాత్తు భగవత్ స్వరూపుడు 'రామ్ లల్లా విరాజ్మాన్'కు అప్పగించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. 2010 అలహాబాద్ హైకోర్టు తీర్పులో పేర్కొన్నట్లు, వివాదాస్పద భూమి విభజన సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు, అయోధ్యలో 'రామ్ మందిర్ దేవాలయం' నిర్మించడానికి, ఫిబ్రవరి 5, 2020న 15 మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారు ప్రధాని మోదీ. నిర్మాణానికి అవసరమయ్యే అంచనా వ్యయమైన రూ.18,000 కోట్లను ప్రజల నుండి విరాళాలుగా సేకరిస్తున్నారు ట్రస్ట్ సభ్యులు. మొట్టమొదటి విరాళంగా కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయి ఇచ్చింది. ఆగస్ట్ 5, 2020న ప్రధాన మంత్రి భూమిపూజ చేసి ఆలయ పునాదిరాయి వేశారు. డిజైన్ మార్పువల్ల నిర్మిస్తున్న 'రామ్ మందిర్ దేవాలయం' మొదట్లో అనుకున్న దానికంటే రెండింతలవుతున్నది. ట్రస్ట్‌కు కేటాయించిన 70 ఎకరాల భూమి మీద 2.77 ఎకరాల స్థలంలో రామ్ లల్లా కేంద్ర బిందువుగా నిర్మిస్తున్న ప్రధాన దేవాలయంతో సహా అనేక ఆలయాల నిర్మాణం జరుగుతున్నది. అష్టభుజ ఆకారపు గర్భగుడి, వృత్తాకార చుట్టుకొలతల నిర్మాణాలు కూడా అక్కడ ఉండబోతున్నాయి. ఆలయం నాలుగు మూలల గోడతో చుట్టబడిన 750 మీటర్ల విస్తీర్ణం కలిగిన ప్రాకారం కలిగివుంటుంది. భక్తులు ధ్యానం చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లున్నాయి.

'రామ్ మందిర్' నిర్మాణానికి పరిపూర్ణ కృషి చేసిన వ్యక్తిగా మోదీని యావత్ హిందూ సమాజానికి చెందిన ఆబాలగోపాలం, ఆసేతు హిమాచలం ఎప్పటికీ విధేయతతో జ్ఞాపకం ఉంచుకుంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అలాగే, ఆలయాన్ని కట్టాలని గుండె లోతుల్లోంచి భావించినా, కట్టలేకపోయిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు, అయోధ్య వివాదాస్పద కేసును విజయవంతంగా వాదించిన సీనియర్ అడ్వకేట్, 96ఏళ్ల పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కె పరాశరన్‌కు, 1949 లోనే నెహ్రూ ఆదేశాలను కాదని రామజన్మభూమిలో పూజలు చేసుకోవడానికి హిందువులకు హక్కు కల్పించిన నాటి ఫైజాబాద్ కలక్టర్ స్వర్గీయ కేకే నాయర్‌కు కూడా ప్రతి భారతీయుడు, ప్రతి హిందువు ధన్యవాదాలు తెలియచేయడం కనీస ధర్మం.

నెల రోజులకే బదనాం చేయడమా?

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ సంక్రాంతి సమస్త ప్రజానీకానికి భోగభాగ్యాలను సుఖసంతోషాలను తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు, ఆదరాభిమానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చేందుకు సంపూర్ణంగా కట్టుబడి ఉంది. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ప్రజల అవసరాలను తీర్చుతుంది. ప్రభుత్వాన్ని ప్రతీ గడప ముందుకు చేర్చి, ప్రజల హృదయానికి దగ్గరైంది. రాబోయే రోజుల్లో అభయహస్తం ద్వారా ప్రతీ పౌరునికి సంక్షేమం లభిస్తుంది. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ ఆత్మగౌరవం అందించడం కోసం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, నిరంకుశత్వం లేని తెలంగాణ ఆవిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తాం.


ప్రజాస్వామ్య రాజకీయ ప్రక్రియలో గెలుపు, ఓటములను సమానంగా అంగీకరించే పరిణతి అవసరం. We may be personally defeated, but our principles never! అంటాడు ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్ట్ విలియమ్స్ లాయిడ్ గ్యారిసన్. దురదృష్టం కొద్ది ప్రతిపక్ష పార్టీ ఓటమిని, ప్రజాతీర్పును అంగీకరించలేకపోతోంది. ఓటమి అన్నది ఏదో ఒక ఎన్నికలో వచ్చేది కాదు, నాయకులుగా మనం కోల్పోయే సిద్ధాంత వైఫల్యం వల్ల కూడా అన్న సంగతిని ఏ నాయకుడు మరువకూడదు. బీఆరఎస్ పార్టీ విలువల్ని పూర్తిగా విడిచిపెట్టింది. అధికారంలో ఉండగా ప్రజాస్వేచ్ఛను హరించి, ప్రజాస్వామ్యాన్ని చెరబట్టి, అవినీతి, అక్రమాలకు వంతపాడి, నియంతృత్వ విధానాలు అవలంబించి, చెయ్యరాని తప్పులన్నీ చేసి.. ఇప్పుడు ఆ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అధికారపక్షం మీద ఎదురుదాడి చేస్తున్నది. వీటిని తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తున్నది.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రం విడుదల చేయడం ప్రధాన ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదు. ఏమాత్రం సంయమనం పాటించకుండా, కనీస పరిణతి ప్రదర్శించకుండా స్టేట్మెంట్లు ఇచ్చారు. శ్వేతపత్రంలో మీరు తేల్చేది ఏంలేదు, కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేరంటూ ముందే హేళనగా మాట్లాడటం వారిలో గూడుకట్టుకున్న నియంతృత్వ భావజాలానికి నిలువెత్తు నిదర్శనం. శ్వేతపత్రం ద్వారా వారి బండారం మొత్తం తెలంగాణ ప్రజానీకానికి తెలియగానే దాన్ని కప్పిపుచ్చుకునేందుకు స్వేదపత్రం పేరుతో, 420 హామీల పేరుతో హద్దులు దాటి ప్రవర్తించడం వారి మానసిక స్థితికి అద్దం పట్టింది. తెలంగాణకు దళితుడే ముఖ్యమంత్రి, కేజీటూపీజీ ఉచిత విద్య, ప్రతీ రైతుకు ఉచిత ఎరువులు, ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీళ్లు, ధాన్యానికి గిట్టుబాటు ధరలు అంటూ వందల అబద్ధాలు చెప్పి జనం నోట్లో మట్టికొట్టిన బీఆరఎస్ నాయకులు నెలరోజుల కాంగ్రెస్ ప్రభుత్వంపై పుస్తకాలమీద పుస్తకాలు తీసి బదనాం చేయాలనే రాక్షస ప్రయత్నం చేయడం వారికే చెల్లింది.

తొమ్మిదిన్నరేండ్ల పాలనలో వారు ఎన్నడు ప్రజలకు జవాబుదారీగా పాలన అందించలేదు, 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్'లో రాష్ట్రాన్ని అధికరంగాల్లో అచీవర్స్ జాబితాలోకి తీసుకుపోలేదు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ళు ఇత్యాది అక్రమాలపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు పోరాడినా కనీసం స్పందించలేదు. కృత్రిమ అభివృద్ధిని చూపించి, కుటిల నినాదాలిచ్చి, దానినే అద్భుతంగా ప్రచారం చేశారు. అసెంబ్లీలో జరిగిన ప్రతీ చర్చను తప్పుదోవ పట్టించి ప్రజలకు వాస్తవాలు చేరకుండా అడ్డుకున్న వైనం సమాజం మొత్తం చూసింది.

వారి తొమ్మిదిన్నరేండ్ల అహంకారపూరితమైన పాలనలో ఆశలు అడియాసలై, వెలకట్టలేని అమరుల త్యాగాలు రాజకీయ అవినీతి యజ్ఞంలో దగ్ధమైపోతున్నాయని దిగులుపడి ఏడ్చిన గుండెలన్నీ ఒక్కటై, నిర్బంధాలు, అవమానాలు అనుభవించిన ప్రజలంతా ఏకమై కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు, సాంత్వన పొందుతున్నారు. కానీ, ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే 'ఈ ప్రభుత్వం మూన్నాళ్ల ముచ్చటే' అని ఒకాయన, 'ఆర్నెల్లలో మన ప్రభుత్వమే' అని ఓ ఎమ్మెల్యే, 'ఈ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైంద'ని ఒక నాయకుడు, 'ఏడాదిలో మన ప్రభుత్వమే' అని ఇంకో నాయకుడు.. ఇలా బీఆరఎస్ నాయకులంతా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని ప్రకటనలిస్తుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అధికారం కోల్పోయిన మరుసటి రోజు నుంచే.. వారు ప్రవర్తిస్తున్న తీరు సమాజానికి దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. తొమ్మిదిన్నర సంవత్సరాలు పడరాని కష్టాలు పడి, మా బిడ్డలకు ఉద్యోగాలు లేవే అని.. పేదలమంతా ఒక్కటై కాంగ్రెస్





ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే.. వీళ్లేంటి ప్రభుత్వానికి ఇలా శాపనార్థాలు పెడుతున్నారు, కుట్రలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

సూదికి రంధ్రముందని జల్లెడ వెక్కిరించినట్టు తొమ్మిదిన్నరేండ్లు అవినీతి, అక్రమసంపాదన, అరాచక పాలన, హామీల విస్మరణకు అలవాటుపడ్డ బీఆరఎస్ పార్టీ నాయకులు.. ప్రభుత్వం ఏర్పడిన నెలకే.. మీరు హామీల నుంచి తప్పించుకుంటున్నరు అంటూ తప్పుడు ఆరోపణలు చేయడం వారికే చెల్లింది. కాంగ్రెస్ పార్టీది దశాబ్దాల చరిత్ర. నిరుపేదల పార్టీగా, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడ్డ పార్టీగా ప్రజల హృదయాల్లో దానిది చెరగని ముద్ర. ఇంతటి చరిత్ర కలిగిన పార్టీ ఇవ్వాళ మాటిచ్చి తప్పడం ఉంటుందని ఏ తెలంగాణ బిడ్డా అనుకోవడం లేదు. పేదల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ పార్టీ ఎనలేని చిత్తశుద్ధితో ఉంది. రాష్ట్రంలోని వాస్తవ బడ్జెట్ పరిస్థితులను బేరీజు వేసుకునేందుకే

> **ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తమ పాపాలకు ప్రాయశ్చిత్తంగా 'ప్రజలనెందుకు కలవాలనే' అహంకారం వీడి వారి సాధకబాధకాలలో భాగం కావాలి. ఓటమి నెపాన్ని యూట్యూబ్ ఛానెళ్ల మీద నెట్టి తమను తాము మోసం చేసుకోవడం మానాలి. వారు అద్భుతంగా పాలించివుంటే ఇవ్వాళ ప్రజలు ప్రజాభవన్ ముందు కిలోమీటర్ల మేర లైన్లు ఎందుకు కడతారు?**

నిపుణులు, ఆర్థికరంగ మేధావుల సహాయంతో శ్వేతపత్రాన్ని విడుదల చేసినం. ప్రతీ హామీని నెరవేర్చేందుకు అనుసరించాల్సిన విధానాలపై కసరత్తు చేస్తున్నాం. మరో రెండు దశాబ్దాలు ఈ తెలంగాణ బిడ్డలకు స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన సమాజాన్ని, జీవనప్రమాణాలు పెంచే సుపరిపాలనను అందించాలని ప్రయత్నిస్తున్నాం. అందుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఐదు నుంచి 10 లక్షల రూపాయలకు తీసుకెళ్లాం. మహాలక్ష్మీ పథకంలో భాగంగా సోదరీమణులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించాం. రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాలకి నగదు జమ చేసే ప్రక్రియ కొనసాగుతుంది. మేం ఇచ్చిన ఆరు గ్యారెంటీలని గ్యారెంటీగా అమలు చేస్తాం. అందులో సందేహానికి తావేలేదు. అంతేకాదు, ఆరు గ్యారంటీల్లో లేని 7వ హామీ 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' కూడా ఇందిరా పార్క్‌లో ధర్నాచౌక్ ప్రారంభించడం, ప్రగతిభవన్ కంచెలను తొలగించడం, సెక్రటేరియట్‌లోకి సాధారణ ప్రజానీకాన్ని, మీడియాను అనుమతించడం, అసెంబ్లీలో ప్రతిపక్షాలకు విరివిగా మాట్లాడే అవకాశం ఇవ్వడం ద్వారా అమలు చేశాం.

మంచి చేసినప్పుడు ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు, చెడు చేస్తే డిపాజిట్లు లేకుండా గల్లంతు చేస్తారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తమ పాపాలకు ప్రాయశ్చిత్తంగా 'ప్రజలనెందుకు కలవాలనే' అహంకారం వీడి వారి సాధకబాధకాలలో భాగం కావాలి. ఓటమి నెపాన్ని యూట్యూబ్ ఛానెళ్ల మీద నెట్టి తమను తాము మోసం చేసుకోవడం మానాలి. వారు అద్భుతంగా పాలించివుంటే ఇవ్వాళ ప్రజలు ప్రజాభవన్ ముందు కిలోమీటర్ల మేర లైన్లు ఎందుకు కడతారు? ప్రజాపాలనలో మా సమస్యలు తీర్చండని దాదాపు కోటిన్నర మంది తెలంగాణ బిడ్డలు ఎందుకు అర్జీలు పెట్టుకుంటారు? తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు, ఒక్క ఆరోగ్యశ్రీ కార్డు ఇవ్వలేదు, ఒక్కరోజు కూడా ప్రజల్ని కలవలేదు. దవాఖాన అంటే పేదలు దడుసుకునేలా చేశారు, ప్రభుత్వ పాఠశాలల్ని ధ్వంసం చేసి పేదల్ని ప్రైవేటు బడులకు పంపించి వారిని ఆర్థికంగా చితికిపోయేలా చేశారు. ఇవన్నీ విస్మరించి ఈ ప్రభుత్వాన్ని కూల్చేస్తం అంటూ ప్రగల్భాలు పలకడం ఏమిటి? పేదలు నిర్మించుకున్న కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని కూలగొడతామనే అప్రజాస్వామిక ప్రకటనలు మానేసి బాధ్యతయుతమైన ప్రతిపక్షంగా మెలిగి ప్రజల మన్ననలు పొందాలి. ఎవ్వరు ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోయే ఇరవైయేండ్లు ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది. తెలంగాణను ఇచ్చిన తల్లి సోనియాకు అపూర్వ కానుకను అందించిన నా తెలంగాణ బిడ్డలందరికీ శిరస్సువంచి నమస్కరిస్తూ, ఇచ్చిన ప్రతీ హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇస్తూ, తెలంగాణ ప్రజలందరికీ మరొక్కసారి నా సంక్రాంతి శుభాకాంక్షలు.

◆ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
(రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖామాత్యులు)

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.7 కనిష్ఠం 19.4

గగన వీధుల్లో..


గరుత్మంతుడి ఆకారంలోని కైట్‌తో..








పతంగి ఎగురవేస్తున్న యువతి


టెడ్డీబేర్ ఆకారంలోని పతంగి


ఆకాశంలో వి హరిస్తున్న పతంగులు


రాత్రివేళ మిరమిట్లు గొలుపుతూ..


చిన్నారితో కలిసి..


కైట్ ఎగురవేస్తున్న పోలీస్ అధికారిణి


కైట్‌తో వి దేశీ

ఆకట్టుకున్న కైట్ అండ్ ఫెస్టివల్

- ఎల్లలు దాటి వచ్చిన 16 దేశాల కైట్ ఫ్లయర్స్

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో తెలంగాణ టూరిజంశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ స్వీట్ ఫెస్టివల్ శనివారం ప్రారంభమైంది. రకరకాల పతంగులు గాలిలో సయ్యాటలాడుతూ అందరినీ ఆకట్టుకున్నాయి. కరోనా తర్వాత తొలిసారిగా జరుగుతున్న కైట్ ఫెస్టివల్‌ను తిలకించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. మొత్తం 16 దేశాల నుంచి వివిధ రాష్ట్రాల నుంచి కైట్ ఫ్లయర్స్ హాజరయ్యారు.



నాలాల్లో వ్యర్థాలు

ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం

- మురుగు నీరు నిలిచి దుర్వాసన
- పెరుగుతోన్న దోమల తీవ్రత
- గతేడాది పూడికతీత అంతంతే
- చివరి మూడు నెలలు పట్టించుకోని వైనం

నాలాల నిర్వహణను జీహెచ్ఎంసీ గాలికొదిలేసింది. సంవత్సరాంతం పూడికతీత పనులు జరగాల్సి ఉన్నా.. కొన్నాళ్లుగా గ్రేటర్‌లోని ఏ ప్రాంతంలోనూ వ్యర్థాలు తొలగిస్తున్న దాఖలాలు లేవు. నిధులు లేవని చెబుతున్నప్పటికీ.. వరదలు వచ్చినప్పుడు చూద్దాంలే అన్న అధికారుల ఉదాసీనతే పనులు సక్రమంగా జరగకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో 370 కి.మీ.ల ప్రధాన నాలాలున్నాయి. నిత్యం మురుగు నీరు ప్రవహించే ఈ నాలాల్లోకి వర్షాకాలంలో వరద నీరు చేరుతుంది. దీంతో ఒక్కోసారి నాలాలు ఉప్పొంగి పక్కనున్న బస్తీలు, కాలనీలు నీట మునుగుతున్నాయి. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా, మురుగు/వరద ప్రవాహం సాఫీగా సాగేలా పూడికతీత పనులు జీహెచ్ఎంసీ చేపడుతోంది. ప్రతి సంవత్సరం జనవరి ప్రారంభం నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. వెంటనే వ్యర్థాల తొలగింపు చేపట్టాల్సి ఉంది. 2023 సంవత్సరానికి సంబంధించి రూ.53.59 కోట్లతో పూడికతీత పనులు చేపట్టారు. ఇందులో 60 శాతం పనులు కూడా పూర్తి కాలేదని అధికారులే అంగీకరిస్తున్నారు.

2023లో చేపట్టిన పనుల వివరాలు.

	పనులు	అంచనా వ్యయం
ఎల్‌బీనగర్	5	555.68
చార్మినార్	29	1624.10
ఖైరతాబాద్	6	1009.85
శేరిలింగంపల్లి	5	758.80
కూకట్‌పల్లి	5	495.95
సికింద్రాబాద్	6	915.50
మొత్తం	56	5359.88

పట్టించుకోరు..

గతంలో గ్రేటర్‌లోని 150 డివిజన్లకు సంబంధించి ఒక్కో డివిజన్‌లో రెండు మూడు ప్యాకేజీలుగా ప్రతిపాదనలు రూపొందించి పనులు చేసేవారు. ప్రయోగాత్మకమంటూ గతేడాది సర్కిల్‌కు ఒక ప్యాకేజీగా పనులు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ఏజెన్సీలు ఎంపిక చేశారు. అయినా పనులు మాత్రం ఆశించిన స్థాయిలో

మిగతా 8వ పేజీలో..


ఊరేగింపుగా హరియాణ భవన్‌కు తరలివస్తున్న షాయిన

18 ఏళ్ల వయస్సులోనే సన్యాసినిగా..

- తండ్రి బంగారు హోల్‌సేల్ వ్యాపారి
- కోట్ల ఆస్తి వదిలి జైన దీక్ష తీసుకున్న షాయిన

రాంగోపాల్‌పేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల హోల్‌సేల్ బంగారం వ్యాపారం చేసే తండ్రి.. సుందర స్వప్నాలను సాకారం చేసుకునే అవకాశం. కానీ.. ఆధ్యాత్మిక చింతనతోనే తన జీవితాన్ని గడపాలని నిశ్చయించుకొన్న 18 ఏళ్ల ఓ యువతి జైన సన్యాస దీక్ష తీసుకుంది. రాణిగంజ్ టీ19 టవర్స్‌కు చెందిన జయంతీలాల్ రమానీ, సంగీత రమానీల ఏకైక కుమార్తె షాయిన(18). ముంబైలో డిగ్రీ చదివింది. భగవంతుడికి సేవ చేయాలనే సంకల్పంతో సన్యాసదీక్ష వైపు మొగ్గు చూపింది. తల్లిదండ్రులు సమ్మతించడంతో శనివారం ఇంటినుంచి ఊరేగింపుగా ప్యారడైజ్ వద్ద గల హరియాణా భవన్‌లో జరిగిన సింహోత్సవ దీక్ష స్వీకారోత్సవానికి హాజరైంది. మత పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సాధ్వీల సమక్షంలో షాయిన సన్యాస దీక్ష తీసుకుంది. జైన సమాజంలో ఈ దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉందని, వారి జీవితాన్ని సైతం త్యజించి చిన్న వయస్సులోనే దీక్ష తీసుకోవడం గొప్ప విషయమని పలువురు ఆశీర్వదించి అభినందించారు.

అనుమతివ్వని పోలీసులు

దీక్ష తీసుకునేముందు ఇంటి నుంచి హరియాణా భవన్‌కు ఏనుగుపై ఊరేగింపుగా షాయినను తీసుకెళ్లాలని కుటుంబసభ్యులు భావించారు. ఈ మేరకు అనుమతి కోసం వారం క్రితమే పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఊరేగింపునకు అనుమతి లేదని పోలీసులు శుక్రవారం రాత్రి సమాచారం ఇచ్చారు. ఏనుగు లేకుండానైనా ఊరేగింపునకు అనుమతివ్వాలని కోరగా అందుకూ నిరాకరించారు. దీంతో మతపెద్దలు ఉన్నతాధికారులను సంప్రదించి అనుమతి సంపాదించడంతో ఆలస్యంగా ఊరేగింపు ప్రారంభమైంది.

నగరంలో నకిలీ టీ పొడి, సబ్బులు

- ఇంటినే గోదాంగా మార్చి విక్రయాలు
- ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటినే గోదాంగా మార్చుకొని, నకిలీ టీ పొడి, బ్రాండెడ్ కంపెనీ రేపర్స్‌తో నకిలీ సబ్బులను విక్రయిస్తున్న ఇద్దరిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ మలక్‌పేట పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. రామ్‌కోటి ప్రాంతానికి చెందిన రాకేష్ జైన్, మహావీర్‌జైన్‌లు హోల్‌సేల్ వ్యాపారులు. మూసారాంబాగ్ ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, నకిలీ సబ్బులు, నకిలీ టీపొడిలను విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లో బ్రాండెడ్ కంపెనీ రేపర్స్‌తో కూడిన నకిలీ సబ్బులు విక్రయిస్తున్నట్లు కర్నాటక రాష్ట్రానికి చెందిన ఓ సంస్థ అధికారులు నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూసారాంబాగ్, జీడిమెట్ల, మలక్‌పేట ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలు, గోదాములపై దాడులు చేశారు. మలక్‌పేట, జీడిమెట్లలో సబ్బుల తయారీ, టీ పొడి ప్యాకింగ్‌కు వినియోగించే రూ.కోటి విలువైన యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మూసారాంబాగ్ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో ఉన్న గోదాం, నిందితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించి, నిల్వ ఉంచిన నకిలీ సబ్బులు, నకిలీ టీ పొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో దొరికే టీ పొడిని కొనుగోలు చేసి, బ్రాండెడ్ కవర్లలో నింపి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని మలక్‌పేట పోలీసులకు అప్పగించారు.

సాయుధ బలగాలే పోలీసుల బలం

- సాంకేతికతను, సామర్థ్యాలను అందిపుచ్చుకోవాలి
- కార్‌హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించిన నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి


సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సాయుధ బలగాలే పోలీసుల బలం అని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శిక్షణ, సాయుధ దళ శాఖలు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు పేట్లబురుజులోని సాయుధ దళ, శిక్షణ విభాగాలతో పాటు.. ఇతర శాఖలను సీపీ శనివారం

మిగతా 8వ పేజీలో..


నార్సింగ్‌లో విక్రయానికి తీసుకొచ్చిన కోడిపుంజులు

కొండెక్కిన 'కోడి పుంజు'

- రూ.800 నుంచి రూ.3వేల వరకు
- సంతల్లో జోరుగా విక్రయాలు

నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వచ్చిందంటే నాటుకోళ్లకు మస్త్ గిరాకీ ఉంటుంది. దీంతో నాటుకోళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణ రోజుల్లో లభించే కోడి పుంజుల ధరలు రెండు, మూడింతలు పెరిగాయి. అయినప్పటికీ శివారు ప్రాంతాల్లో జరిగే సంతల్లో వాటి విక్రయాలు జోరుగా సాగాయి. సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని నగర

మిగతా 8వ పేజీలో..

ప్రైవేటు వాహనాలపై రవాణాశాఖ కొరడా.. 15 బస్సులపై కేసులు 8

ట్రాక్టర్ ట్రాలీలు చోరీ..
- ఇద్దరి అరెస్ట్

సంక్రాంతి శోభ





నగరంలో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. సిటీజనం పల్లెబాట పట్టగా, పట్నం చాలా వరకు ఖాళీ అయ్యింది. శనివారం నగరంలో కొన్ని రోడ్లు ఖాళీగా కనిపించాయి. సంక్రాంతికి కావాల్సిన ముగ్గులు, రంగులు, పూల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. శిల్పారామంలో పండుగ సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నగరంలో శివార్లలో శనివారం రాత్రి భోగిమంటలు వేశారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్స్

బ్లాక్‌లో బెనిఫిట్ షో టికెట్లు

● రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు విక్రయం

● ఎస్‌ఓటీ పోలీసుల అదుపులో ముగ్గురు ● తెరవెనుక నిర్మాత?

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మహేశ్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమా బెనెఫిట్ షో టికెట్లను బ్లాక్‌లో రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు విక్రయిస్తున్న ముగ్గురిని మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గుంటూరు కారం సినిమా శుక్రవారం రిలీజ్ కావాల్సి ఉండగా... గురువారం అర్ధరాత్రి ఒంటి గంటకు బెనెఫిట్ షో ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి 7.30 గంటల సమయంలో గచ్చిబౌలిలోని ఏఎంబీ మాల్ వద్ద ఎస్‌ఓటీతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు పాట్రోలింగ్ నిర్వహిస్తుండగా బ్లాక్‌లో టికెట్లను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు కేపీహెచ్‌బీ, గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన చిలకూరు చైతన్య రెడ్డి(26), కలగార ఆదిత్య(27) వ్యాపారులు, ఏడల జస్వంత్‌రెడ్డి(26) ఐటీ ఉద్యోగిగా గుర్తించారు. పల్లెశివశంకర్ రెడ్డి(32) నుంచి 492 టికెట్లు తీసుకున్నట్లు వారు వివరించారు. ప్రతి టికెట్‌ను కనీసం రూ. 2వేలకు విక్రయిస్తే భారీ మొత్తంలో కమీషన్ ఇస్తానని చెప్పడంతో బ్లాక్‌లో విక్రయించినట్లు అంగీకరించారు. మొత్తం 492 టికెట్లలో అమ్ముడుపోగా మిగిలిన 236 టికెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పల్లె శివశంకర్‌రెడ్డి గురించి ఆరా తీస్తున్న పోలీసులకు.. తెరవెనుక ఓ సినీ నిర్మాత కూడా ఉన్నట్లు సమాచారం అందింది. తదుపరి విచారణ నిమిత్తం ఎస్‌ఓటీ పోలీసులు ఆ ముగ్గురిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు.

బ్రెయిన్ డెడ్ మహిళ అవయవాల సేకరణ


కమలమ్మ (ఫైల్)

సనత్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన ఓ మహిళ అవయవాలను జీవన్‌దాన్ సభ్యులు సేకరించారు. సికింద్రాబాద్ గాంధీనగర్‌లో నివసించే అంతారం హనుమయ్య, కమలమ్మ(64) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల కమలమ్మ అకస్మాత్తుగా కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానం గురించి జీవన్‌దాన్ సభ్యులు వివరించి, వారి అనుమతితో కిడ్నీ, లివర్, 2 కార్నియాను సేకరించారు.

కంచె ఐలయ్య 'మా జాతి సూర్యుడు' : కర్ణాటక సీఎం

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): 'ప్రొఫెసర్ కంచె ఐలయ్య మా జాతి సూర్యుడు' అని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా తింతని బ్రిడ్జ్ దగ్గర శనివారం కనకపీఠం ఆధ్వర్యంలో 'మా జాతి సూర్యుడు అవార్డు'ను కంచ ఐలయ్యకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అందజేశారు. అనంతరం కనక పీఠం పీఠాధిపతి శ్రీ సిద్ధారామానంద మహాస్వామి ఐలయ్యకు తలపాగా పెట్టి, రూ.50వేల నగదు అందజేశారు. సభలో కేంద్ర మంత్రి భగవంత్ ఖుబా, కర్ణాటక మంత్రి బైరతి సురేష్, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ వెంకట్ యాదవ్, ప్రొఫెసర్ నర్రి యాదయ్య, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ విప్లవ్, తదితరులు పాల్గొన్నారు.

టీఓఏ ట్రెజరర్‌పై సస్పెన్షన్ నిలిపివేత


మహేశ్వర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీఓఏ) కోశాధికారి కె.మహేశ్వర్‌పై ఆ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు వేణుగోపాలచారి విధించిన సస్పెన్షన్‌ను సిటీ సివిల్ కోర్టు నిలిపివేసింది. సస్పెన్షన్‌పై స్టే విధించింది. దీంతో తెలంగాణ ఒలింపిక్ సంఘంలోని కుమ్ములాటలు, ఆర్థిక అవకతవకలపై చర్చ ఊపందుకుంది. మరో నెల రోజుల వ్యవధిలో ఈ సంఘానికి ఎన్నికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు ఎటు దారితీస్తాయోనని క్రీడా సంఘాల ప్రతినిధులు చర్చించుకుంటున్నారు. ఇక, కోర్టు స్టేపై మహేశ్వర్ మాట్లాడుతూ తన వైపు న్యాయం ఉంది కాబట్టే న్యాయ స్థానం సస్పెన్షన్‌ను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. టీఓఏ నిధులు పెద్ద మొత్తం పక్కదారి పట్టాయని, దీనికి సహకరించనందుకే తనపై కొందరు కక్షగట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

పరిచయం పెంచుకొని.. మహిళపై లైంగిక దాడి

బంజారాహిల్స్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి ఓ మహిళపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. మహబూబ్‌నగర్‌కు చెందిన దంపతులకు ఐదుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వివాహం చేసుకోలేదు. రెండు సంవత్సరాల క్రితం ఆమె నగరానికి వచ్చి బంజారాహిల్స్‌లో నివాసముంటోంది. యేడాది క్రితం బత్తుల విజయ్‌చందర్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. మాయమాటలు చెప్పి గతేడాది జూన్‌లో ఆమెపై రెండు సార్లు లైంగిక దాడి చేశాడు. ఈ సంఘటనతో తీవ్ర మానసిక వేదనకు గురైన బాధితురాలు ఇటీవలే తన స్నేహితులతో లైంగికదాడి విషయాన్ని చెప్పింది. తన స్నేహితుల సూచన మేరకు బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

సాహిత్య వారసత్వం కొనసాగాలి: నందిని సిధారెడ్డి

- ముఖచిత్రం, ముందడుగు గ్రంథాల ఆవిష్కరణ

రవీంద్రభారతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడమే తక్కువ అవుతున్న నేటి పరిస్థితుల్లో సాహిత్య వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. అమ్మంగి వేణుగోపాల్, ఆయన కుమార్తె అమ్మంగి కవితాస్వామి రచించిన పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అమ్మంగి వేణుగోపాల్ రచించిన 'ముఖచిత్రం', అమ్మంగి కవితాస్వామి రచించిన 'ముందడుగు' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిని సిధారెడ్డి పుస్తకాలను ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహిత్యాన్ని, పుస్తకాలను కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. తండ్రీ, కూతుళ్ళ పుస్తకాలను ఆవిష్కరించుకోవడం మరిచిపోని విషయమన్నారు. ఇలాంటి వారసత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. ప్రముఖ రచయిత డా.ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ అమ్మంగి వేణుగోపాల్ ప్రేరణతో తనలాంటి వారు ఎంతో మంది కవిత్వం రాశారని గుర్తుచేశారు. ఆయన కుమార్తె కవితాస్వామి కూడా ప్రేరణ పొంది కవిత్వం రాయడం అభినందనీయమని అన్నారు. శిల్పం సమాజానికి కనిపించేలా చేసేవారే కవి అని అన్నారు. తెలంగాణ భాషాభివృద్ధికి అమ్మంగి వేణుగోపాల్ కృషి చాలా ఉందని అన్నారు. జంట పుస్తకాలను ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి.వి.నరసింహస్వామి, పి.లక్ష్మీనారాయణ, తిరునగిరి దేవకీదేవి, డా.అప్పం పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను బ్యాలెట్‌తో నిర్వహించాలి

- విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్

చార్మినార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికలను బ్యాలెట్‌తో నిర్వహించాలని విశ్రాంత జస్టిస్ వి.చంద్రకుమార్ సూచించారు. శనివారం పురానీహవేలిలోని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 'బ్యాలెట్ తేవాలి.. ఈవీఎంను తొలగించండి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎంపీజే జిల్లా స్థాయి నాయకులతోపాటు పలు సామాజిక సంస్థల ప్రతినిధులు, మేధావులు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సార్వత్రిక ఎన్నికలలో బ్యాలెట్‌ను ఉపయోగిస్తుండగా మన దేశంలో ఎందుకు ఉపయోగించరని వారు ప్రశ్నించారు. మన దేశంలో ఉపయోగిస్తున్న ఈవీఎంలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రతిపక్షాలు సైతం ఈవీఎంల పట్ల సుముఖంగా లేవని వారు అన్నారు. ఎంపీజే జనరల్ సెక్రెటరీ సలీముల్ హిందీ సమావేశానికి కన్వీనర్‌గా వ్యవహరించారు. సమావేశంలో ఎంపీజే ప్రతినిధులు ఏహెచ్ షకీల్, షేక్ ఖాసిం, హైకోర్టు సీనియర్ న్యాయవాది కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ అతీఫ్ ఇస్మాయిల్, షహనాజ్ ఫాతిమా, రాజారావు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు సన్మానం



గోపాల్‌గౌడ్, బాలు గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌గౌడ్

రాజేంద్రనగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 2023 డిసెంబర్ 6న బుద్వేల్ నుంచి శబరిమల యాత్రకు కాలినడకన బయలుదేరిన అయ్యప్ప స్వాములు పి.గోపాల్‌గౌడ్, పి.బాలుగౌడ్ ఈనెల 11న క్షేమంగా తిరిగి వచ్చారు. వారిరువురిని రాజేంద్రనగర్ డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు రాపర్తి రాకేశ్‌గౌడ్ శనివారం సన్మానించారు. 38రోజుల పాటు పాదయాత్ర చేసి శబరిమలకు వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకొని వచ్చిన పి.గోపాల్‌గౌడ్, పి.బాలుగౌడ్ అభినందనీయులని కొనియాడారు. గోపాల్‌గౌడ్, బాలు గౌడ్‌ను సన్మానించిన వారిలో రాజేశ్‌గౌడ్, రాము సాగర్, శ్రీనివాస్‌గౌడ్, సందీప్‌చారి, అక్షిత్‌గౌడ్ ఉన్నారు.

వర్గీకరణ ఉద్యమంలో మీవెంటే ఉంటాం..



మంద కృష్ణ మాదిగను కలిసిన వనం నర్సింహ మాదిగ, తదితరులు

రాజేంద్రనగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వనం నర్సింహ మాదిగ రాజేంద్రనగర్ పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులతో పాటు కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం చేస్తున్న కృషికి ఆయనకు అభినందనలు తెలిపారు. రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంలో మీ వెంట నడుస్తామని, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మాదిగలంతా మీకు అండగా ఉంటారని కృష్ణమాదిగకు హామీ ఇచ్చారు. మందకృష్ణ మాదిగకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళ అదృశ్యం



అస్మా ఖాతున్

యాకుత్‌పురా, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన మహిళ రాలేదు. యాకుత్‌పురా నాగాబౌలి సిద్దిఖీ మాజిద్ ప్రాంతానికి చెందిన అస్మాఖాతున్(42) గత నెల 30న నాంపల్లిలోని యూస్ఫేయిన్ దర్గాకు వెళ్తొస్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి మహ్మద్ ఎయిజాజ్‌ఖాన్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును నమోదు చేసిన్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

యాకుత్‌పురా, జనవరి 13(ఆంధ్రజ్యోతి): యాకుత్‌పురా రైల్వే బ్రిడ్జి నాలా అహమ్మద్ స్వీట్ షాప్ వద్ద శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రెయిన్‌బజార్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీలో భద్ర పరిచారు. మృతి చెందిన వక్తి 50 నుండి 55 సంవత్సరాల లోపు ఉంటాడని, అతని ఒంటిపై నలుపు రంగు ప్యాంట్, ఎరుపు రంగు చొక్క, నలుపు రంగు జాకెట్ ఉందని, గుర్తు పట్టిన వాళ్లు ఉంటే వెంటనే రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

చాంద్రాయణగుట్ట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని ఫలక్‌నుమా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన మహ్మద్ గౌస్(50), షేక్ రహీం(21) మరో వ్యక్తి అయూబ్‌తో కలిసి రేషన్ బియ్యం సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. విశ్వసనీయ సమాచారమందుకున్న ఎస్ఐ మహేశ్ తనిఖీలు చేసి అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ గౌస్, షేక్ రహీంను అదుపులోకి తీసుకోగా అయూబ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణ నిర్వాహకుడిపై కేసు

మదీన, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బాలుడితో పని చేయించుకుంటున్న ఓ కిరాణ దుకాణ నిర్వాహకుడిపై చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం... రిలయన్స్ మార్ట్ ఎదురుగా ఉన్న ఓ కిరాణ దుకాణ యజమాని ఓ బాలుడితో పని చేయించుకుంటున్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బాలుడిని పని మాన్పించి తల్లిదండ్రులకు అప్పగించారు. కిరాణ దుకాణం యజమానిపై కేసు నమోదు చేశారు.

క్యాంపు రాజకీయాలు షురూ

- కర్ణాటకకు 16మంది కార్పొరేటర్లు
- చర్చనీయాంశంగా బండ్లగూడ మేయర్‌పై అవిశ్వాసం

నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ మున్సిపల్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం అంశం చర్చనీయంశంగా మారింది. 22 మంది కార్పొరేటర్లలో ఏకంగా 16 మంది సంతకాలు చేసి కలెక్టర్‌కు లేఖ ఇవ్వడం రాజకీయ వర్గాల్లో ఒక సంచలనంగా మారింది. రాష్ట్రంలో ఒక వైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య విభేదాలు భగ్గుమంటుండగా... ఇక్కడ మాత్రం రెండు పార్టీల వారు ఏకమై ఈ అవిశ్వాస తీర్మానం కోసం లేఖను అందజేశారు. అయితే, ఇందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

అవిశ్వస లేఖ ఇచ్చిన 16మంది కార్పొరేటర్లు కర్ణాటకలో క్యాంపులకు వెళ్లిపోయారు. అవిశ్వాస తీర్మానం ప్రత్యేక సమావేశం రోజునే హైదరాబాద్ రావాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో క్యాంపులో ఉన్న వారితో మేయర్ మహేందర్‌గౌడ్ వర్గం తిరిగి రావాలని రాయబారాలు నడిపిస్తోంది. కేవలం ఆరు నెలల వ్యవధి కోసం అవిశ్వాసం ఎందుకని, డబ్బులు కోసం ఇదతంగా చేస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతుంది.

అవిశ్వాస డ్రామా ఇది..



బూటకపు అవిశ్వాస తీర్మానాలతో వచ్చే పార్లమెంట్ ఎలక్షన్‌లో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జరుగుతున్న ఎలక్షన్ స్టంట్ మాత్రమే ఈ అవిశ్వాస తీర్మానం. తీర్మానంలో నిజాయితీ ఉన్నట్లయితే ప్రజలకు మీరు పెడుతున్న అవిశ్వాస తీర్మానం గురించి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే ఇది ఎలక్షన్ స్టంట్‌గా మిగిలిపోతుంది. నాలుగు సంవత్సరాలుగా లేని అవిశ్వాస తీర్మానం ఇప్పుడు ఎందుకు వచ్చింది. వచ్చే పార్లమెంట్ ఎలక్షన్లలో బీఆర్ఎస్ పార్టీ నేలకూలుతుందనే భయంతోనే ఇలాంటి అస్థిర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలు ప్రతిదీ గమనిస్తునే ఉన్నారు.

- హరీశ్‌గౌడ్ నల్లగొప్పుల, ఎమ్‌సీపీఐయూ రాష్ట్ర కమిటీ, రాజేంద్రనగర్

పార్టీ నియమాలు పాటించకుండా...



పార్టీ నియమాలు పాటించ కుండా, బండ్లగూడ జాగీర్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వసం పెడుతూ కార్పొరేటర్లు కలెక్టర్‌కు లెటర్ ఇవ్వడమేమిటి. కార్పొరేటర్లు సమయమనం పాటించ కుండా ఇలా చేయడం సరికాదు. ఆరు నెలలు దాటితే మున్సిపల్ ఎన్నికలు వస్తాయి. ఎన్నికల సమయం వరకు కార్పొరేటర్లు ఆగలేరా..

- ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర్

అనాథ పిల్లలకు పిండి వంటలు పంపిణీ



చిన్నారులకు మిఠాయిలు పంచిపెడుతున్న జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ శంకర్ యాదవ్

అఫ్జల్‌గంజ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాస్ అనాథ శరణాలయాన్ని శనివారం జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్ సందర్శించారు. అక్కడున్న అనాథ చిన్నారులను కలిసి సంక్రాంతి పండగ విశిష్టతను తెలియజేయడంతో పాటు వారికి పిండి వంటలతో చేసిన మురుకులు, సకినాలు, గర్జలు, నువ్వుల లడ్డూలు, అర్షలను అందజేశారు. కార్యక్రమంలో యువ నాయకుడు జి.తరుణ్ యాదవ్, జెల్ల శ్యామ్ యాదవ్, మహేశ్, సుధీర్‌సింగ్, ద్వారక, లచ్చయ్య, అశోక్ యాదవ్, కట్టా రమేశ్ ముదిరాజ్, అర్జున్ యాదవ్, రమేశ్ గుప్తా, శక్తిసింగ్, సతీష్, వెంటనేశ్, దుర్గా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స



రంగు సుబ్బమ్మతో డాక్టర్ రాజశేఖర్ రావు, డాక్టర్ సన్నీ

అఫ్జల్‌గంజ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శ్వాసకోశ సమస్యతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో కేర్ ఆస్పత్రికి వచ్చిన ఓ వృద్ధురాలికి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. శనివారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చీఫ్ కార్డియాథొరాసిక్ హార్ట్/లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేవీ రాజశేఖర్ వివరాలను వెల్లడించారు. ఇటీవల రంగు సుబ్బమ్మ(65) ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడం కష్టతరం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చూపించడంతో అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి పెద్దాస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో ఇటీవల కేర్ ఆస్పత్రికి రాగా రంగు సుబ్బమ్మకు శస్త్ర చికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడామని తెలిపారు. దాదాపు 3 గంటలకు శ్రమించి శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడామన్నారు. వైద్య పరిభాషలో ఈ శస్త్ర చికిత్సను వాల్వ్ స్పేరింగ్ ఆమోమెటిక్ రూట్ రీప్లేస్‌మెంట్ (డేవిడ్ ప్రొజిసర్) అంటారని ఆయన తెలిపారు. ఎస్.స్వామి, డాక్టర్ సన్నీ, వైద్య బృందం పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



రాజేంద్రనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీలో మహిళలు, నాయకులు

రాజేంద్రనగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షురాలు గడీల పద్మావతి ఆధ్వర్యంలో రామయ్య హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్ సహకారంతో రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతా గౌరీశంకర్, మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు వీణాసేవక్, సరితా రెడ్డి, స్వప్నారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వైశ్రీధర్ హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో తలారి సరిత మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిని ఎం.స్వప్న, మూడో బహుమతిని పూజిత, నాలుగో బహుమతిని సరస్వతీ, ఐదో బహుమతిని వరలక్ష్మీ గెలుచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొమురయ్య. ఇ.వేణుగోపాల్, హరగోపాల్, బీట్యాకరి సిద్ధేశ్వర్, నరేశ్, గణేశ్ పాల్గొన్నారు.

దళితబంధు వద్దు.. అంబేడ్కర్ అభయహస్తం ఇవ్వాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బత్తుల రాంప్రసాద్, ఎల్లేశ్ మాదిగ, అరుణ

అఫ్జల్‌గంజ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 9 ఏళ్ల పాలనలో దళితులను అన్ని రంగాల్లో అణచివేస్తూ దళిత బంధు అనే పేరుతో దళితుల సొమ్ము దోచుకున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై సీబీఐ విచారణ జరిపించాలని మాల, మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు శనివారం గోషామహల్ నుంచి ర్యాలీగా తరలివెళ్లి ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేస్ మాదిగ, జి.అరుణ, జి.శంకర్, శివలింగం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి మాల, మాదిగలు చేసిన కృషిని దృష్టిలో పెట్టుకొని చెవేళ్ల బహిరంగ దళిత సభ డిక్లరేషన్‌లో అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి అండగా నిలుస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నేరవేర్చాలన్నారు. దళితబంధు బదులు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం రూ.12 అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.రమేశ్, రమణ్ సుమన్ కుమార్, సి.నరేందర్, జి.అమరేందర్, లావణ్య, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన విక్రమ్ గౌడ్



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరుపుతున్న ఎం.విక్రమ్ గౌడ్

అఫ్జల్‌గంజ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి రాజీనామా చేసిన దివంగత మాజీ మంత్రి ఎం.ముఖేశ్ గౌడ్ తనయుడు ఎం.విక్రమ్ గౌడ్ త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈమేరకు శనివారం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్రాంతి పండగ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన చర్యలపై మంత్రి పొన్నంతో చర్చించినట్లు చెప్పారు.

రాజాసింగ్‌కు సత్కారం



రాజాసింగ్‌ను సత్కరిస్తున్న దినేష్ అంబారే

బహదుర్‌పుర, జనవరి 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జిగా నియమితులైన గోషామహల్ శాసన సభ్యుడు రాజాసింగ్‌ను నగర బీజేపీ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ దినేష్ అంబారే సత్కరించారు. దూల్‌పేట్‌లోని రాజాసింగ్ నివాసంలో శనివారం ఆయనను మార్యద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాజాసింగ్‌ను కలిసిన వారిలో గోపాల్ జిక్తార్ శశాంక్ అంబారే, ప్రవీణ్ ఉన్నారు.



- గోషామహల్ డివిజన్‌లో జ్ఞాన్‌బాగ్ కాలనీ చౌరస్తా వద్ద డివిజన్ అధ్యక్షుడు నటరాజ్ నాంధారి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, విపిన్ రామవత్, మధుసూదన్, విజయ్ కుమార్, మురళీకృష్ణ, వినోద్, సత్యనారాయణ, గుణవంత్ రావు బిరాదర్, రాకేశ్ అగర్వాల్, దీపక్ కుమార్, తదితరులు

- అఫ్జల్‌గంజ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి)

మౌనిక పహిల్వాన్‌కు కాంస్యం



కాంస్య పతకంతో మౌనిక

కార్వాన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరుగుతున్న 11వ సౌత్ ఇండియా సీనియర్ నేషనల్ రెజ్లింగ్‌లో మౌనిక కాంస్యం గెలుచుకుంది. 62 కేజీల విభాగంలో తెలంగాణ తరఫున కాంస్యం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. ఈసందర్భంగా తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, కోచ్‌లు శ్రీనివాస్, సన్నిబాబు, శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

విజయరాజుకు సన్మానం



విజయరాజుని సన్మానిస్తున్న క్రైస్తవ నాయకులు

మదీన, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్రైస్తవులు తమవంతుగా కృషి చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ నేషనల్ కోఆర్డినేటర్ విజయరాజు గడ్డపాటి అన్నారు. పాతబస్తీకి చెందిన మైనార్టీ క్రైస్తవ నాయకులు శనివారం విజయరాజును సన్మానించారు. ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ బుర్రగళ్ల ఆనందం మాట్లాడుతూ, క్రైస్తవుల సమస్యలపై చట్టసభల్లో లేవనెత్తే నాయకులు తయారు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, ప్రేమ్‌కుమార్, పాస్టర్ జామవా, కాలేబ్‌రాజ్ పాల్గొన్నారు.



- గౌలిగూడలో ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద యువజన ఉత్సవాలకు హాజరైన దర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ విశారాధన్ మహరాజ్‌కు అశోక ధర్మచక్రం అందజేసి సత్కరించారు.

- గోషామహల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి)

పతంగులు ఎగరేస్తున్నారా.. జాగ్రత్త!



మదీన, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఎక్కడ చూసినా పతంగులే కనిపిస్తుంటాయి. మిద్దెలు, భవనాలు, మైదానాలు ఎక్కడ చూసినా పతంగుల సందడే. పతంగులు ఎగురవేయడమంటే కొంతమందికి మహా సరదా. దీన్ని ఒక కళగా, క్రీడగా భావించేవారు కూడా కొందరుంటారు. కొన్ని ప్రాంతాల్లో పతంగుల పోటీలు కూడా నిర్వహిస్తుంటారు. భవనాలు, మైదానాలు ఎక్కడ చూసినా పతంగులు ఎగరవేస్తూ కనిపిస్తుంటారు. సరదా మాటున ప్రమాదం కూడా పొంచి ఉందని గమనించాలి. గాలిపటాలు ఎగరవేసే సమయంలో ఏమాత్రం ఏమరుపాటుకు గురైనా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. సంబరాల సంక్రాంతి కావాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

పిల్లలు పతంగులు ఎగరవేసేటప్పుడు పెద్దలు పర్యవేక్షిస్తూ ఉండాలి. పతంగులు ఎగరవేయడానికి ఎత్తైన భవనాలు, చెట్లు ఎక్కకపోవడం మంచిది. మైదాన ప్రాంతాలు, పార్కులు ఎంచుకోండి. ముందుగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ పతంగులు, పక్షులు, జంతువులకే కాదు మనుషులకు కూడా హాని కలిగించే చైనా మాంజా వాడకపోవడం మంచిది. చైనా మాంజా వాడకంపై ప్రభుత్వం నిషేధం కూడా విధించింది. ఒకవేళ చైనా మాంజా ఉపయోగిస్తే చేతులు, వేళ్లు తెగే అవకాశముంది. కాబట్టి చేతులకు గ్లౌజ్‌లు వాడాలి. భవనాలు ఎక్కితే ఎత్తైన రైలింగ్ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యమైన విషయమేమంటే పైన విద్యుత్ వైర్లు ఉన్నాయా చూసుకోవాలి. ఉంటే వైర్లకు కనీసం వంద మీటర్ల దూరం పాటించాలి. వాహనాల రద్దీతో ఉండే రోడ్లకు దగ్గరగా పతంగులను ఎగరవేయవద్దు. పతంగులు ఎగిరవేయడాన్ని ఒక సరదాగా భావించండి. అంతేకానీ ఆకాశంలో ఎగిరే ఇతరుల పతంగులను మన పతంగులతో కట్ చేయడం, ఎదుటివారితో తగాదా పెట్టుకోవడం చేయొద్దు.

విద్యుత్ స్తంభాలపై చిక్కుకుంటే వదిలేయండి

పతంగులు విద్యుత్ స్తంభాలపై చిక్కుకుంటే వాటిని వదిలేయండి. వాటిని తీసే ప్రయత్నం చేయకండి. తెగి పడిపోతున్న గాలిపటాలను పట్టుకోవడానికి వాటి వెంట పరుగులు తీయకండి. మ్యాన్‌హోళ్లలో పడిపోవచ్చు. రోడ్డుపై వెళ్లే వాహనాలు ఢీకొనే ప్రమాదముంది. గాలిపటం కన్నా మీ ప్రాణాలు అత్యంత ఖరీదైనవని గుర్తుంచుకోవాలి.

రోడ్డుపై వెళ్లేవారూ అప్రమత్తంగా ఉండాలి

రోడ్డుపైన రాకపోకలు సాగించేవారు కూడా అప్రమత్తంగా ఉండాలి. మాంజా దారం కనిపించకుండా రోడ్డుకు అడ్డంగా పడి ఉంటుంది. వాహనాలపై వెళ్లేవారు, నడుచుకుంటూ వెళ్లేవారి మెడకు తగిలి కోసుకుపోయే ప్రమాదముంది. రోడ్డున వెళ్లేవారి గొంతు తెగి మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయని గుర్తుంచుకోవాలి.

- కె.రాజు - ఏడీఈ ఫలక్‌నుమా: 9440812923
- దస్తగిరి (ఏఈ ఛత్రినాక): 9440812940
- ఫ్యూజ్ కాల్ సెంటర్: 9490619810

ఏదైనా విపత్తు జరిగితే సమాచారమివ్వండి




పతంగులు ఎగరవేసే వారు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండండి. మాంజా దారాలు వైర్లకు చుట్టుకొని విద్యుదాఘాతం జరిగే అవకాశముంటుంది. ఇనుప వస్తువులు, విద్యుత్ సరఫరా అళ్లే సామగ్రిని చేతిలో పట్టుకోవద్దు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమివ్వండి.

- కె.రాజు, విద్యుత్ శాఖ ఏడీఈ, ఫలక్‌నుమా

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EIWozIT లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminar లో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.com లో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

'సమస్యలు పరిష్కరించాలి'

రాజేంద్రనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఖాదర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడు తూ, బస్తీల్లో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను రెండు మూడు రోజుల్లో పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలన్నారు. లేదంటే పనిచేయని అధికారుల పేర్లను పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.



అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ఆధ్వర్యంలోని శ్రీరాముడి అక్షింతలు శనివారం గౌలిగూడలోని తెలంగాణ రాష్ట్ర బజరంగ్ సేనా అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్ రావు ఇంటికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీరాముడి అక్షింతలకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ భక్తులు పాల్గొన్నారు.

- అఫ్జల్‌గంజ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి)

కులగణనపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలి

- ఫిబ్రవరి 5, 6 తేదీల్లో బీసీల చలో ఢిల్లీ
- ఎంపీ ఆర్.కృష్ణయ్య



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని పార్లమెంట్ ఎన్నికలలోపే కులగణనపై మోదీ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ. 2లక్షల కోట్లు కేటాయించాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 5, 6వ తేదీలలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి వేలాది మంది బీసీలతో పార్లమెంట్ ముట్టడిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో బీసీల సంక్షేమానికి ఏం చేసిందో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే బీసీ కులగణన, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెడతామని ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీలు మద్దతు తెలుపుతారని అన్నారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 22 నుంచి 50 శాతానికి పెంచాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలనిడిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ భద్రతా చట్టాన్ని తీసుకురావాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామకాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వరంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, కోట్ల శ్రీనివాస్, నందగోపాల్, రామకృష్ణ, టి.రాజ్‌కుమార్, సి.రాజేందర్, ఉదయ్‌నేత, లింగయ్య యాదవ్, రాందేవ్, మల్లేష్, జి.కృష్ణ యాదవ్, రాజేష్‌నేత పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.


చింతలకుంటలో ప్రైవేట్ బస్సులను తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

ప్రైవేట్ వాహనాలపై రవాణా శాఖ కొరడా

- 15 బస్సులపై కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, వనస్థలిపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదం జరగడంతో రవాణాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో ఫిట్‌నెస్ లేని బస్సులు, అనుభవం లేని డ్రైవర్లతో.. అనుమతి లేని రూట్‌లలో బస్సులు తిరుగుతున్నాయి. ఈ విషయం రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ నుంచి నగరానికి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై హైదరాబాద్ జేటీవో రమేష్ సూచనల మేరకు ఎంవీఐలు మహేష్, శ్యామ్ ప్రసాద్, లావణ్య బృందం చింతలకుంట చెక్‌పోస్ట్ వద్ద శనివారం ఉదయం తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 15 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. అలాగే నగరం నుంచి బయలుదేరుతున్న బస్సులపై టోల్‌ప్లాజాల వద్ద అధికారులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా పత్రాలు సరిగా లేకపోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా, పరిమితి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్న తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు యాజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



స్టార్ ఆస్పత్రిలో నిర్వహించిన అడ్వాన్స్ ల్యాప్రోస్కోపిక్ ఫెలోషిప్‌లో వైద్యులు

ముగిసిన అడ్వాన్స్ ల్యాప్రోస్కోపిక్ ఫెలోషిప్

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్టార్ ఆస్పత్రిలో మూడు రోజుల నుంచి జరుగుతున్న 'ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్ ల్యాప్రోస్కోపిక్ హెపాటో-ప్యాంక్రియాటో-బిలియర్ సర్జరీ సదస్సు' శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో 40 మంది సర్జన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అడ్వాన్స్ ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో తమ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి చాలామంది ఆసక్తి చూపారని వైద్యులు వివరించారు. ఒకరి అనుభవాలు పంచుకోవడం, నైపుణ్యతను పెంచుకోవడానికి ఈ సదస్సు చాలా ఉపయోగపడిందని చెప్పారు. కేన్సర్, కడుపు, పేగుల్లో అనవసరమైన కణుతులు, మచ్చలు, ఆధునిక చికిత్స విధానాలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గోపిచంద్ మన్నం, రమేష్ గూడపాటి, టీవీ ఆదిత్య చౌదరి, తిరునావుక్కరసు సంపత్, ఎస్.ఈశ్వరమూర్తి, రవీంద్రనాథ్, రణదీప్ వాధావన్, భరత్‌కుమార్ నారా తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ' కార్యక్రమాలలో ఎన్‌ఎఫ్‌సీకి మూడో స్థానం

కుషాయిగూడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'స్వచ్ఛత హీ సేవ' పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా నగరంలోని అణు ఇంధన విభాగానికి చెందిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్(ఎన్‌ఎఫ్‌సీ) మూడో స్థానంలో నిలిచింది. ఈమేరకు అణు ఇంధన విభాగం నుంచి సర్టిఫికెట్ అందుకున్నట్లు ఎన్‌ఎఫ్‌సీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, మొదటి స్థానంలో చెన్నై కల్పకంలోని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్(ఐజీసీఏఆర్), రెండో స్థానంలో కలకత్తాలోని వేరియబుల్ ఎనర్జీ సైక్లోట్రాన్ సెంటర్ (వీఈసీసీ)లు నిలిచినట్లు వారు వెల్లడించారు.

సాయుధ బలగాలే పోలీసుల బలం

(5వ పేజీ తరువాయి)

సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ బలగాలు సీపీకి సెరిమోనియల్ పరేడ్ నిర్వహించారు. కార్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పలు శాఖల సిబ్బందికి సూచనలు చేశారు.

- **సీఎస్‌డబ్ల్యూ :** వీఐపీ భద్రతలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వహించాలని, పండుగల సందర్భంలో ప్రజల భద్రత దృష్ట్యా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.
- **సీఏఆర్/సీపీఎల్ ఎస్కార్ట్స్:** ఖైదీలను విచారణ నిమిత్తం కోర్టుకు తీసుకెళ్లేటప్పుడు వందశాతం ఎస్కార్ట్‌తో పంపాలని సూచించారు. ముఖ్యమైన ఎస్కార్ట్ విధులు ఎస్-1, ఎస్-2, ఎస్-3లకు తగిన భద్రత కల్పించాలని ఆదేశించారు.
- **వెల్ఫేర్ :** మహిళా పోలీసులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. హోమ్‌గార్డ్స్ అధికారులకు, ఎస్పీవోలకు సంక్షేమం విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.
- **డ్రైవర్స్:** వాహనాల డ్రైవర్స్ సిబ్బంది మెయింటెనెన్స్ చార్ట్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.
- **ట్రైనింగ్ సెంటర్స్:** త్వరలో కొత్తగా వచ్చే పోలీస్ అభ్యర్థుల కోసం అన్ని సదుపాయాలతో శిక్షణా కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ బాబూరావు, డీసీపీ సీఎస్ డబ్ల్యూ అలెక్స్, అడిషనల్ డీసీపీ మాణిక్‌రాజ్, లక్ష్మీనారాయణ, భాస్కర్, కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, విజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఏసీపీలు సీహెచ్‌వై శ్రీనివాస కుమార్, విక్రమ్‌దేవ్, మట్టయ్య, నరేందర్‌రావు, యాకూబ్‌రెడ్డి, కేవీఆర్ సత్యనారాయణ, జి. శ్రీను ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిపుంజు ధరలు

(5వ పేజీ తరువాయి)

శివారు ప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాలలో నాటు కోళ్లను ప్రత్యేకంగా పెంచుతుంటారు. పండుగ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లోని కోళ్ల మార్కెట్‌లు కోడిపుంజులతో నిండిపోయాయి. పాతబస్తీలోని ముర్గీచౌక్, ఎర్రగడ్డ, లింగంపల్లి, ముషీరాబాద్, మెహిదీపట్నం వంటి కోళ్ల మార్కెట్‌లు కోడిపుంజులతో కళకళలాడుతున్నాయి. అంతేకాకుండా నార్సింగి, లింగంపల్లి, మంగళ్‌హాట్, మొయినాబాద్ సంతల్లో కూడా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, నాటుకోళ్ల ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. నార్సింగ్‌లో జరిగే సంత పశువుల క్రయవిక్రయాలకే కాకుండా కోడి పుంజుల అమ్మకాలకు కూడ పేరుంది. దీంతో శుక్రవారం జరిగిన సంతలో దాదాపు రెండు వందలకుపైగా కోడి పుంజులు అమ్ముడు పోయాయి. అయితే, ధర అధికంగా ఉండడంతో కొనుగోలు దారులు నీరసించిపోయారు. సాధారణంగా ఇక్కడ కోడిపుంజు రూ.250 వరకు దొరుకుతుంది. ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో ఒక్కోపుంజును రూ.800నుంచి రూ.మూడువేల వరకు విక్రయించారు. ఇక భారీ సైజులో ఉన్న ఓ కోడిపుంజులకు ధర మరింత అదనంగా ఉండడం కొనుగోలుదారులను కలవరపరిచింది.

నాలాల్లో వ్యర్థాలు

(5వ పేజీ తరువాయి)

జరగలేదు. వర్షాకాలంలో వరదతో మేట వేసిన వ్యర్థాలను నవంబర్, డిసెంబర్‌లో తొలగించాలి. ఎన్నికల నేపథ్యంలో నాలాల పూడికతీత ఎవరూ పట్టించుకోలేదు. దీంతో నాలాల్లో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పరుపులు, దిండ్లు వంటివి ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. ఇవి నాలాల్లో మురుగు నీటి ప్రవాహానికి అవరోధంగా మారుతున్నాయి. దీంతో దుర్వాసన రావడంతోపాటు.. దోమల తీవ్రత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. యూసుఫ్‌గూడ, గోల్నాక, అంబర్‌పేట, అశోక్‌నగర్, చిక్కడపల్లి, దోమలగూడ, కవాడిగూడ, రాంనగర్, బోయిగూడ, బోయిన్‌పల్లి, ఖైరతాబాద్, బాలానగర్ తదితర ప్రాంతాల్లోని నాలాల్లో చెత్తాచెదారం కనిపిస్తోంది. కిందటి సంవత్సరం కొన్ని ప్రాంతాల్లో పనులకు టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాలేదని ఇంజనీరింగ్ విభాగం వర్గాలు చెబుతున్నాయి.

త్వరలో ప్రతిపాదనలు

నాలాల పూడికతీతకు సంబంధించి కొత్తగా టెండర్లు పిలవాల్సి ఉంది. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సర్కిళ్ల వారీగా అధికారులను ఆదేశించాం. కిందటి సంవత్సరం ఎంత మేర పనులు జరిగాయో.. ఆ మేరకు బిల్లుల చెల్లింపు ఉంటుంది. వ్యర్థాల తొలగింపు, తరలింపునకు సంబంధించి అన్ని అంశాలు పరిశీలిస్తాం.

\- ఇంజనీరింగ్ ఉన్నతాధికారి

'పంద్రా మినిట్ పోలీస్ కో హటావో' పుస్తకావిష్కరణను అడ్డుకోవడం తగదు

మంగళ్‌హాట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో రెండంచల పోలీస్ వ్యవస్థ పనిచేసేదని, ఒకటి తెలంగాణ పోలీస్ కాగా మరొకటి ఎంఐఎం పోలీసింగ్ అని "పంద్రా మినిట్ పోలీస్ కో హటావో (15 నిమిషాలు పోలీసులను తప్పించండి) పుస్తక రచయిత షేక్ సాలెహ్ ఎద్దేవా చేశారు. శనివారం లక్డీకాపూల్‌లోని ఉడ్ బ్రిడ్జ్ హోటల్‌లో "పంద్రా మినిట్ పోలీస్ కో హటావో" పుస్తకావిష్కరణ జరగాల్సి ఉండగా, కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఈ పుస్తకావిష్కరణను ఆపేది లేదని, ఇక్కడ కాకుంటే ఢిల్లీలోనైనా పుస్తకాన్ని ఆవిష్కరిస్తానని అన్నారు. ఇందులో వాస్తవాలే ఉన్నాయని, ఎక్కడా వక్రీకరించి రాయలేదన్నారు.

అపార్ట్‌మెంట్‌కు 'జీహెచ్‌ఎంసీ' రోడ్డు

- హెచ్‌ఎండీఏ, దేవాదాయశాఖ భూమిలో.. ● అడ్డుకున్న అధికారులు


ప్రభుత్వ, దేవాదాయశాఖ భూమిలో నుంచి ప్రైవేటు అపార్ట్‌మెంట్‌కు వేస్తున్న రోడ్డు

గచ్చిబౌలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ, దేవాదాయశాఖ భూమిలో నుంచి ప్రైవేటు అపార్ట్‌మెంట్‌కు అనుబంధంగా జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డు వేస్తుండగా ఆయా శాఖల అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడాట్రేడ్‌సెంటర్‌లో జరిగింది. అధికారులు, స్థానికుల కథనం ప్రకారం.. సర్కిల్ పరిధిలోని హుడాట్రేడ్‌సెంటర్ రామాలయం పక్కన హెచ్‌ఎండీఏ భూమి, నల్లగండ్ల సోమేశ్వర ఆలయ భూమి కొంత ఉంది. ఈ భూమిలో నుంచి అనాధికారికంగా ప్రైవేటు అపార్ట్‌మెంట్‌కు అనుకూలంగా జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డు వేస్తుండగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో హెచ్‌ఎండీఏ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పనులు నిలిపివేశారు. భూమికి సంబంధించిన పత్రాలు, వివరాలను ఆయాశాఖ అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారులకు చెప్పడంతో ఈఈ శ్రీనివాస్ రోడ్డు పనులను ఆపాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో పనులు నిలిపివేశారు. అధికారులు స్పందించడంతో ప్రభుత్వ భూమిని కాపాడగలిగారని తెలిపారు. అధికారులు ప్రైవేటు అపార్టుమెంటు కోసం రోడ్డు వేయడం ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

భళా.. బాలలు

రాయదుర్గం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శనివారం ఓ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సినీహీరో సంతోష్ శోభన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకే వేదికపై 300మంది విద్యార్థులతో కూడిన మెగా ఒపెరా భారతీయ డీఎన్ఏ (డీ-ధర్మం, ఎన్-నీతి, ఏ-ఆధ్యాత్మికత) నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శోభన్, పాఠశాల సీఈవో, ఫౌండర్ వినాయక కల్లెట్ల అవార్డులు, పతకాలు అందజేశారు.

డాక్టర్ ఉప్పలపాటి ఇకలేరు



హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ప్రజలకు సుపరిచితులైన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉప్పలపాటి రామవర్మ శనివారం రాత్రి 9గంటల సమయంలో మరణించారు. ఈయన కృష్ణా జిల్లా గురజలో 1928 జులై 28న రైతు కుటుంబంలో జన్మించారు. 1951లో విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి వైద్యవిద్యలో డిగ్రీపట్టా పొందారు. ఉప్పలపాటి నర్సింగ్ హోమ్, విజయా పాలీక్లినిక్ నిర్వహిస్తూ సేవాదృక్పథంతో మంచి పేరు తెచ్చుకున్నారు. అంత్యక్రియలు ఆదివారం (14న) నిర్వహిచనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీలు చోరీలు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మాడ్గుల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 20 లక్షల విలువైన 13 ట్రాక్టర్ ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సుధీర్ బాబు హెచ్చరించారు. నల్గొండ జిల్లా హాలియా మండలం మారేపల్లి గ్రామానికి చెందిన సంపంగి మహేష్ (24) దినసరి కార్మికుడిగా పనిచేసేవాడు. ఇతడి సమీప బంధువు నల్గొండ జిల్లా కనగల్ మండలం చర్లగౌరారం గ్రామానికి చెందిన ఓర్సు వెంకన్న (27)కూడా దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వచ్చే సంపాదన ఖర్చులకు సరిపోకపోవడంతో ట్రాక్టర్ ట్రాలీలు చోరీ చేసి విక్రయించాలని ఇద్దరు కలిసి పథకం రచించారు. పంటపొలాల్లో ఇళ్ల వద్ద, గోదాముల వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీలను రాత్రి సమయంలో ట్రాక్టర్ ఇంజన్ సాయంతో చోరీ చేసేవారు. వాటిని ఇతరులకు తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. కమిషనరేట్ పరిధిలో పలు ట్రాక్టర్ ట్రాలీ చోరీ కేసులు వెలుగులోకి రావడంతో సీపీ ఆదేశాలమేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ ట్రాలీ చోరీ చేస్తున్న మహేష్, వెంకన్నలను కొలకుల పల్లి సమీపంలో మాడ్గుల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 20 లక్షల విలువైన 13 ట్రాక్టర్ ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులకు సీపీ రివార్డులు ప్రకటించారు.

విద్యుత్ లైన్లకు దూరంగా పతంగులు ఎగురవేయాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో పతంగులు ఎగురవేయాలని టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. పిల్లలు పతంగులు ఎగురవేసేటప్పుడు విద్యుత్‌తీగలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేస్తే ఆ పతంగుల మాంజాలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు జరగడంతో పాటు విద్యుత్ అంతరాయాలు తలెత్తుతాయన్నారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే విద్యుత్‌శాఖ 1912 టోల్ ఫ్రీ నెంబర్, సమీప విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు.

నవ్య ఆదివారం

కుటుంబ కదంబం

తెలుగువారు అధికశాతం పండుగలను, పర్వదినాలను చాంద్రమానాన్ని అనుసరించి జరుపుకొంటారు. కానీ మకర సంక్రాంతిని మాత్రం సౌరమానం ప్రకారం నిర్వహిస్తారు. సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి ప్రవేశించే రోజు సంక్రమణం లేదా సంక్రాంతి. ఏడాదిలో పన్నెండు సంక్రాంతులు వస్తాయి. సూర్యుడు ధను రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించిన రోజు... మకర సంక్రాంతి. ఇది సంక్రాంతులన్నిటిలోనూ ముఖ్యమైనది, పరమ పవిత్రమైనది. సూర్యుడు ఉత్తర దిశగా పయనాన్ని ప్రారంభించే సమయం... ఉత్తరాయణ పుణ్యకాలం. సాధారణంగా ఇది పుష్యమాసంలో వస్తుంది.

నవ్య క్రాంతి



విశేషం

మన పండుగలన్నీ ఒకటి, మూడు, అయిదు, తొమ్మిది రోజుల పాటు జరుపుకొనేవి. ఆ లెక్కన చూస్తే... సంక్రాంతిని నెల రోజుల పండుగగా చెప్పవచ్చు. రవి ధనూరాశిలో ప్రవేశించిన రోజు నుంచి మకర రాశిలోకి అడుగుపెట్టేవరకూ... ధనుర్మాసం. తిరుప్పావై పారాయణలు, ప్రతి ఇంటి ముంగిటా ముగ్గులతో ఈ నెలంతా శోభాయమానంగా ఉంటుంది. ఆరుగాలం శ్రమించిన రైతుల ఇళ్ళకు... వారు పండించిన వరి, తృణ ధాన్యాలు చేరుకుంటాయి. అప్పటివరకూ పొలాల్లో పని చేసిన పశుగణం అలసట తీర్చుకుంటూ ఉంటుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అందరూ సకుటుంబంగా కాలం గడిపే రోజులివి. ఈ నెల రోజులూ ముగ్గులు తీర్చి, వాటి మధ్యలో గొబ్బెమ్మలను పేర్చి, లక్ష్మీదేవిని కీర్తిస్తూ మహిళలు గొబ్బి పాటలు పాడతారు.

సంక్రాంతి మూడు రోజుల పండుగ. తొలి రోజు భోగి. అంటే భోగాన్ని ఇచ్చేది. ఇది దక్షిణాయణానికి చివరి రోజు. భోగి మంటలతో ప్రతి వీధి ప్రకాశిస్తుంది. ఈ రోజున వేకువజామునే అభ్యంగన స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఇష్టదైవాలను పూజించి, పెద్దల దీవెనలు పొందాలనేది శాస్త్ర వాక్యం. ఇదే రోజున... శ్రీవ్రతాన్ని పూర్తి చేసిన గోదాదేవి శ్రీరంగనాథునిలో ఐక్యమై, సమస్త భోగాలనూ అందుకుంది. అందుకే ఈ రోజును 'భోగి'గా వ్యవహరిస్తారు. సాయంత్రం చిన్న పిల్లలకు భోగి పండ్లు పోయడం, బొమ్మల కొలువులు పెట్టి పేరంటాలు జరపడం, ముత్తయిదువుల ఆశీస్సులు పొందడం తెలుగునాట ఆనవాయితీ. వైష్ణవ ఆలయాల్లో గోదా కళ్యాణాన్ని నిర్వహిస్తారు.

రెండో రోజు ప్రధానమైన పండుగ. తెలుగువారి పెద్ద పండుగ... మకర సంక్రాంతి. ఈ రోజు కూడా అభ్యంగనస్నానాది విధులతో పాటు... పితృదేవతలకు తర్పణాలు విడుస్తారు. గుమ్మడి పండ్లను వస్త్ర తాంబూలాలతో దానం చేస్తారు. అందుకే దీన్ని 'పెద్దల పండుగ' అని కూడా అంటారు. గృహిణులు పసుపు కుంకుమలతో శ్రీమహాలక్ష్మిని అర్చించి, ఫల పుష్పాదులు సమర్పిస్తారు. వాటిని ముత్తయిదువులకు పంచి... దీవెనలు అందుకుంటారు. వ్యవసాయంలో తమకు సాయపడినవారికి రైతులు ధన, ధాన్య, వస్త్ర రూపంలో కానుకలను అందజేస్తారు. ఈ రోజునే శబరిమలలో అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం భక్తులకు లభిస్తుంది.

మూడో రోజు కనుమ. ఇది కర్షకుల పండుగ. పశువుల కొట్టాల్ని కడిగి, పశువులకు స్నానం చేయిస్తారు. కొత్త వరి బియ్యంతో పులగం చేసి... వాటికి ప్రసాదంగా పెడతారు. మిగిలినది పొలాల్లో జల్లుతారు. దీన్నే 'పొలి చల్లడం' అంటారు. వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉన్న పశుగణానికి ఆ విధంగా కృతజ్ఞతలు తెలుపుతారు. మకర సంక్రాంతి మన సనాతన సంస్కృతి సంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు ప్రతీక. లోకానికి నవ్య క్రాంతి. ప్రకృతిలోని పంచభూతాలకూ కృతజ్ఞతలు తెలుపుకొనే వేడుక.



ముగ్గుల్లో ఆరోగ్యం

కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాదు... ఆరోగ్యపరమైన అంశాలు కూడా ఇమిడి ఉండడం మన పండుగల ప్రత్యేకత. సంక్రాంతి ముగ్గులు కూడా ఆ కోవలోకే వస్తాయి. ధనుర్మాసం ముగిసిన తరువాత సంక్రాంతి వస్తుంది. ధనుర్మాసం నెల రోజులూ ముగ్గులు వేయడం మన సంప్రదాయం. ఈ మాసంలో శీతాకాలం తీవ్రంగా ఉంటుంది. క్రిములు, కీటకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ముగ్గుల ద్వారా వాటిని నిరోధించవచ్చు. ముగ్గులు వేయడం కోసం ఇంటి ముందు పేడ నీళ్ళతో కళ్లాపు జల్లుతారు. ముగ్గు వేయడానికి వరిపిండిని ఉపయోగిస్తారు. గడపలకు పసుపు రాస్తారు. పసుపు, పేడ క్రిమినాశకాలు. అలాగే క్రిములు, పురుగులకు వరిపిండి ఆహారం. వాటి ద్వారా క్రిములు, చిన్న పురుగులు ఇళ్ళలో ప్రవేశించకుండా ఉంటాయి.

వంటింటి చిట్కాలు

- కూరగాయల ముక్కల్ని పసుపు నీటిలో ఉంచితే క్రిములు నశిస్తాయి.
- బొద్దింకలు తిరిగే స్థలాల్లో బేకింగ్ సోడా, చక్కెర కలిపి చల్లితే బొద్దింకలు రావు.
- బంగాళదుంప, క్యారెట్.. ఇలా ఏ దుంపలనైనా ఉప్పు నీటిలో నానబెట్టి ఉడికిస్తే త్వరగా ఉడుకుతాయి.



- ఎక్కువ కాలం అయినా నెయ్యి తాజాగా, మంచి వాసన వచ్చేట్లు ఉండాలంటే కాచేప్పుడు తమలపాకు వేస్తే సరి.
- పల్లీలు వేయించేప్పుడు కొద్దిగా నీళ్ల చల్లి వేయిస్తే పొట్టు త్వరగా ఊడిపోతుంది.
- శనగపిండిలో పెరుగు కలిపి పకోడీలు వేస్తే మెత్తగా ఉంటాయి.

చర్మానికి తగినట్లు...

చలికాలంలో చర్మం మీద పగుళ్లు ఏర్పడుతాయి. అందం దెబ్బతింటుంది. చర్మకాంతి మాయమవుతుంది. బిరుసు అవుతుంది చర్మం. ఇలాంటి పరిస్థితుల్లో మాయిశ్చరైజింగ్ విషయంలో కొన్ని టిప్స్ పాటించాలి..

- చర్మం జిడ్డుగా ఉండే వారికి చర్మం మరింత సున్నితంగా ఉంటుంది. ఇలాంటి వారు కేవలం ఆయిల్ బేస్డ్ లేదా జెల్ బేస్డ్ మాయిశ్చరైజర్‌ను మాత్రమే ఉపయోగించాలి.
- సాధారణ చర్మం ఉండేవారికి మరీ జెల్ బేస్డ్, ఆయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్ అవసరం లేదు. మామూలు స్కిన్ లోషన్ కూడా బాగా పని చేస్తుంది.
- కొందరి చర్మం పగుళ్లు బారినట్లు ఉంటుంది. దీన్నే డ్రై స్కిన్ అంటారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మం మీద ముడతలు వస్తాయి. అందువల్లే దీనికి ఆయిల్ బేస్డ్ మాయిశ్చరైజర్ కచ్చితంగా ఉపయోగించాలి. పొడిచర్మానికి సాధారణ మాయిశ్చరైజర్‌ను ఉపయోగిస్తే సరిపోతుంది.
- ముఖ్యంగా ఎక్కువగా ప్రయాణాలు వెళ్లేవారు,



ఎండలో తిరిగేవారు సైతం వారి చర్మం త్వరగా పాడవుతుంది. వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్స్ దగ్గర పెట్టుకోవటం మంచిదే.

- చర్మంలో ముఖంమీద ఉండే చర్మం మాత్రం సున్నితంగా ఉంటుంది కాబట్టి పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా మంచి డైట్ చేయాలి. తినే ఆహారంలో సి-విటమిన్ ఉండేట్లు చూసుకోవాలి. తాజా ఆకుకూరలు, పండ్లు తినాలి. అంతేనా నారింజ, బొప్పాయి.. లాంటి ఫేస్‌ప్యాక్స్ వేసుకోవటం వల్ల సహజంగానే చర్మం అందంగా తయారవుతుంది. కాంతివంతమవుతుంది.



తెలుగునాట కన్నడ హీరోయిన్ల హవా మళ్లీ పెరుగుతోంది. తాజాగా 'నాసామిరంగ'లో హీరో నాగార్జున సరసన నటించిన అషిక రంగనాథ్ కూడా కన్నడ హీరోయినే! శాండిల్‌వుడ్‌లో విజయాలు సాధించి... టాలీవుడ్‌లో అడుగుపెట్టిన అషికను 'నవ్య' పలకరించింది.

సండే సెలబ్రిటీ

సంక్రాంతి ఎలా జరుపుకొంటున్నారు?

'నా సామిరంగ' విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నా. టాలీవుడ్‌లో అడుగు పెట్టిన తర్వాత ఇది నాకు తొలి సంక్రాంతి. మాది కర్ణాటక. బెంగళూరులో పెరిగాను. కర్ణాటకలో సంక్రాంతి ఘనంగా జరుపుకొంటాం. కానీ తెలుగువారి సంక్రాంతి భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ సినిమాల కోసం ఎదురు చూడటం... వాటి గురించి మాట్లాడుకోవటం... కలెక్షన్స్ లెక్కలు వేసుకోవడం... గొప్ప సినిమా ఉత్సవంలా చేసుకొంటారు. బెంగళూరులో అందరం కలిసేవాళ్లం. కలిసి భోజనాలు చేసేవాళ్లం. కానీ పల్లెటూళ్లలో పండగే వేరుగా ఉంటుంది. అక్కడ సంక్రాంతి అంటే ఊరంతా పండగ.

> ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఉంటుందనేది కొత్త విషయం కాదు. అయితే అలాంటి పరిస్థితుల్లో మన వ్యక్తిత్వం ద్వారా ఎలాంటి మార్పు తీసుకురాగలుగుతున్నాం అన్నదే ముఖ్యం. నా ఉద్దేశంలో ఒక్క పరిశ్రమలోనే కాదు... మొత్తం సమాజంలోనే పురుషాధిక్యత ఉంది. అయితే ఈ మధ్యకాలంలో పరిస్థితులు బాగా మారుతున్నాయి.

పల్లెల్లో ఊరంతా పండగే

పట్టణాల్లో కుటుంబాల పండగ.

మీరు సినిమాల్లోకి ఎలా వచ్చారు?

చిన్నప్పుడు ఎప్పుడూ సినిమాల్లోకి వస్తానని ఊహించలేదు. నేను చాలా సిగ్గరిని. ఎక్కువమంది ఉంటే మాట్లాడేదాన్ని కాదు. మా చెల్లి నాకు పూర్తి భిన్నం. ఎక్కడికైనా దూసుకుపోయేది. మంచి డ్యాన్సర్. దాన్ని చూసి నేను కూడా డ్యాన్స్ నేర్చుకున్నా. డ్యాన్స్ నాకు చాలా పాఠాలు నేర్పింది. ముఖ్యంగా ఆత్మవిశ్వాసం పెంచింది. నేను కూడా నెమ్మదిగా స్కూల్లో డ్యాన్స్ చేయటం మొదలుపెట్టా! మేమిద్దరం బాగా ఫేమస్ అయిపోయాం. మా డ్యాన్స్ లేకుండా ఏ కార్యక్రమం ఉండేది కాదు. కాలేజీలో కూడా ఇదే ఒరవడి కొనసాగింది. 'బెంగళూరు టైమ్స్'లో ఏటా 'ఫ్రెష్ ఫేస్' అనే ఒక పోటీ పెట్టేవారు. కాలేజీల నుంచి కొందరిని ఎంపిక చేసేవారు. అలా మా కాలేజీ నుంచి నేను పాల్గొని, పోటీలో గెలిచా. నా ఫోటోలు పేపర్లో చూసి... నా కిష్టమైన నటుడు పునీత్ రాజ్‌కుమార్‌తో నటించే అవకాశం ఇచ్చారు. అలా నేను కన్నడ సినీ పరిశ్రమలో ప్రవేశించా.

సినిమాల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా ఏం నేర్చుకున్నారు?

అనేక పాఠాలు నేర్చుకున్నా. మొదట్లో నేను నటించగలననే నమ్మకం ఉండేది కాదు. నన్ను నేను 70ఎంఎం స్ర్కీన్‌పై చూసుకున్న తర్వాత... 'నేను కూడా నటించగలను' అనే విశ్వాసం కలిగింది. ఆ తర్వాత నెమ్మదిగా సినిమాలంటే ప్రేమ పెరిగింది. నా ఉద్దేశంలో నటన చాలా కష్టమైన కళ. ఏకాగ్రతతో పని చేయాలి. దానితో పాటుగా బలమైన వ్యక్తిత్వం కూడా ఉండాలి. అందరిలో ఒకరిగా ఉంటే కుదరదు. మనలో ఉన్న మంచి లక్షణాలన్నింటినీ బయటకు తీయాలి. ప్రతి షాట్‌లోనూ నేర్చుకోవటానికి ఏదో ఒకటి ఉంటుంది. నా ఉద్దేశంలో నటన ఒక పెద్ద ప్రయాణం.

> నా ఉద్దేశంలో సహజంగా ఉండటం చాలా కష్టం. నేను నాకు నచ్చిన విషయాన్ని చెబుతాను. చేస్తాను. అదే సమయంలో ఇతరుల అభిప్రాయాలను కూడా గౌరవిస్తా. వారికి ఇబ్బంది కలగకుండా చూసుకుంటా.

మీకు ఏ తరహా పాత్రలంటే ఇష్టం?

కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ అంటే ఇష్టం. లవ్ డ్రామాలలో బాగా చేయగలనని అనిపిస్తుంది. ఇక చరిత్రకు సంబంధించిన పాత్రలు చేయటం చాలా కష్టమని నా అభిప్రాయం. ఎందుకంటే ఎప్పుడో ఒక కాలంలో జీవించిన వ్యక్తి గురించి తెలుసుకొని... వాళ్ల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా నటించటం చాలా కష్టమైన విషయం. ఇప్పటిదాకా నేను అలాంటి పాత్రలేమి చేయలేదు. కానీ అవి చాలా కష్టమనిపిస్తుంది.

కాలేజీ నుంచి నేరుగా సినీ పరిశ్రమలోకి వచ్చేశారు. ఇబ్బందికరమైన పరిస్థితులేమీ ఎదురవ్వలేదా?

> ప్రతి వృత్తిలోనూ చికాకు పెట్టే విషయాలు ఉంటాయి. సినిమాల్లోకి వచ్చిన తర్వాత బయటకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉండదు. ఎప్పుడైనా బయటకు వెళ్తే సెల్ఫీలు తీసుకోవటానికి అనేక మంది గుమ్మిగూడతారు. వాళ్లను వద్దని చెప్పలేం! ఆ సమయంలో మనకు మూడ్ బావుండకపోవచ్చు... ఆరోగ్యం సరిగ్గా ఉండకపోవచ్చు. అయినా నవ్వుతూ ఫొటోలు తీయించుకోవాల్సి ఉంటుంది.

నిజం చెప్పాలంటే నేను మొదట్లో ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరం లేకుండానే సినీ పరిశ్రమలోకి వచ్చేశా. అయితే విజయం సాధించటానికి మాత్రం చాలా కష్టపడాల్సి వచ్చింది. నాలుగైదేళ్ల శ్రమ తర్వాత నాకు హిట్స్ వచ్చాయి. కన్నడలో ఉన్న పెద్ద హీరోల చిత్రాల్లో నటించగలిగా! ఈ క్రమంలో పెద్దగా ఇబ్బందులంటూ ఏమీ ఎదురుకాలేదు. కానీ నాలుగేళ్లపాటు నిరాశ చెందకుండా నిలదొక్కుకోవటమే కష్టమైన విషయం.

సోషల్ మీడియా ప్రభావం మీపై ఎలా ఉంది?

సోషల్ మీడియావల్ల మంచి ఉంది. చెడూ ఉంది. దాని ద్వారా ప్రచారం పొందటం సులభం. కానీ అది ఆరిపోయే వెలుగు మాత్రమే. మనం పది కాలాలు ఉండేలా నిలదొక్కుకోవాలంటే ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉండాలి. మనకు ఏది నప్పుతుందో అదే చేయాలి. ఇతరులను అనుకరించకూడదు. చాలా సందర్భాలలో సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను నమ్మి, ఇతరులను అనుకరించటం మొదలుపెడతారు. దీనివల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా జరుగుతుంది.

- సీవీఎల్ఎన్ ప్రసాద్

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/X7C7OFZలో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cqWSm4G లో చదవండి.

భరద్వాజీయం

ఆయన్ను చూసి నేర్చుకోవాలి

ఎన్టీ రామారావు గారి గురించి తెలుసుకొంటుంటే... ఆయన జీవితంలో ఎన్నో చిత్రవిచిత్రాలు కనిపిస్తాయి. ఆయనకు ఎప్పుడు ఏ మూడు వస్తుందో... ఏంచేస్తారో... ఎలా చేస్తారో ఎవరికీ అర్థంకాదు. 1961లో 'సీతారామకల్యాణం' తీయాలనే ఆలోచన ఎన్టీఆర్‌కు వచ్చింది. అందులో ఆయన రావణాసురుడుగా వేసి, హరనాథ్‌ను రాముడుగా, గీతాంజలిని సీతగా పెడదామనుకున్నారు. వెంటనే గురువుగారైన కేవీ రెడ్డి దగ్గరకు వెళ్లి, దర్శకత్వం చేయమని అడిగారట. 'నిన్ను రాముడుగా, కృష్ణుడుగా చూస్తారు కానీ రావణాసురుడుగా చూస్తారా? నేను నిన్ను అలా ఊహించుకోలేను... అలా తీయలేను' అని కేవీ రెడ్డిగారు అన్నారట. 'సరే... మేమే చేస్తాం' అని ఎన్టీఆర్ సినిమా మొదలుపెట్టారు. టీవీ రాజుతో ఆయనకు ఏదో తేడా వచ్చి... సంగీత దర్శకుడిగా ఎస్ రాజేశ్వరరావును తీసుకున్నారు. 'కానరావ కైలాసవాస' పాట రికార్డింగ్ అయ్యాక రాజేశ్వరరావు గారికి... ఎన్టీఆర్‌కు ఏదో పేచీ వచ్చింది. దాంతో ఎక్కడో ఉన్న తొలి తరం సంగీత దర్శకుడు గాలి పెంచల గారిని తీసుకువచ్చి ఆ సినిమాకు సంగీతం చేయించారు. అందులో పాటలు ఎంత సూపర్‌హిట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఈ రోజుకు కూడా 'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి' పాట ఏ పెళ్లికి వెళ్లినా వినిపిస్తూనే ఉంటుంది. ఆ పాట లేకుండా మన తెలుగింట ఏ పెళ్లీ జరగదు... ఏ పందిట్లోనూ సీతారామ కల్యాణం పూర్తి కాదు. అంత ప్రాచుర్యం పొందింది ఆ గీతం.

ఇక ఈ సినిమా విషయానికి వస్తే... రవికాంత్ నగాయిష్ గారిని కెమెరామన్‌గా పరిచయం చేశారు ఎన్టీఆర్. కైలాస పర్వతాన్ని ఎత్తే షాట్ తీయడానికి ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించారట. ఆ చిత్రానికి దర్శకత్వంతో పాటు అన్నీ తానే అయ్యి నడిపించిన ఎన్టీఆర్ గారు... ఆ ఘనతను ఆయన తీసుకోలేదు. టైటిల్స్‌లో డైరెక్టర్‌గా యూనిట్ పేరు వేశారు. అలాగే 1962లో వచ్చిన 'గుళేబకావళి కథ'కూ ఆయనే దర్శకుడు. దానికి కూడా పేరు వేసుకోలేదు. 1966లో స్వీయదర్శకత్వంలో 'శ్రీకృష్ణ పాండవీయం' చేశారు. అందులో దుర్యోధనుడు, కృష్ణుడుగా ద్విపాత్రాభినయం చేశారు. దానికి కూడా దర్శకుడిగా తన పేరు పెట్టుకోవద్దని అనుకున్నారు. అప్పుడు పుల్లయ్య గారు... 'లేదు... మీరు పేరు వేసుకోవాలి' అని చెప్పారు. అందుకు ఎన్టీఆర్ గారు... 'నేను బీఏ చేశాను సార్. మూడేళ్లు కష్టపడి చదివితే ఆ డిగ్రీ వచ్చింది. అలాగే మూడు సూపర్‌హిట్స్ తీశాక కానీ టైటిల్‌లో దర్శకుడిగా నా పేరు వేసుకోకూడదని అనుకున్నా. ఇప్పటికి రెండు చిత్రాలు విజయవంతమయ్యాయి. ఈ సినిమా కూడా హిట్ అయితే, నాలుగో చిత్రానికి వేసుకొంటా. అప్పుడు నాకు డైరెక్టర్ డిగ్రీ వచ్చినట్టు' అని సమాధానమిచ్చారట. 'ఇది కూడా ఎలాగూ హిట్ అవుతుందిలే. పేరు వేసుకో' అని పుల్లయ్య గారు బలవంతం చేసి, 'శ్రీకృష్ణ పాండవీయం' చిత్రానికి డైరెక్టర్‌గా టైటిల్స్‌లో ఎన్టీఆర్ పేరు పెట్టేలా ఒప్పించారు.



ఒక దర్శకుడు అనేవాడు మూడు విజయాలు అందించాకనే దర్శకుడిగా తన పేరు వేసుకోవాలి అనేది రామారావు గారి అభిప్రాయం. అప్పటికే ఆయన వంద చిత్రాలు అయిపోయినట్టున్నాయి. అంత అనుభవం ఉండి కూడా పేరు వేసుకోవడానికి అంతగా ఆలోచించారు. ఇప్పుడైతే అప్రెంటీస్‌కు వచ్చిన మరుసటి రోజు నుంచే టైటిల్ కార్డులో పేరు పడాలనే తాపత్రయం. ఎన్టీఆర్ సొంతంగా, తన స్వహస్తాలతో కథ రాసుకొనేవారు. ఇవాళ అసిస్టెంట్లు కూడా రాసే పరిస్థితి లేదు. నొక్కుడు మిషన్లు వచ్చేశాయి. లేదంటే కంప్యూటరో, ఫోనో వాడేస్తున్నారు.

రామారావు గారి నుంచి మనం తెలుసుకోవాల్సినవి, నేర్చుకోవాల్సినవి... క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం. అసలు ఆయన ధైర్యం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. రాముడుగా, కృష్ణుడుగా జన నీరాజనాలు అందుకున్న నటుడు... రావణాసురుడి పాత్ర చేయడం, కొత్తగా వచ్చిన హరనాథ్‌కు రాముడి వేషం ఇవ్వడం నిజంగా పెద్ద సాహసం. ఆ పాత్రలతో ప్రేక్షకులను కూడా మెప్పించడం ఆయనకే చెల్లింది. 'శ్రీకృష్ణ పాండవీయం'లో దుర్యోధనుడుగా ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, వాచకం అద్భుతం. ఆయన పౌరాణిక చిత్రాల్లోని డైలాగులు ఏకపాత్రాభినయంగా ఇప్పటికీ ఏదో ఒక వేదికపై వినిపిస్తూనే ఉంటాయి.

ఎప్పటి ఎన్టీఆర్..! ఎప్పటి సినిమాలు..! ఇప్పటికీ మన మనసుల్లో నిలిచిపోయాయంటే... ఆ స్థాయిలో ఉండేది నాడు ఆయన నటవిన్యాసం. మరి ప్రస్తుతం మనం అంతటి అంకితభావంతో సినిమాలు తీస్తున్నామా? సినిమా పూర్తి చేయడానికి సంవత్సరాలకు సంవత్సరాలు తీసుకొంటున్నాం. ఎన్టీఆర్‌ను చూడండి... దర్శకత్వం వహిస్తూ 1961లో ఒకటి, 62లో ఒకటి, 66లో ఒకటి చేశారు. ఇవికాకుండా మధ్యలో వేరే చిత్రాల్లో నటించేవారు. నిబద్ధత ఉంటే సమయం దానికదే వస్తుంది. ఇప్పుడు ఎవరో రాసిన స్క్రిప్ట్ డీటీపీ చేయించి, ప్రింట్లు తీస్తున్నాం. ఇవేవీ లేని ఆ రోజుల్లో అంత పెద్ద హీరో, దర్శకుడు, నిర్మాత అయ్యుండి... స్క్రిప్ట్ కోసం సమయం కేటాయించి, ఆయనే రాసుకునేవారు. ఎన్టీఆర్‌ను చూసి ఇలాంటివి ఎన్నో నేర్చుకోవాల్సినవి ఉన్నాయి. ఆయనొక్కరే కాదు... అలాంటి పెద్దవారిని గుర్తించి, వారి దగ్గరున్న మంచిని మనం గ్రహించాలి.

ఎస్ రాజేశ్వరరావు లాంటి సంగీత దర్శకుడు లేకపోయినా... గాలి పెంచల గారిని తీసుకువచ్చి, మధురమైన సంగీతం ఇచ్చారు ఎన్టీఆర్. కానీ ఇప్పుడేంటంటే విజయవంతమైన టెక్నీషియన్లు మాత్రమే కావాలి. ఈ మధ్యకాలంలో పెద్దపెద్ద వాళ్లను తెచ్చి.. 'ఫుల్ ప్యాడింగ్ ఉంది సార్' అంటున్నారు. ఎందుకంత ప్యాడింగ్? ఏ దర్శకుడైనా... కథను నమ్ముకోవాలి. తనను తాను నమ్ముకోవాలి. 'జనం మెచ్చుకొనేలా నేను తీస్తాను' అని సవాలుగా తీసుకొని చేయాలి. అలా సవాలుగా తీసుకునే... నాడు ఎన్టీఆర్ గారు మూడో హిట్ తరువాత గానీ దర్శకుడిగా తన పేరు వేసుకోనని చెప్పారు. 'ఉన్నవాళ్లు ఉంటారు... లేనివాళ్లు లేదు...' అని ధైర్యంగా సినిమా చేయాలి. ఎవరి కోసమో మన సినిమా ఆగదు. రామారావు, నాగేశ్వరరావు లేకపోతే తెలుగు చిత్ర పరిశ్రమ ఏమైపోతుందోనని అనుకున్నారు. తరువాత కృష్ణ, శోభన్‌బాబు... ఆ తరువాత చిరంజీవి, బాలకృష్ణ... నాగార్జున, వెంకటేష్.. ఇలా తరాలు మారుతున్నట్టే కొత్త హీరోలు వస్తూనే ఉన్నారు. కనుక, రెండు సక్సెస్‌లు ఇచ్చాం కాబట్టి నేనే గొప్పని అనుకోకుండా... ఏ రోజుకారోజు కొత్త విషయాలు నేర్చుకొంటూ, మరింత వైవిధ్యంగా తీయాలన్న తాపత్రయం, తపనతో ముందుకు వెళ్లాలి. నిరంతరం సినిమా గురించే ఆలోచించాలి. అప్పుడే విజయం వరిస్తుంది.

- **తమ్మారెడ్డి భరద్వాజ**, దర్శకనిర్మాత



ఊహించినదానికంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయి



మహేశ్‌బాబు కథానాయకుడిగా, త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'గుంటూరుకారం' చిత్రం ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రఫలితంపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేయడానికి శనివారం చిత్ర నిర్మాత ఎస్.నాగవంశీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నైజాం డిస్ట్రిబ్యూటర్ నిర్మాత దిల్ రాజు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'మొదటి రెండుమూడు షోలకు మిక్స్‌డ్ రివ్యూలు వచ్చాయి. అయితే, ఫస్ట్‌షో నుంచి టాక్ పాజిటివ్‌గా మారింది. తొలిరోజు ఊహించని దానికంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయి. ఇది పూర్తి పండుగ సినిమా. థియేటర్‌కు వచ్చి సినిమా చూడండి. తప్పకుండా ఎంటర్‌టైన్ అవుతారు' అన్నారు ఎస్.నాగవంశీ. ప్రారంభంలో నెగెటివ్ టాక్ వచ్చినప్పటికీ ప్రేక్షకులకు కథ నచ్చి సూపర్‌హిట్ అయిన సినిమాలు చాలా ఉన్నాయని, తల్లీకొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం అసలుసిసలైన సంక్రాంతి సినిమా అని, బాగున్న సినిమా విజయాన్ని ఎవరూ ఆపలేరని, సినిమా వ్యాపారరంగం కనుక గొడవలు సహజమని, ఇక్కడ ప్రత్యేకించి శత్రువులు, మిత్రులు ఉండరని' అని దిల్ రాజు పేర్కొన్నారు.

మానవసంబంధాలతో కూడిన కథ ఇది

- నాగార్జున



స్నేహం, ప్రేమ, త్యాగం, విశ్వాసం.. ఇలా మానవ సంబంధాలతో కూడిన అద్భుతమైన కథ 'నా సామిరంగ'. అని అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతికి కానుకగా ఈ ఆదివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున విలేకరులతో ముచ్చటించారు.

- ప్రీప్రొడక్షన్ పక్కాగా చేసుకున్నాం కాబట్టే సినిమాను వేగంగా పూర్తిచేయగలిగాం. కీరవాణి షూటింగ్‌కు ముందే మూడు పాటలు ఇచ్చేశారు. అలాగే ఫైట్స్ సీక్వెన్స్‌కి నేపథ్య సంగీతాన్ని కూడా ఇచ్చేశారు. ఆ నేపథ్య సంగీతం పెట్టుకొని ఫైట్ షూట్ చేశాం. ఓ విధంగా ఇంత వేగంగా సినిమా పూర్తవ్వడానికి కీరవాణిగారు కూడా కారకులే.
- భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు పండగల నేపథ్యంలో జరిగే కథ ఇది. మన సంక్రాంతి శోభ మొత్తం ఈ సినిమాలో ఉంటుంది. ఇందులో నా పాత్ర పేరు కృష్ణయ్య. నాది టిపికల్ లవ్‌స్టోరీ. నాపాత్రకూ హీరోయిన్ అశికా రంగనాథ్ పాత్రకూ మధ్య ప్రేమ కథ 12ఏళ్లు నడుస్తుంది. అది కూడా వ్యక్తపరచుకోకుండానే.
- దర్శకుడు విజయ్ బిన్నీకి మంచి విజువల్ సెన్స్ ఉంది. తను కొరియోగ్రఫీ చేసిన పాటల్ని కూడా కేవలం స్టెప్పులతోనే కాకుండా ఒక కాన్సెప్ట్‌గా తీర్చిదిద్దుతాడు. అందుకే అతనికి అవకాశం ఇచ్చాను. ఈ కథను అతను తీర్చిదిద్దిన విధానం అందరికీ నచ్చింది. కెమెరా డిపార్ట్‌మెంట్‌తో కలిసి రౌండ్ క్లాక్ పనిచేశాడు. అలాగే పోస్ట్ ప్రొడక్షన్ టైమ్‌లో కూడా అందరినీ సమన్వయపరచుకుంటూ పనిచేయించుకున్నాడు. చక్కని క్లారిటీ ఉన్న దర్శకుడు తను.
- నరేశ్, రాజ్‌తరుణ్ పాత్రలు కథలో చాలా కీలకమైనవి. ఇద్దరూ అద్భుతంగా నటించారు. సాంకేతికంగా అబ్బురపరిచేలా ఉంటుందీ సినిమా. నిర్మాత శ్రీనివాస్ చిట్టూరి ఏ విషయంలోనూ వెనకడుగు వేయలేదు. అందరూ మనసుపెట్టి పనిచేశారు. ఈ సినిమా తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో చేస్తున్నాను.














సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ


కేపీహెచ్‌బీలో బస్సుల కోసం వేచి ఉన్న జనం

సొంతూళ్లకు సంబురంగా

(మొదటి పేజీ తరువాయి)

వాసులు తండోపతండాలుగా స్వస్థలాలకు బయల్దేరటంతో హైదరాబాద్-విజయవాడ రహదారి వాహనాలతో నిండిపోయింది. పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌లతో జనం ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో బస్టాండ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి ఏపీ, తెలంగాణ జిల్లాలకు వేల సంఖ్యలో బస్సులు తరలివెళ్లాయి. రెగ్యులర్ సర్వీసులతో పాటు 1600 ప్రత్యేక సర్వీసులను నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి వరకు ఈ సంఖ్య 2 వేలకు చేరే అవకాశముందన్నారు. ప్రయాణికుల రద్దీ భారీగా పెరగడంతో సంక్రాంతి స్పెషల్ ఆపరేషన్స్‌లో భాగంగా గ్రేటర్‌జోన్ నుంచి 798 సిటీ బస్సులను జిల్లాలకు ఆర్టీసీ నడిపింది. ముందస్తు రిజర్వేషన్ల కోసం 626 బస్సులను ఏర్పాటు చేయగా రద్దీ పెరగడంతో మరిన్ని పెంచినట్లు అధికారులు చెబుతున్నారు. సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు రద్దీగా మారాయి. ఎంజీబీఎస్‌లో రద్దీని తగ్గించేందుకు ఉప్పల్ క్రాస్‌రోడ్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్, కేపీహెచ్‌బీ నుంచి జిల్లాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రెట్టింపు రద్దీ

మహాలక్ష్మి ఉచిత ప్రయాణం కారణంగా ప్రయాణికుల్లో 70 శాతం మంది మహిళలే ఉంటున్నారు. ఉచిత పథకం వర్తించే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వెళ్లేందుకు పోటీపడుతుండటంతో వాటిల్లో రద్దీ విపరీతంగా ఉంటోంది. జేబీఎస్ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో సమీప జిల్లాలకు 500కు పైగా సిటీ బస్సులు వేశారు. జేబీఎస్ నుంచి రోజూ సగటున 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా రెండురోజులుగా ఆ సంఖ్య 90 వేలకు చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రెండురోజులుగా హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై వాహనాలు బారులు తీరాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా, బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా, నల్లగొండ జిల్లా కేతేపల్లి పరిధిలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలు శనివారం వాహనాల రాకపోకలతో సందడిగా మారాయి. ట్రాఫిక్ పోలీసుల పొరపాటు నిర్ణయంతో ధర్మాజిగూడెం జాతీయ రహదారిపై శనివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతుందన్న కారణంతో ధర్మాజిగూడెం వద్ద ట్రాఫిక్ పోలీసులు విజయవాడ వైపు వెళ్లే వాహనాలను కుడివైపు నుంచి కూడా వెళ్లేందుకు (రాంగ్ రూట్‌లో) అనుమతించారు. వీటికి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలు ఎదురై ట్రాఫిక్ స్తంభించిపోయింది. ధర్మాజిగూడెం నుంచి ఇరువైపులా ఆరు కి.మీ. మేర ట్రాఫిక్ జాం అయింది. రంగారెడ్డి జిల్లా అంబర్‌పేట, అబ్దుల్‌పూర్‌మెట్ ప్రాంతాల్లో జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండటంతో అక్కడ కూడా ట్రాఫిక్ స్తంభించింది. అంబర్‌పేట నుంచి కొత్తగూడెం రావడానికి గంటన్నర పట్టింది. ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ రావడానికి 3 గంటల సమయం పట్టింది. జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు మళ్లీ ఒకే రోడ్డు గుండా వాహనాలను పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద భారీగా ట్రాఫిక్ రద్దీ నెలకొంది. సాధారణ రోజుల్లో 35 వేల నుంచి 40 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, శనివారం 65వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించినట్లు జీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించిన బస్సులపై కేసులు

నిబంధనలు పాటించకుండా హైదరాబాద్ నుంచి ఆయా ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్న బస్సులను ప్రత్యేక తనిఖీల్లో గుర్తించి 136 కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ జాయింట్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఎల్బీనగర్, హయత్‌నగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల్లో రవాణా శాఖ ప్రత్యేక బృందాలు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టినట్లు ఆయన వివరించారు. 117 బస్సుల నుంచి రూ.2.7 లక్షలు ట్యాక్స్, మరో రూ.4.17 లక్షలు జరిమానాగా వసూలు చేసినట్లు తెలిపారు.

ఛార్జీలు పెంచిన ప్రైవేటు ఆపరేటర్లు

సంక్రాంతి సీజన్ సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ ఇప్పటి వరకూ 4,484 ప్రత్యేక బస్సులను నడుపడానికి ఏర్పాట్లు చేయగా మరింత డిమాండ్ రావడంతో అదనంగా మరో 500లకు పైగా బస్సులను తీసుకొచ్చారు. అయినప్పటికీ పలువురు ప్రయాణికులు ప్రైవేట్ బస్సులను ఆశ్రయించారు. దీంతో విజయవాడ, గుంటూరు, ఒంగోలు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలు, కడప, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లు చార్జీలను రెండింతలకుపైగా పెంచి వసూలు చేశారు.

బెజవాడకు కార్ల దండు

హైదరాబాద్ మొత్తం ఖాళీ అయిందా... కార్ల దండు కదిలిందా... అన్నట్టు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వచ్చే వారితో విజయవాడ మార్గం వాహన సంద్రమైంది. హైదరాబాద్ నుంచి శనివారం సాయంత్రం 5 గంటల వరకే 65 వేల కార్లు వచ్చినట్టు ఎన్‌టీఆర్ జిల్లా కీసర టోల్‌ప్లాజా గణాంకాలు చెబుతున్నాయి. అర్ధరాత్రికి ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రభావం విజయవాడ నగరంపై పడింది.

కిటకిటలాడిన రైల్వే స్టేషన్లు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఉదయం 4 గంటలకే భారీ ఎత్తున తరలి వచ్చారు. రిజర్వేషన్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. చాలా మంది ప్రయాణికులు ఏటీవీఎం కేంద్రాలను ఆశ్రయించారు. ఒక్కొక్క టికెట్ ధర రూ.5 ఎక్కువ పెట్టి కొనుగోలు చేశారు. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, నెల్లూరు, సామర్లకోట, గూడురు వైపు వెళ్లే రైళ్లు కిక్కిరిసిపోయాయి. సాయంత్రం 4 గంటలకు బయల్దేరే ఫలక్‌నుమాలో జనరల్ బోగిలో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు ఉదయం ఆరు నుంచే రైల్వే స్టేషన్‌లో క్యూ కట్టారు. కాచిగూడ, నాంపల్లి రైల్వేస్టేషన్లు సైతం ప్రయాణికులతో రాత్రి పొద్దుపోయేవరకు కిటకిటలాడాయి. రోజువారీ రైళ్లకు అదనంగా దక్షిణ మధ్య రైల్వే 120కి పైగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

గాలిపటమా పద పద!

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

- ఆకట్టుకున్న విభిన్న రకాల పతంగులు
- 16 దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ రాక
- నోరూరించిన వివిధ రాష్ట్రాల వంటకాలు


కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం, జూపల్లి

హైదరాబాద్/సిటీ/అడ్డగుట్ట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నింగిలోకి ఎగిరిన మిక్కీ మౌస్, డోరేమాన్, హ్యాపీ కిడ్, డైనోసార్, సూర్యభగవాన్, గరుత్మంతుడు.. కేరింతలు కొట్టిన పిల్లలు! ఔను.. ఆయా ఆకారాల్లో తయారు చేసిన భారీ గాలిపటాలు గగనతలంలో విహరించాయి. చిన్నా, పెద్దా అందరినీ అలరించాయి. సాధారణ పతంగులకు భిన్నంగా కనిపిస్తూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌లో ఈ కోలాహలం కనిపించింది. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ల రాకతో నేటితరం పిల్లలు, యువత పండుగ సరదాల వినోదాన్ని, సంప్రదాయ ఆటపాటలను మరిచిపోతున్నారని అన్నారు. పండుగల విశిష్టతను పిల్లలకు తెలియజేయాలని, అప్పుడే వాటి గొప్పదనం పెరుగుతుందని పేర్కొన్నారు. చదువుతోపాటు ఆటపాటలు పిల్లల వికాసానికి దోహదపడతాయన్నారు. అందుకు అనుగుణంగా సాంస్కృతిక శాఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. అందరినీ పండగలో భాగస్వాములను చేసేందుకే పరేడ్ గ్రౌండ్‌లో కైట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో కైట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పేలా కార్యక్రమాలను నిర్వహిస్తామని, పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, పర్యాటక సంస్థ ఎండీ రమేష్ నాయుడు, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నింగిలో పతంగుల సందడి..

ఉదయం 10 గంటల నుంచే ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కాంబోడియా, స్కాట్లాండ్, థాయ్‌లాండ్, కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేసియా, ఇటలీ, తైవాన్, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాల నుంచి వచ్చిన 36 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, 60 మంది దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు వివిధ రకాల పతంగులను నింగిలోకి ఎగురవేస్తూ సందడి చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు పరేడ్‌గ్రౌండ్‌కు తరలివచ్చారు. సంక్రాంతి పండుగకు గ్రామాలకు వెళ్లనివారితోపాటు నగరానికి చెందినవారు కైట్ ఫెస్టివల్‌కు వచ్చి విభిన్నమైన పతంగులను ఆసక్తిగా తిలకించారు. కొంత మంది పిల్లలు విదేశాల నుంచి వచ్చిన కైట్ ఫ్లయర్స్‌తో సెల్ఫీలు దిగారు. పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. కాగా, పతంగులతోపాటు స్వీట్ ఫెస్టివల్ సైతం సందర్శకులను ఆకట్టుకుంది. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల సంప్రదాయ వంటలు, స్వీట్లు, చేతివృత్తులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపించారు. కాగా, కైట్ ఫ్లయర్స్. రాత్రి పూట కూడా సందడి చేశారు. ఫ్లడ్‌లైట్ల సాయంతో రాత్రి 7 గంటల తర్వాత రిమోట్ పతంగులను ఎగురవేశారు. రాత్రి 9 గంటల వరకు సందడి చేయడంతో మైదానంలో పిల్లలు కేరింతలు కొట్టారు. విదేశాల నుంచి వచ్చిన కైట్ ఫ్లయర్స్‌కు పర్యాటక శాఖ అధికారులు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించారు.

పిల్లలు సంతోషపడుతున్నారు

సంక్రాంతి సెలవులు ఉండడంతో పరేడ్ గ్రౌండ్‌లో కైట్స్ ఫెస్టివల్ ఉందని తెలుసుకుని చూడడానికి వచ్చాం. పిల్లలు ఎంతో సంతోషపడుతున్నారు. మూడు రోజుల పాటు ఫెస్టివల్ జరుగడం సంతోషకరం. **- ఓ ఫ్యామిలీ**




పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళలో సిద్ధం చేసిన కోడి పందేల బరి

కోడి పందేలకు సై!

ఏపీలో హోటళ్లు, విడిది ఇళ్లూ కిటకిట.. కోళ్లు.. కోట్లూ.. అన్నీ సిద్ధం

- బరుల చెంతనే మద్యం.. జూదం
- చేతులు మారనున్న కోట్ల రూపాయలు



అమరావతి, భీమవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ... కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. పందేల బరులు.. వాటిని వీక్షించేందుకు ఎత్తైన పరంజాలు, ఆ పక్కనే కోడి పలావు, పకోడి.. వాటి పక్కనే మద్యం బాటిళ్లు.. అన్నీ సర్వసన్నద్ధమైపోయాయి. పందేల చెంతనే పేకాట, గుండాట వంటి జూదాలకు.. అక్కడికి వచ్చే వారికి పార్కింగ్ సౌకర్యాలు ఏ లోటూ లేకుండా.. ఏ లోపమూ రాకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేశారు. కృష్ణా జిల్లాలోని అంపాపురం, ఈడుపుగల్లు, నూజివీడు, పశ్చిమలోని భీమవరం, గణపవరం, ఆకివీడు, వీరవాసరం, పాలకొల్లు, తూర్పుగోదావరిలోని అమలాపురం, ఐ.పోలవరం, ముమ్మిడివరం, పెద్దాపురం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో పెద్ద పెద్ద బరులు ఏర్పాటు చేయగా.. ఇక ఈ మూడు జిల్లాల్లోని చిన్న చిన్న గ్రామాల్లో కూడా ఈ ఏడాది పందేల బరులు ఏర్పాటు చేశారు. ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన బరి వద్ద పెద్ద ఎత్తున వైసీపీ జెండాలను, ముఖ్యమంత్రి జగన్ ఫొటోలతో ఎగరవేశారు. ఆ ప్రాంతమంతా వైసీపీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు కనిపిస్తోంది గానీ.. అక్కడికి వెళితే పందేల జోరు కనిపిస్తుంది. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే పందేలకు రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పందెంరాయుళ్లు తరలివస్తారు. ఈసారి కొన్ని పెద్ద బరుల వద్ద ప్రవేశ రుసుము కూడా పెట్టారు. భీమవరం సమీపంలోని ఓ పెద్ద బరిలో ఎంట్రీ ఫీజు రూ.5వేల వరకు ఉందని చెబుతున్నారు. అయితే అక్కడ సౌకర్యాలు విలాసవంతంగా ఉంటాయి. అందుకే భారీ మొత్తంలో ఎంట్రీ ఫీజు పెట్టారు. గత సంక్రాంతిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కోడి పందాల్లోనే రూ.800 కోట్లు టర్నోవర్ జరిగింది. ఈసారి కూడా అదే స్థాయిలో పందాలు సాగుతాయని అంచనా వేస్తున్నారు. కోడి పందేలను వీక్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జిల్లాకు చేరుకున్నారు. దాంతో భీమవరం, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాల పరిధిలో హోటళ్లు భర్తీ అయిపోయాయి. అతిథి గృహాలు పెరిగాయి. విడిది గృహాలకు కూడా డిమాండ్ ఏర్పడింది. మరోవైపు పందేలు, జూదాలను ఆపేందుకు పోలీసులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.


సంక్రాంతి వేడుకల్లో గవర్నర్ తమిళి సై

రాజ్‌భవన్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజ్‌భవన్ పరివారంతో కలిసి శనివారం ఉదయం వేడుకల్లో పాల్గొన్నారు. గవర్నర్ స్వయంగా ప్రత్యేక వంటకం పొంగల్ తయారు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలంతా సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానన్నారు. ఈసారి సంక్రాంతి ఎంతో ప్రత్యేకమైందని.. పండుగ ముగిసిన వారానికే అయోధ్యలో శ్రీరామమందిరం ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని చెప్పారు. శ్రీరాముని పాదుకలకు రాజ్‌భవన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాం తి వేడుకల నేపథ్యంలోనే ఢిల్లీ వెళ్తున్నట్లు గవర్నర్ తెలిపారు. ఢిల్లీ పర్యటన రాజకీయ పర్యటన కాదని స్పష్టం చేశారు.

నేడు నారావారిపల్లెకు చంద్రబాబు, లోకేశ్

తిరుపతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను స్వగ్రామంలో జరుపుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ ఆదివారం నారావారిపల్లెకు చేరుకోనున్నారు. శుక్రవారమే భువనేశ్వరి ఇక్కడికి చేరుకోగా శనివారం బాలకృష్ణ సతీమణి వసుంధర, ఆమె చిన్న కుమార్తె తేజస్విని, మనవడు దేవాన్ష్ నారావారిపల్లెకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం చంద్రబాబు, సాయంత్రం లోకేశ్, బ్రహ్మణి దంపతులు చేరుకుంటారు. 16వ తేదీ మధ్యాహ్నం చంద్రబాబు తిరిగి వెళ్లనున్నారు.

అరిసెలూ ఆన్‌లైన్!

సకినాలు సహా పిండి వంటలన్నీ ఔట్ సోర్సింగ్

- ఈసారి 80 టన్నులకు పైగానే విక్రయాలు
- నగరాల్లో కానరాని ఇంటి వంట రుచులు
- సమయం, తీరిక లేక అంటున్న మహిళలు



హైదరాబాద్ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సకినాలు, మురుకులు చుడుతూ భోగికి వారం రోజుల ముందే తెలుగు నాట ప్రారంభమయ్యే సంక్రాంతి హడావుడి ముక్కను కొరికే ముక్కనుమ ముగిసిన వెళ్లిన మూడు రోజుల వరకు కనిపిస్తుంది. దీనికే కాదు.. మిగతా పండుగలకూ ఔరౌర గారెలల్ల.. అయ్యారే బూరెలిల్ల.. ఓహోహోరే అరిసెలెల్ల.. అంటూ లొట్టలేస్తూ ఇంటి వంటను తింటూ ఉంటారు మనవాళ్లు. పండుగొస్తే పిండి వంట ఉండాల్సిందేననే తెలుగు నాట.. క్రమక్రమంగా ట్రెండ్ మారుతున్నట్లుగా కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా నగరాలు, పట్టణాల్లో ఈ తరహా ధోరణి కనిపిస్తోంది. పొరుగింటి పుల్లకూర రుచి తరహాలోనే.. పొయ్యి పెట్టి వంట చేసే తీరిక, ఓపిక లేకనో రెడీమేడ్ ఫుడ్‌కు జై కొడుతున్నారు. తెలుగువారికి పెద్ద పండుగల్లో ఒకటైన సంక్రాంతికి అరిసెలు, కజ్జికాయలు, మురుకులు, బూందీ లడ్డూ, సున్నుండలు, బూరెలు ఏవీ ఇప్పుడు పట్టణాలు, నగరాల్లోని ఇళ్లలో పెద్దగా చేసుకోవడం లేదంటే అతిశయోక్తి కాదు.

దుకాణంలో కొనేద్దాం.. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేద్దాం

యూట్యూబ్‌లో ప్రతి వంటకం తయారీ ఉంటుంది కానీ, చేసే ఓపిక ఉండాలిగా..? అరిసెలు కోసం బియ్యం నానబెట్టి నాలుగు రోజులైంది.. ఖాళీ లేక ఆరబెట్టేశాను. వీలు కుదిరితే వాటితో ఏ జంతికలో వేయాలి.. ఇదీ ప్రస్తుతం పట్టణాల్లోని మెజారిటీ గృహిణుల మాట. జీవితం హడావుడి అయిపోయి.. టైమ్ ఈజ్ మనీ అనేలా మారింది పరిస్థితి. దీంతో వారికి సమయం చిక్కడం లేదు. చిక్కినా చేసేంత శక్తి, సహనం కొరవడుతోంది. దీంతో సంప్రదాయాన్ని పక్కనపెట్టి.. బయట దుకాణంలో కొనేద్దాం.. అదీ కాకుంటే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేద్దాం అంటున్నారు. అర కిలో అరిసెలు కొని పండుగ అయిందనిపించేద్దాం అని భావిస్తున్న వారూ ఎక్కువగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ పిండి వంటకాలు అందించే షాపుల వద్ద భారీ జన సందోహం కనిపిస్తోంది. "సాధారణంగా సంక్రాంతికిపది రోజుల ముందు నుంచీ మాకు ఆర్డర్లు మొదలవుతాయి. అందరం కలిపి ఈ సీజన్‌లో 80 టన్నులకు పైగా సంప్రదాయ వంటకాలు విక్రయిస్తాం" అని చెప్పారు హైదరాబాద్‌లోని ఓ స్వగృహ ఫుడ్స్ స్టోర్ ప్రతినిధి. కొవిడ్ కాలంలో, ఆ తరువాత కొన్నాళ్లు పండుగలప్పుడు అపార్ట్‌మెంట్‌లలో నలుగురైదుగురు గృహిణులు కలిసి పిండి వంటలు చేసుకోవడం కనిపించింది. కానీ, ఇప్పుడలా లేదు. దీంతో దుకాణాలకు ఆర్డర్లు బాగా పెరుగుతున్నాయి. "అరిసెలు, సకినాలు, సున్నుండలు ఎక్కువగా కొంటున్నారు. కజ్జికాయలు, బొబ్బట్లు, బూందీ లడ్డూతో పాట కొందరు వాము పూస, చేగోడి లాంటి వాటిని కోరుతున్నారు" అని ఓ దుకాణదారు వివరించారు.

తీరికా లేదు... ఆసక్తీ లేదు

సంక్రాంతి వేళ చేసే పిండి వంటల్లోని రుచి ఎలాగున్నా వాటి తయారీలో కలిసి ఉండడమనే మహోన్నత సందేశం దాగి ఉందనేది సంప్రదాయవాదుల వాదన. ఎప్పుడైతే వీటి తయారీ వదిలేశామో అప్పుడే నాలుగు గోడల బందిఖానాలో మిగిలిపోయామన్నది వీరి భావన. అయితే, జీవనోపాధి కోసం గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగిన తర్వాత సంక్రాంతి పండుగ చేసుకునే తీరులో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆవులు శివార్లలోని గోశాలకు వెళ్తే, గొబ్బెమ్మలు ఆన్‌లైన్‌కు ఎక్కాయి. సంప్రదాయం తప్పదు కదా అనుకునేవారు గోశాలకు వెళ్లి ఆవు పేడ తెచ్చుకుని గొబ్బెమ్మలతో సంబరపడితే, ఆన్‌లైన్‌లో డెలివరీ పెట్టి సరదా తీర్చుకుంటున్నవారూ ఉన్నారు. కాగా, గతంలో మహిళలు ఇంటి పట్టునే ఉండేవారు కాబట్టి పిండి వంటలకు వీలు కుదిరేది. కెరీర్‌కు ప్రాధాన్యతనిచ్చే ఈ రోజుల్లో అది ఎలా సాధ్యమని ఉద్యోగినులు ప్రశ్నిస్తున్నారు. కష్టపడకుండానే అన్నీ దొరుకుతున్నప్పుడు వాటి కోసం సమయం వెచ్చించడం ఎందుకని అడుగుతున్నారు.

మాల్స్, హోటల్స్‌లో పండుగ హంగామా

పండుగ పూట పొయ్యి వెలిగించడం ఇష్టం లేని వారి కోసం హైదరాబాద్‌లోని స్టార్ హోటళ్లు మొదలు సాధారణ రెస్టారెంట్‌ల వరకూ ప్రత్యేక మెనూను దించుతున్నాయి. సంప్రదాయ రుచుల ఆస్వాదన చేయించే పూచీ తమదంటున్నాయి పలు హోటళ్లు. నోవాటెల్‌లో ప్రత్యేకంగా బ్రేక్ ఫాస్ట్ ప్లస్ లంచ్ (బ్రంచ్) ఏర్పాట్లు చేస్తే ఇంకొన్ని రెస్టారెంట్‌లు సంప్రదాయ మెనూతో రారమ్మంటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే నగరంలో పండుగ హంగామా వీటిలోనే ఎక్కువగా కనిపిస్తున్నది. పలు మాల్స్ పండుగ రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో అధిక శాతం వినోదాత్మక గేమ్స్, సెల్ఫీ బూత్‌లు లాంటివి ఉన్నాయి. దాదాపు అన్ని మాల్స్‌లోనూ ఆఫర్ల జోరు నెలకొంది. ఇనార్బిట్ మాల్ లాంటి చోట్ల ప్రత్యేకంగా ఆఫర్లను ప్రకటించి డెకరేషన్ చేశారు. కొందరు ఔత్సాహికులు ఖవ్వాలీలు పెట్టి మరీ హైదరాబాద్ స్ఫూర్తిని తెలిపే ప్రయత్నం చేస్తుండటం విశేషం.

పండక్కి.. మా ఊరొచ్చేయండి!

ఎవ్వరైనా రావొచ్చని ఆహ్వానిస్తున్న యలమంచిలి.. వైభవంగా ఏర్పాట్లు

యలమంచిలి, జనవరి 13: ఆతిథ్యానికి మారుపేరు గోదావరి జిల్లాలైతే.. అందరినీ ఆహ్వానించడం యలమంచిలి గ్రామ ప్రత్యేకత! రెండేళ్లుగా ఈ గ్రామంలో సంక్రాంతి సంబరాలను వినూత్న రీతిలో నిర్వహిస్తున్నారు. పండగ మూడు రోజులూ.. స్థానికులతోపాటే.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినవారు, చుట్టుపక్కల గ్రామాలు.. ఇలా రాష్ట్ర నలు మూలల నుంచి ఏ గ్రామానికి చెందినవారైనా ఆహ్వానితులే! ఎవరైనా సరే సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసి భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులపాటూ అతిథులు ఎంజాయ్ చేసి వెళ్లడమే లక్ష్యంగా సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. రోజుకు ఐదు వేల మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న వారికి సామాజిక మాధ్యమాల ద్వారా ఆహ్వాన పత్రికలను పంపించారు.


యలమంచిలిలో సంక్రాంతి సంబరాలకు సిద్ధమైన సెట్టింగులు



మా అబ్బాయి పెళ్లికి రండి!

» టీడీపీ అధినేత చంద్రబాబుకు షర్మిల ఆహ్వానం



చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న షర్మిల

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును.. కాంగ్రెస్ నాయకురాలు, దివంగత మాజీ సీఎం వైఎస్ఆర్ కుమార్తె షర్మిల శనివారం ఆయన నివాసంలో కలిశారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి, కుటుంబ సమేతంగా పెళ్లికి రావాలని ఆహ్వానించారు. చంద్రబాబును కలిసిన తర్వాత షర్మిల విలేకరులతో మాట్లాడుతూ తమ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని స్పష్టం చేశారు. తన కుమారుడు రాజారెడ్డి పెళ్లికి చంద్రబాబును పిలిచేందుకు మాత్రమే వచ్చానని, ఆయన కూడా పెళ్లి వేడుకకు హాజరై ఆశీర్వదిస్తానని చెప్పారని వెల్లడించారు. కాగా, మణిపూర్‌లో రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో షర్మిల పాల్గొనున్నారు. ఇందుకోసం ఆమె శనివారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం ఉదయం మణిపూర్‌కు చేరుకోనున్నారు.

ఏపీ సీఐడీ కార్యాలయానికి చంద్రబాబు

» ఇసుక కేసులో పూచీకత్తుల సమర్పణ

విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై ఏపీ సీఐడీ అధికారులు మరోసారి తమ వైఖరి ప్రదర్శించారు. ఇసుక కేసుకు సంబంధించి హైకోర్టు ఆదేశాలతో పూచీకత్తులు సమర్పించేందుకు వచ్చిన చంద్రబాబును మూడు ప్రాంతాల్లో తిప్పారు. వాస్తవానికి సీఐడీ కేంద్ర కార్యాలయంలో పూచీకత్తులు సమర్పిస్తామని టీడీపీ చెప్పింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా.. కానూరు, కుంచనపల్లి, గుంటూరుల్లోని మూడు ప్రాంతీయ కార్యాలయాల్లోనే సమర్పించాలని భీష్మించారు. దీంతో చంద్రబాబు శనివారం ఆయా కార్యాలయాలకు వెళ్లి పూచీ కత్తులు సమర్పించారు. ఈ కేసులో చంద్రబాబుకు బెయిల్ ఇస్తూ సీఐడీ కార్యాలయంలో పూచీకత్తు సమర్పించాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి: కోదండరాం

పంజాగుట్ట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. కంపెనీలు, కార్పొరేట్ వ్యవస్థలకు రద్దు చేసిన బ్యాంక్ బకాయిల సొమ్ముకంటే పెన్షన్‌లో ఇచ్చే డబ్బు తక్కువేనని తెలిపారు. పాత పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందేనని, ప్రజలు ఏ మార్పుకోసం పోరాటం చేశారో ఆ ప్రభుత్వం వచ్చిందన్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిపై కేసు

అఫ్జల్‌గంజ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిపై హైదరాబాద్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నారాయణ స్వామిపై ఈ నెల 8న టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు.. వీడియో ఫుటేజ్‌లో నారాయణస్వామి వ్యాఖ్యలను పరిశీలించారు. ఆయనపై 504, 505(2)తో పాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు బేగంబజార్ పీఎస్ సీఐ శంకర్ తెలిపారు.

మెడికో ప్రీతి కేసు నిందితుడు సైఫ్‌కు ఊరట

» సస్పెన్షన్‌ను తాత్కాలికంగా రద్దు చేసిన కేఎంసీ ప్రిన్సిపాల్

హనుమకొండ అర్బన్, జనవరి 13: సంచలనం రేపిన మెడికో ప్రీతి ఆత్మహత్య కేసు నిందితుడు సైఫ్‌కు ఊరట లభించింది. అనస్థీసియా విభాగంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న సైఫ్ సస్పెన్షన్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ తెలిపారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం వెల్లడించారు.

బాబూరావుకు భారత్ సమ్మాన్ అవార్డు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాబూరావుకు ఫ్రాన్స్‌లోని ఎకోల్ సుపీరియర్ రాబర్ట్ డీ సోర్బన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తోపాటు భారత్ సమ్మాన్ అవార్డు అందించింది. రిటైర్డ్ అదనపు డీజీపీ బాబూరావు పోలీస్ అధికారిగా ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించారు. దుబాయ్ వేదికగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గుంటూరు జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన బాబూరావు 1991లో మధ్యప్రదేశ్ ఐపీఎస్ కేడర్‌కు ఎంపికయ్యారు. అక్కడ వివిధ హోదాల్లో పనిచేసి అదనపు డీజీపీగా పదవీ విరమణ పొందారు.

పారిశ్రామిక కారిడార్

(మొదటిపేజీ తరువాయి)

అనుమతించాలని కోరారు. శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఢిల్లీలో పీయూష్ గోయల్‌తో ఆయన కార్యాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌కు నేషనల్ డిజైన్ సెంటర్(ఎన్‌డీసీ) మంజూరయిందని, నాటి కేంద్ర మంత్రి ఆనంద్‌శర్మ దానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్ఐడీని విజయవాడకు తరలించారని, ఈ నేపథ్యంలో తెలంగాణకూ ఎన్ఐడీని మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు మెగా లెదర్ పార్క్‌ను మంజూరు చేసిందని రేవంత్ తెలిపారు. తెలంగాణలో కరీంనగర్, జనగాం జిల్లాల్లో లెదర్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూములను కూడా సేకరించారని, కేంద్ర ప్రభుత్వం దానిని మంజూరు చేస్తే వెంటనే భూమి కేటాయిస్తామని చెప్పారు. దీంతో ఇది మంచి ప్రతిపాదన అని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటూ సమావేశంలో పాల్గొన్న కేంద్ర అధికారులకు సూచించారు.

గ్రీన్‌ఫీల్డ్ హోదా ఇవ్వండి..

కేంద్ర ప్రభుత్వం పీఎం మిత్ర పథకంలో భాగంగా వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. దానికి గ్రీన్‌ఫీల్డ్ హోదా ఇవ్వాలని పీయూల్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ నుంచి గ్రీన్ ఫీల్డ్‌కు మార్పితే పార్క్‌కు గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300 కోట్ల నిధులు వస్తాయని, ఇది అక్కడి పరిశ్రమలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఇక టెక్నికల్ టెక్స్‌టైల్స్ (బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, కన్వేయర్ బెల్టులు, ఎయిర్ బ్యాగ్‌లు తదితరాలు) టెస్టింగ్ సెంటర్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ మేరకు తెలంగాణకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ టెక్నికల్ టెక్స్‌టైల్స్/టెస్టింగ్ సెంటర్‌ను మంజూరు చేయాలని కోరారు. జాతీయ చేనేత సాంకేతిక కేంద్రాన్ని (ఐఐహెచ్‌టీ) కూడా తెలంగాణకు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో ఏడు చేనేత క్లస్టర్లు ఉన్నాయని, ఐఐహెచ్ మంజూరు చేస్తే.. నేత కార్మికులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. దీంతో ఐఐహెచ్‌టీ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. ఇక కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని రేవంత్ కోరగా.. పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించారు. సీఎం, డిప్యూటీ సీఎంలకు అభినందనలు తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి, కొత్తకాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమపండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



పారిశ్రామికాభివృద్ధిపై కేంద్ర మంత్రి పీయూశ్‌గోయల్‌తో సమావేశమైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఖర్గే, రాహుల్‌తో రేవంత్ భేటీ

» ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు, నామినేటెడ్ పదవులు, మంత్రివర్గ విస్తరణపైనా చర్చ!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం ప్రారంభించనున్న భారత్ న్యాయ్ యాత్రపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా రేవంత్ చర్చించినట్లు సమాచారం. రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నామినేషన్లకు ఈ నెల 18 చివరి తేదీ కావడంతో.. ఎవరెవరిని పోటీ చేయించాలనే విషయంపై చర్చించారు. గవర్నర్ కోటాలో నామినేట్ చేయాల్సిన వారి పేర్లపై కూడా రేవంత్ చర్చించినట్లు తెలిసింది. టీజేఎస్ నేత కోదండరాం, ప్రముఖ విద్యావేత్త జాఫర్ జావెద్, కవి అందెశ్రీ తదితరుల పేర్లు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున.. నామినేటెడ్ పదవులకు కూడా పేర్లను ఖరారు చేయాలని, దీంతోపాటు మంత్రివర్గ విస్తరణ కూడా చేయాల్సి ఉందని అధిష్ఠానం దృష్టికి రేవంత్ తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇక ఆదివారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కూడా కలిసి చర్చించనున్నారు.

బీఆర్ఎస్ కారు సర్వీసుకు కాదు.. స్క్రాప్‌కే!

కేటీఆర్ వ్యాఖ్యలకు నిరంజన్ కౌంటర్

బీఆర్ఎస్ కారు.. సర్వీసుకు కాదు స్క్రాప్‌గా మారిందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎద్దేవా చేశారు. కారు సర్వీసుకు వెళ్లింది కానీ.. షెడ్డుకు వెళ్లలేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయినందునే రెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు వేర్వేరు నోటిఫికేషన్లు వచ్చాయంటూ కేటీఆర్ అసంబద్ధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అనంతరం మరో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకోనుందని ధీమా వ్యక్తం చేశారు.

కాళేశ్వరంలో రూపాయి ఖర్చుపెడితే..
వచ్చేది 52 పైసలే!

» ఆర్థిక ప్రయోజనాలు ఉండవన్న కాగ్



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ఒక రూపాయి ఖర్చు చేస్తే.. నికరంగా దాని నుంచి వచ్చే ఆదాయం 52 పైసలు మాత్రమేనని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) స్పష్టం చేసింది. అందువల్ల, ఈ ప్రాజెక్టు ఆర్థికంగా అంత ప్రయోజనకరం కాదని తేల్చి చెప్పింది. ప్రాజెక్టు డీపీఆర్‌ల పరిశీలన మొదలు.. ఖర్చు, బ్యాంకు రుణాలు, అంచనాలపై కొన్ని నెలలుగా అధ్యయనం చేసిన కాగ్ ఈ మేరకు ముసాయిదా నివేదికను రూపొందించింది. ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన అంచనాలను తీవ్రస్థాయిలో తప్పు బట్టింది. ఏటా ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ.14,351 కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చూపిందని, కానీ, అది రూ.28,270 కోట్లు ఉంటుందని కాగ్ అంచనా వేసింది. కాళేశ్వరంలో విద్యుత్తు వినియోగం, స్థిర చార్జీలను కలుపుకొని రూ.10,374 కోట్ల వరకూ ఖర్చవుతుందని లెక్కగట్టింది. కాళేశ్వరంలో విద్యుత్తు వ్యయం కేవలం రూ.4,148 కోట్లుగా సర్కారు అంచనా వేసిందని గుర్తు చేసింది. అలాగే, ఏమాత్రం ఆదాయం లేని కాళేశ్వరం కార్పొరేషన్ నుంచి రుణాలు/అసలు/వడ్డీ చెల్లింపులకు ఏటా ప్రభుత్వం నుంచి రూ.14,462 కోట్లను చెల్లించాలని తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే దాని పరిధిలో వ్యవసాయోత్పత్తుల విలువ రూ.12,553 కోట్లు ఉంటుందని ప్రభుత్వం నివేదించిందని, కానీ అది రూ.10,577 కోట్లు దాటదని కాగ్ లెక్కించింది. ఇక చేపల పెంపకం (ఫిషరీస్); పారిశ్రామిక అవసరాలకు నీటి వినియోగం కింద రూ.5555 కోట్లు వస్తాయని అంచనా వేసిందని, కానీ, ఆ మొత్తం రూ.1069 కోట్లు మాత్రమేనని తేల్చి చెప్పింది. వెరసి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే వార్షికాదాయాన్ని రూ.21,682 కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చూపించిందని, కానీ అది రూ.14,709 కోట్లు మాత్రమేనని లెక్కకట్టింది. కాళేశ్వరం నిర్మాణానికి రూ.87,449 కోట్ల రుణాలు తీసుకున్నారని, వడ్డీ కింద రూ.54,174 కోట్లు అవుతుందని, అంతిమంగా రూ.1.41 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేసింది. అసలు, వడ్డీ చెల్లింపులకు కావాల్సిన ఆర్థిక వనరులు కాళేశ్వరం కార్పొరేషన్‌కు లేవని, వాటిని అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.87 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కొత్తగా సృష్టించిన ఆయకట్టు 40,288 ఎకరాలు మాత్రమేనని కాగ్ గుర్తు చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్‌లలో లోపాలున్నాయని పేర్కొంది.

ఉమ్మడిగా టీడీపీ-జనసేన అడుగులు

» చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్

» మూడున్నర గంటలపాటు సుదీర్ఘ చర్చలు



పవన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారుపై ఉమ్మడిగా పోరాటం, ఉమ్మడిగా పోటీ, ఉమ్మడి మేనిఫెస్టో... వెరసి ఒకే మాట, ఒకే బాటగా ముందుకు సాగాలని టీడీపీ, జనసేన నిర్ణయించుకున్నాయి. ఒక్కడా పొరపొచ్చాలు రాకుండా... అవసరమైన చోట సర్దుబాటుతో పరస్పరం సహకరించుకోవాలని తీర్మానించాయి. ఈ దిశగా టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య విస్తృత చర్చలు జరిగాయి. శనివారం సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ వెళ్లారు. సుమారు మూడున్నర గంటలపాటు ఇరువురు నేతలు భేటీ అయ్యారు. రాత్రి అక్కడే విందు కూడా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన లోకేశ్, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఖరారు, ఉమ్మడి మేనిఫెస్టోపై చంద్రబాబు, పవన్ చర్చించుకున్నారు. పొత్తులో భాగంగా జనసేన పార్టీ వివిధ జిల్లాల్లో ఆశిస్తున్నట్లు సీట్లు, అక్కడ ఆ పార్టీ తరఫున ప్రతిపాదనలో ఉన్న అభ్యర్థులు, సామాజిక సమీకరణాలు తదితర అంశాలపైనా చర్చ జరిగింది. వైసీపీ కొంత మంది ఎమ్మెల్యేలు, ఎంపీలకు సీట్లు నిరాకరించడం... ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు కొందరు టీడీపీ, జనసేన వైపు చూస్తుండటం ఈ భేటీలో చర్చకు వచ్చింది. వివిధ సమీకరణాల దృష్ట్యా మంచి అభ్యర్థులు అవుతారనుకున్న వారు తమ వైపు వస్తే తీసుకుని, పోటీకి అవకాశం ఇవ్వాలని, అదే సమయంలో రెండు పార్టీల కింది స్థాయి నేతల మనోగతాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని ఈ సమావేశంలో ముఖ్య నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు.

2 ఎంపీ, 10 అసెంబ్లీ.. అభ్యర్థులు ఖరారు!

టీడీపీతో సీట్ల సర్దుబాటు కొలిక్కి వస్తుండటంతో... జనసేన తన అభ్యర్థుల ఖరారు దిశగా అడుగులు వేస్తోంది. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలోనే బస చేస్తున్న పవన్ కల్యాణ్ జిల్లాల నుంచి నాయకులను పిలిపించుకుని చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంత మంది నాయకులకు సీటు విషయంలో పవన్ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

వైసీపీకి ఎంపీ బాలశౌరి గుడ్‌బై

» గతంలో రేవంత్ విందుకు బాలశౌరి.. జగన్ సీరియస్

అమరావతి/విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన, కాపు సామాజిక వర్గానికి చెందిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్టీకి గుడ్‌బై చెప్పారు. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనపార్టీలో చేరాలని నిర్ణయించుకున్నా" అని ట్విట్టర్(ఎక్స్) వేదికగా బాలశౌరి పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా సమర్పించిన నేపథ్యంలో కొందరు పార్లమెంటు సభ్యులకు ఆయన విందు ఇచ్చారు. ఈ విందుకు వైసీపీ ఎంపీ హోదాలో బాలశౌరి హాజరయ్యారు. ఇది సీఎం జగన్‌కు ఆగ్రహం తెప్పించింది. మచిలీపట్నం వైసీసీ నేతల ముందే బాలశౌరిపై జగన్ అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. రేవంత్ ఇచ్చిన విందుకు వెళ్లడాన్ని ఆయన పార్టీ లైన్ దాటి వ్యవహరించినట్టుగా భావించారు. దీంతో, బాలశౌరి హోదాను కూడా చూడకుండా బాలశౌరిని తూలనాడారని తెలిసింది. సీఎం జగన్ వైఖరితో బాలశౌరి ఆత్మాభిమానం దెబ్బతింది. దీంతో.. తిడితే సహించేదిలేదంటూ పార్టీకి దూరమయ్యారు. కాగా, బాలశౌరి త్వరలో జనసేనలో చేరనున్నట్లు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి, పార్టీలో చేరాలన్న తన అభిప్రాయాన్ని పవన్‌కు చెప్పగా, ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో శనివారం బాలశౌరి తన నిర్ణయాన్ని ప్రకటించారు. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచే ఆయన జనసేన తరఫున బరిలో ఉంటారని సమాచారం.

ఆటో కార్మికులకు 15 వేల భృతి ఇవ్వాలి

» వారి సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతా

» ఒకరికి మంచి చేయడానికి ఇంకొకరి పొట్టకొట్టొద్దు: హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 13: రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మంది ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అసెంబ్లీలో మాట్లాడుతానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు పలు క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం మంచి కార్యక్రమమే అయినప్పటికీ ఒకరికి మంచి చేయడానికి ఇంకొకరి కడుపు కొట్టొద్దని సూచించారు. ఆటో కార్మికులను రోడ్డుపాలు చేయడం సరి కాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి రూ.15 వేల భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అధిష్ఠానం అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తా: మల్లారెడ్డి

బోయినపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం అవకాశం ఇస్తే మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుస్తానని బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బోయినపల్లిలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ సీటు విషయంలో అధిష్ఠానం తనకు అవకాశమిస్తే బరిలో ఉంటానని మల్లారెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందనే..
'ప్రాణహిత' ఆపారు

తెలంగాణ సమాజం కేసీఆర్‌ను క్షమించదు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి)/ఆత్మకూరు(ఎస్): కాంగ్రెస్ పార్టీకి క్రెడిట్ దక్కుతుందనే అక్కసుతోనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును గత ప్రభుత్వం పక్కనపెట్టిందని, ఈ విషయంలో తెలంగాణ సమాజం కేసీఆర్‌ను క్షమించదని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జలసౌధలో నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యం వల్లే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీళ్లివ్వలేకపోతున్నామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, ప్రస్తుతం 9 లక్షల ఎకరాలకు కూడా సాగునీటిని అందించే పరిస్థితి లేదని చెప్పారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం ఆల్మట్టి నుంచి 10 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలవనున్నామని తెలిపారు. అదే విధంగా మహారాష్ట్రలో 100 టీఎంసీల సామర్థ్యం కలిగిన కోయ్‌నా ప్రాజెక్టు నుంచి జలవిద్యుత్తు ఉత్పత్తి చేయడం ద్వారా ఆ నీటిని సముద్రంలో వదిలేస్తున్నారని, అలాకాకుండా ఆ నీటిని తెలంగాణకు అందిస్తే.. దానికి బదులుగా నిధులు ఇవ్వడానికి సమ్మతి తెలుపుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాయనున్నామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలకు సంబంధించిన డాక్యుమెంట్లు గల్లంతు కాకూడదనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో సోదాలు చేయించి, ఆ డాక్యుమెంట్లను కాపాడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో 75 శాతం దాకా నిర్మాణం జరిగిన 18 ప్రాజెక్టులను ఆర్నెల్లలో పూర్తి చేయాలని లక్ష్యంగాపెట్టుకున్నామని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి 4.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును అందుబాటులోకి తెచ్చి, నీళ్లందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. నీటి పారుదల శాఖను కూడా పునర్వ్యవస్థీకరిస్తామని ప్రకటించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. జాతీయ ప్రాజెక్టుకు బదులుగా ప్రధానమంత్రి కృషిసించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) కింద 60% నిధులను పాలమూరు ప్రాజెక్టుకు అందించడానికి కేంద్రం సమ్మతి తెలిపిందన్నారు. కేంద్ర సహాయం కోసం వారం రోజుల్లోపు ప్రతిపాదనలు పంపించనున్నామని పేర్కొన్నారు. చెరువుల్లో పూడిక తీతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నామని, ఆ తర్వాత కాలువలను కూడా మరమ్మతు చేయనున్నామని చెప్పారు. కాగా, పదవీ విరమణ చేసినా, కేడర్ పోస్టుల్లో కొనసాగుతున్న వారిని తొలగించాలని పలువురు ఇంజనీర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంత్రి ఉత్తమ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు.

రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుస్తాం

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ 13 నుంచి 14 సీట్లు సునాయాసంగా గెలుస్తుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. సూర్యాపేటజిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌పై రోజురోజుకూ ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని చెప్పారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No. 76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 14 జనవరి 2024

నా మీద ఫైట్లు ఎందుకురా అనేవాడు

కోదండరామిరెడ్డి

నటభూషణ శోభన్‌బాబుకు అత్యంత సన్నిహితులైన దర్శకుల్లో ఎ.కోదండరామిరెడ్డి ఒకరు. 'ఏరా' అని ఆయన్ని ఆప్యాయంగా పలకరించేవారు శోభన్‌బాబు. 'ఏమయ్యా' అని ఆయన్ని పిలిచేవారు కోదండరామిరెడ్డి. 'మనుషులు మారాలి' చిత్రంతో మొదలైన వీరిద్దరి అనుబంధం చివరి వరకూ కొనసాగింది. తనకు ఆత్మీయుడైన శోభన్‌బాబు గురించి కోదండరామిరెడ్డి చెప్పిన విషయాలివి.





శోభన్‌బాబుతో నాకు ఎన్నో జ్ఞాపకాలు. చాలా మంచి వాడు. అందగాడు కూడా. మహిళల్లో అతనికి విపరీతమైన ఫాలోయింగ్ ఉండేదని మీకందరికీ తెలుసు. తన పక్కన ఫలానా వాళ్లని హీరోయిన్‌గా పెట్టమని ఎప్పుడూ చెప్పలేదు శోభన్‌బాబు. ఏ విషయంలోనూ జోక్యం చేసుకొనేవాడు కాదు. సబ్జెక్ట్ లైన్, తన పాత్ర, పారితోషికం... ఇవి మాత్రమే చూసుకునేవాడు. దర్శకనిర్మాతలమీద నమ్మకంతో మిగిలిన విషయాలు పట్టించుకునేవాడుకాదు. షూటింగ్ స్పాట్‌లో ఇంకో టేక్ చేద్దామా' అని అడిగితే 'చాల్లేరా.. ఎన్నిసార్లు చేసినా ఇంతకంటే ఎక్కువ రాదు' అనేవాడు. అలాగని వళ్లు దాచుకునేవాడు కాదు. కాకపోతే రిస్కీ షాట్స్‌కు దూరంగా ఉండేవాడు. అతను చేసింది ఎక్కువగా ఫ్యామిలీ డ్రామాలే కదా. ఫైట్లు తక్కువగా ఉండేవి. 'కోడెత్రాచు' వంటి కొన్ని సినిమాల్లో ఫైట్లు పెట్టాను. 'నా మీద ఫైట్లు ఎందుకురా.. ఎవరన్నా చూస్తారంటావా?' అనేవాడు. 'ఎప్పుడూ ఫ్యామిలీ డ్రామాలేనా.. యాక్షన్ సినిమాలు కూడా చేస్తే వెరయిటీగా ఉంటుందయ్యా' అనేవాడిని. 'అంతేనంటావా.. సరే కానీ' అని ఒప్పుకొనేవాడు.

హీరోలు ఎక్కువ తినకూడదు రా

శోభన్‌బాబు డబ్బు బాగానే సంపాదించాడు. నిర్మాతల ముక్కు పిండి తన పారితోషికం వసూలు చేసేవాడు అని అతని గురించి చెబుతుంటారు. అందులో తప్పేముంది? సినిమా చేసేముందు ఒప్పుకొన్న మొత్తాన్ని నిర్మాత చెల్లించాలి కదా. ఎవరికీ దానాలు చేయడు అంటారు. కష్టపడి సంపాదించుకున్న డబ్బును ఊరికే ఎందుకు ఖర్చు చేయాలి? పొద్దున్నే నాలుగున్నర, అయిదు గంటలకు లేచేవాడు. యోగా చేసేవాడు. ఏడున్నరకు లైట్‌గా టిఫిన్ తినేవాడు. తిండి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవాడు. షూటింగ్ ఉంటే మేకప్ వేసుకుని షూటింగ్‌కు వచ్చేవాడు. మధ్యాహ్నం పెద్దగా తినేవాడు కాదు. ఇంటి దగ్గర నుంచి క్యారేజ్ వచ్చేది. 'చికెన్ బాగుంది... తిను' అని నేను అంటే ఒక్క ముక్క మాత్రం తిని ఇక చాలు అనేవాడు. 'మేం హీరోలం కదా.. ఎక్కువగా తినకూడదు రా' అని నవ్వేసేవాడు.

సాయంత్రం ఆరు దాటితే..

సాయంత్రం ఆరు దాటిందంటే చాలు షూటింగ్ స్పాట్‌లో ఉండేవాడు కాదు. ఆ విషయం ముందే చెప్పేవాడు. సినిమా ఒప్పుకొనేముందు 'నేను సాయంత్రం ఆరు గంటల తర్వాత ఒక్క నిముషం కూడా సెట్‌లో ఉండనండీ. ఐదున్నరకే నాకు మూడ్ ఆఫ్ అయిపోతుంది. ఐదున్నర తర్వాత నన్ను పంపించేస్తే బెటర్. సిక్స్ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో చేయను. నైట్ తీయాల్సిన సన్నివేశాలు ఉన్నాయనుకోండి. పగలంతా నాకు రెస్ట్ ఇస్తే చేస్తా. లేకపోతే నైట్ షూటింగ్ చేయను. ఆదివారాలు అసలే చేయను' అని చెప్పేసేవాడు. దానికి ఇష్టపడిన వాళ్లకే సినిమా చేసేవాడు.

పర్‌ఫెక్ట్ లైఫ్ అతనిది. ఆరు గంటలకు ఇంటికి వెళ్లిన తర్వాత స్నానం చేసి ఫ్రెషప్ అయి, ఓల్డ్ బెంజ్ కారులో తన ప్రాపర్టీస్ ఎక్కడెక్కడ ఉన్నాయో ఒకసారి వెళ్లి చూసుకొనేవాడు. ఎవరన్నా కబ్జా చేస్తే లేనిపోని తంటా కదా!

కూతుళ్లకు పక్కపక్కనే ఇళ్లు కొని పెట్టాడు. ముగ్గురు కూతుళ్లు , ఒక కొడుకు. అందరూ సాయంత్రం ఏడున్నరకల్లా డిన్నర్ చేయడానికి తండ్రి దగ్గరకు వచ్చేవారు. మనవలు, మనవరాళ్లతో కలసి కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసేవారు. ఆ తర్వాత న్యూస్ చూసి తొమ్మిది, తొమ్మిదిన్నరకల్లా పడుకొనేవాడు శోభన్‌బాబు. సిగరెట్, మందు ఇలాంటి అలవాట్లు అసలు లేవు. ఎటువంటి దురలవాట్లు లేని వ్యక్తి అలా హఠాత్తుగా చనిపోవడం దురదృష్టకరం.

(శోభన్‌బాబు జయంతి సందర్భంగా)

చిరంజీవికి అయోధ్య ఆహ్వానం



ఈ నెల 22న అయోధ్యలో జరగనున్న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనేందుకు చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం అందింది. శ్రీరామ జన్మభూమి ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్ జాతీయ నాయకులు గుర్రం సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ శశిధర్ రావినూతల శనివారం చిరంజీవిని ఆయన ఇంట్లో కలిసి, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'వందల సంవత్సరాల నిరీక్షణ ఫలించి, అయోధ్యలో రామాలయ నిర్మాణం, రామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యరూపం దాల్చనుండడం ఆనందకరం. ఇలాంటి ఒక చారిత్రాత్మక ఘట్టంలో పాలు పంచుకోవడం గొప్ప అదృష్టం. ఈ ఆహ్వానాన్ని నాకు అందజేసిన రామజన్మభూమి ట్రస్ట్‌కు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమానికి నా కుటుంబంతో హాజరవుతాను' అని అన్నారు. గుర్రం సంజీవరెడ్డి మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమలో మొదటి ఆహ్వానాన్ని చిరంజీవి గారికి అందజేశాం. ఆలయం కోసం సుదీర్ఘంగా జరిగిన న్యాయపోరాటం గురించీ, ఆలయ నిర్మాణ విశేషాలను గురించి ఆయన మాకు వివరించడం ఆశ్చర్యం కలిగించింది' అన్నారు. రామ్‌చరణ్‌కు కూడా వీహెచ్‌పీ ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానాన్ని అందజేశారు.



మెగా ఫ్యామిలీ సంక్రాంతి వేడుకలను జరుపుకోవడానికి బెంగళూరుకు పయనమయ్యారు. రామ్‌చరణ్, ఉపాసనా దంపతులు తమ కుమార్తె క్లీంకారతో కలిసి ఈ వేడుకకు బయలుదేరగా, వీరితోపాటు పవన్‌కల్యాణ్ కుమారుడు అఖిరానందన్, కుమార్తె ఆద్య కూడా ఉన్నారు. వీరందరూ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబ సమేతంగా కెమెరాలకు చిక్కారు.



కత్రీనాతో కలిసి నటించడానికి భయపడ్డా



హిందీ, తమిళ భాషల్లో రూపొందిన 'మెర్రీ క్రిస్మస్'తో మంచి హిట్ కొట్టారు అగ్రనటుడు విజయ్ సేతుపతి. ఈ నెల 12న సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియా సాక్షిగా ఆనందం వ్యక్తం చేస్తూ.. ఆసక్తికరమైన వాఖ్యలు చేశారు విజయ్ సేతుపతి. 'ఇందులో హీరోయిన్‌గా కత్రీనాకైఫ్‌ని ఖరారు చేశామని దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ చెప్పగానే షాక్ అయ్యా. మా కాంబినేషన్ సీన్స్ ఇందులో ఉంటాయా? అని అమాయకంగా అడిగాను. అంతేకాదు, లొకేషన్లో కత్రీనాతో కలిసి నటించడానికి భయపడ్డా కూడా. ఆమె ఎంత గొప్ప నటో తెలిసిందే కదా. అందుకే కాస్తంత భయం. నిర్మాణం జరుగుతున్న రోజుల్లో ఈ సినిమా ప్రస్తావన ఎక్కడైనా వచ్చినప్పుడు.. 'శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో నటిస్తున్నాను' అనంటే.. 'అవునా..' అంటూ సింపుల్‌గా స్పందించే వాళ్లు. 'కత్రీనాకైఫ్ ఇందులో హీరోయిన్' అని చెబితే.. 'నువ్వు అతిథి పాత్ర చేస్తున్నావా? ఇది హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీనా?' అంటూ చిత్రమైన ప్రశ్నలు అడిగేవారు. ఏది ఏమైనా ఈ సినిమా మాత్రం నాకు ఓ వింత అనుభవాన్ని ఇచ్చింది.' అంటూ చెప్పుకొచ్చారు విజయ్ సేతుపతి.

కష్టపడటానికి సిద్ధంగా ఉన్నా




అమితాబ్ మనవడు అగస్త్యనంద బాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాడు. అమితాబ్ కుమార్తె శ్వేతాబచ్చన్ కుమారుడైన అగస్త్యనంద రీసెంట్‌గా 'ది అర్చీస్' అనే సినిమా ద్వారా చిత్రరంగ ప్రవేశం చేశారు. ఈ సినిమాలో తనతోపాటుగా షారుక్‌ఖాన్ కుమార్తె సుహానాఖాన్, శ్రీదేవి కుమార్తె ఖుషి కపూర్ కూడా తెరంగేట్రం చేయడం విశేషం. ఓటీటీలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మిశ్రమ స్పందన లభించగా, చలనచిత్ర ప్రముఖులు మాత్రం ఈ సినిమాతో పరిచయమైన సెలబ్రిటీ కిడ్స్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ సినిమాలోని తమ నటనపై సోషల్ మీడియాలో వినిపిస్తున్న ట్రోల్స్‌పై అగస్త్యనంద స్పందించారు. 'ట్రోలింగ్స్ ఎలా ఎదుర్కోవాలో నాకు తెలీదు. మా సినిమాను కొందరు విమర్శిస్తుంటే, మరికొందరు ప్రశంసిస్తున్నారు. అందరి అభిప్రాయాలనూ గౌరవించాల్సిందేనని తాతయ్య చెప్పారు. ఇది మా తొలి సినిమా. ఈ సినిమాలో నా నటన కొందరికి నచ్చకపోవచ్చు. నేను కష్టపడటానికి సిద్ధంగా ఉన్నాను. రెండుమూడు సినిమాల తర్వాత అయినా వాళ్లను నేను మెప్పిస్తాను' అని నమ్మకం వెలిబుచ్చారు అగస్త్యనంద. జోయా అక్తర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.

మున్ముందూ సంక్రాంతి జోరు


సంక్రాంతి పండుగ చిత్ర పరిశ్రమకు కొత్త జోష్‌ని తెచ్చింది. పండుగకు మూడ్రోజుల ముందు నుంచే బాక్సాఫీసుకు కొత్త కళ వచ్చింది. ఏ సినిమా హిట్టు, ఏ సినిమా ఫట్టు అనే చర్చ ఎప్పుడూ నడిచేదే కానీ మొత్తంగా చూసుకుంటే ఈ ఏడు సంక్రాంతి రూపంలో పరిశ్రమకు ఆరంభం అదిరిందనే చెప్పాలి. ఫలితం ఎలా ఉన్నా ప్రతీ సినిమాకూ నాలుగు కాసులు రాలడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని తరువాత రాబోయే బ్యాట్స్‌మెన్లు కూడా కొనసాగించాలనేదే అటు పరిశ్రమ వర్గాలు, ఇటు ప్రేక్షకలోకం కోరుకునేది.

'సంక్రాంతికి ఎవరు రావాలి?, ఎవరు ఆగాలి?'... అనే ఎడతెగని చర్చతో తెలుగు చిత్ర పరిశ్రమ వారాల తరబడి వార్తల్లో నిలిచింది. పరిష్కారం కాకుండానే సినిమాలు స్క్రీన్లపైకి రావడం జరిగింది. రిలీజ్ డేట్‌కు ఖర్చీఫ్ వేసుకున్న సినిమాలు అన్నీ దాదాపు విడుదలవుతున్నట్టే. ప్రస్తుతానికైతే విడుదలైన అన్ని సినిమాలకూ టాక్‌తో సంబంధం లేకుండా ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది.


అగ్రహీరోల చిత్రాలు బరిలో దిగడంతో థియేటర్ల దగ్గర సంక్రాంతి సందడి మొదలైంది. అలాగే ఈ ఏడాది కూడా టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా చిత్రాల ఒరవడి మొదలైంది. ఈ సంక్రాంతికి 'హను-మాన్' చిత్రం తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా వచ్చి చక్కని ఆదరణతో కొనసాగుతోంది. చిన్న చిత్రంగా మొదలై ప్రచార చిత్రాలతో పాన్ ఇండియా స్థాయికి చేరింది. టాలీవుడ్‌తో పాటు పరభాషల్లోనూ మంచి టాక్ తెచ్చుకొంది. ఉత్తరాదినా 'హను-మాన్' ప్రభంజనం కొనసాగుతోంది. ఇక మహేశ్‌బాబు- దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'గుంటూరు కారం' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మహేశ్ స్వామినాకు పండుగ సీజన్ తోడవడంతో ఈ సినిమా భారీ వసూళ్లను రాబడుతోంది. సంక్రాంతి రేసులో బాక్సీఫీసు దగ్గర కలెక్షన్ల పరంగా 'గుంటూరు కారం' తన ఘాటు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక వెంకటేశ్ కథానాయకుడిగా 'హిట్' ఫేం శైలేష్ కొలను రూపొందించిన 'సైంధవ్' చిత్రం సంక్రాంతి బరిలో నిలిచింది. వెంకటేశ్‌కు కుటుంబ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ, మాస్ ఫాలోయింగ్‌ను మ్యాచ్ చేస్తూ శైలేష్ తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇక 'సోగ్గాడు' నాగార్జున కూడా ఆనవాయితీగా సంక్రాంతి బరిలో నిలిచారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం నేడు (ఆదివారం) విడుదలవుతోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ప్రేమకథకు వినోదం మేళవించి తెరకెక్కించిన చిత్రమిది. సినిమా విజయంపై నాగార్జున, చిత్రబృందం ధీమాగా ఉన్నారు. జయాపజయాల మాట పక్కనపెడితే ఈ సంక్రాంతి చిత్ర పరిశ్రమకు కొత్త ఉపునూ, ఉత్సాహాన్ని ఇచ్చింది. ఫలితం అటూ ఇటూ అయినా మంచి వసూళ్లను రాబట్టుకునే అవకాశం ఉండడంతో థియేటర్ల సమస్య ఏర్పడినా నిర్మాతలు వెనుకాడలేదు.











సంక్రాంతికి తమ సినిమాలు రిలీజ్ చేసేందుకు వీరే కాదు మరికొందరు నిర్మాతలు కూడా ముందుకొచ్చినా ఆఖరి నిమిషంలో రిలీజ్‌ను కొత్త తేదీకి మార్చుకున్నారు. సంక్రాంతికి మూకుమ్మడిగా సినిమాలను విడుదల చేసి నష్టాలను మూటగట్టుకోవడం కన్నా కొత్త తేదీకి రిలీజ్ డేట్లు మార్చుకుంటే మేలు కలుగుతుందని పరిశ్రమ పెద్దలు చెప్పడంతో తమ సినిమాలను వాయిదా వేసుకొని, కొత్త రిలీజ్ డేట్లను ప్రకటించారు. సంక్రాంతి సినిమాలు దుమ్ము దులపడంతో అదే ఊపులో వీటికి కూడా చక్కటి ప్రేక్షకాదరణ లభిస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రవితేజ నటించిన 'ఈగల్' చిత్రం కూడా సంక్రాంతి రిలీజ్‌కు సిద్ధమైనా చివరి నిమిషంలో వాయిదా పడింది. ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలవుతోంది. 'రవితేజ చెప్పడంతో మా సినిమా వాయిదాకు అంగీకరించాం, అభిమానులు అంతా కాలర్ ఎగరేసుకునేలా 'ఈగల్' ఉంటుంది' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. మరికొన్ని సినిమాలు కూడా సంక్రాంతి తర్వాత ఒకట్రెండువారాల గ్యాప్‌తో థియేటర్లలోకి వస్తున్నాయి. వీటిలో తెలుగు స్ట్రెయిట్ చిత్రాల కన్నా డబ్బింగ్ చిత్రాలు ఎక్కువగా ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి.

రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'లాల్ సలామ్' చిత్రం తొలుత సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. తమిళంతో పాటు తెలుగులోనూ పెద్ద సినిమాలు విడుదలవుతుండడంతో రిలీజ్‌ను ఫిబ్రవరి 9కి వాయిదా వేశారు. రజనీకాంత్ కూతురు ఐశ్వర్య ధనుష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రజనీకాంత్ అల్లుడు ధనుష్ కూడా సంక్రాంతి సీజన్‌పై కన్నేశాడు. ఆయన హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'కెప్టెన్ మిల్లర్' తమిళ వెర్షన్ ఈ నెల 12న విడుదలైంది. తెలుగులోనూ అదే తేదీన రిలీజ్ చేయాలనుకున్నా సంక్రాంతికి థియేటర్ల కోసం పోటీ ఏర్పడడంతో విడుదల చేయలేదు. తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ నెల 25న 'కెప్టెన్ మిల్లర్' తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. బ్రిటిష్ కాలం నాటి కథతో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రంపై తెలుగు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. శివ కార్తికేయన్ హీరోగా నటించిన 'అయలాన్' చిత్రం కూడా సంక్రాంతి బరిలో నిలిచినా తెలుగు వెర్షన్ చివరి నిమిషంలో వైదొలగింది. సంక్రాంతి విడుదలకు సిద్ధమైన ఈ చిత్రాలన్నింటిపైనా ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. అందుకే ఈ సంక్రాంతి జోరు చిత్ర పరిశ్రమలో మున్ముందూ కొనసాగే అవకాశముంది.






ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ నైట్‌మెర్	వెబ్‌సిరీస్	జనవరి 17
మెర్రీ మెన్ 3	హాలీవుడ్ మూవీ	జనవరి 18
అమెజాన్ ప్రైమ్		
డెవిల్	తెలుగు చిత్రం	జనవరి 14
ఇండియన్ పోలీస్ ఫోర్స్	హిందీ సిరీస్	జనవరి 19
పంచాయత్	హిందీ సిరీస్ 3	జనవరి 15
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
జోయ్	తమిళ చిత్రం	జనవరి 15
లూక్ గూయెన్స్ ఇండియా	టీవీ షో	జనవరి 15
డెత్ అండ్ అదర్ డిటెయిల్స్	వెబ్‌సిరీస్	జనవరి 16
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మాన్	తెలుగు చిత్రం	జనవరి 19
జియో సినిమా		
బెల్‌గ్రేవియా: ద నెక్స్ట్ చాప్టర్	వెబ్‌సిరీస్	జనవరి 15
ట్రూ డిటెక్టివ్	వెబ్‌సిరీస్ 4	జనవరి 15





ఆ పొరపాటే ఇతని కెరీర్‌ను నాశనం చేసింది!



అవినాశ్ వద్వాన్.... 90ల దశకంలో బాలీవుడ్‌ను ఓ ఊపు ఊపిన నటుడు. ఆ రోజుల్లో అక్షయ్‌కుమార్, సునీల్ శెట్టి వంటి నటులకు గట్టి పోటీ ఇచ్చారు అవినాశ్ 'దిల్ కి బాజీ', 'పాపీ గుడియా', 'గీత్' వంటి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. ముఖ్యంగా అవినాశ్, దివ్యభారతి జంట ఆ రోజుల్లో బాగా పాపులర్. అటు ప్రేక్షకుల మెప్పు, ఇటు పరిశ్రమ వర్గాల ప్రోత్సాహం అవినాశ్ పొందడంతో నటుడిగా అతనికి తిరుగులేదని అందరూ అనుకున్నారు. కానీ వ్యక్తిగత జీవితంలో చేసిన పొరపాటు వల్ల అతని కెరీర్‌కు కోలుకోలేని నష్టం కలిగింది. ఆ కారణంగా ఎన్నో అవకాశాలు పోగొట్టుకుని పరిశ్రమకు దూరం కావాల్సి వచ్చింది.

ఇంజనీరింగ్ పూర్తి చేసి ఎంబీఏ చదవడానికి ముంబై వచ్చిన అవినాశ్‌కు నటుడు కావాలనే కోరిక మొదట్లో లేదు. కానీ 'నువ్వు హీరోలా ఉన్నావ్.. సినిమాల్లో ట్రై చేయకూడదూ' అని హాస్టల్‌లో స్నేహితులు పదే పదే అంటుండడంతో అవినాష్‌లో ఆ ఆలోచన మొదలైంది. దానికి తోడు మంచి ఫిజిక్ ఉండడంతో ప్రయత్నించి చూద్దాం అనుకుని మొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టారు అవినాశ్. ఇక అక్కడి నుంచి ఆయన నటుడు కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. 1986లో వచ్చిన 'ప్యార్ హో గయా' చిత్రంలో అవినాశ్ తొలిసారిగా నటించారు. ఆ సినిమాతో అందరి దృష్టి ఆయనపై పడడంతో పెద్ద పెద్ద సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చాయి. చేతినిండా అవకాశాలు, డబ్బు.. ఆయన జాతకమే మారిపోయింది.

అయితే ఆయన వైవాహిక జీవితం మాత్రం అంత సంతృప్తికరంగా ఉండేది కాదు. భార్యతో గొడవలు, చికాకుల వల్ల చాలా సినిమాలు వదులుకోవాల్సి వచ్చింది. మొదటి భార్యకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకోవడం, సీన్ రిపీట్ అవడం.. అవినాశ్ కెరీర్ మీద ప్రభావం చూపించింది. దానివల్ల తెర మరుగయ్యారు. చాలా ఏళ్ల తర్వాత అవినాశ్ మళ్లీ ఇప్పుడు నటన మొదలు పెట్టారు. వెబ్ సిరీస్, టీవీ సీరియల్స్‌లో నటిస్తూ పూర్వ వైభవం పొందడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరి కాలం కలసి వస్తుందేమో చూడాలి!

అవతార్ స్థాయి సినిమా అనొచ్చు



దీపికా పదుకొణే అద్భుతమైన సౌందర్యరాశి. అందులో సందేహమేలేదు. ఆమె అందానికి అభిమానులు కోకొల్లలు. అయితే.. పాత్ర కోసం అందవిహీనంగా కనిపించడానికి కూడా దీపికా వెనుకాడరు. నటనంటే తనకు అంతిష్టం. ప్రస్తుతం ప్రభాస్‌తో కలిసి ఆమె నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ఆమె డీగ్లామరైజ్డ్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర గురించి ఇటీవల ఆమె మాట్లాడారు. 'ఈ కథ మన దేశానికే కాదు, ప్రపంచానికే కొత్త కథ. 'అవతార్' స్థాయి సినిమా అనొచ్చు. నాగ్ అశ్విన్ ఎంచుకున్న కాన్సెప్ట్ అలాంటిది. మన పురాణాలు, ఇతిహాసాలు భవిష్యత్తును కూడా సూచిస్తుంటాయి. ఓ విధంగా ఈ సినిమా కథ అదే. ఇంతకంటే చెప్పకూడదు. అద్భుతాన్ని చూస్తూ ఆస్వాదిస్తేనే కిక్కు. ఇక ఇందులో నా కెరీర్‌కే మైలురాయి లాంటి పాత్ర చేస్తున్నాను. ఈ సినిమా ఓ భయంకర పోరాటం. ఆ పోరాటంలో నేను ఓ ఆయుధాన్ని. నా పాత్రను అందరూ ప్రేమిస్తారు.' అని తెలిపారు దీపిక.

తెలంగాణ గిరిజన గురుకులాల్లో


ఇంటర్ ప్రవేశాలు

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● ఆదివారం 14 జనవరి 2024

diksuchi@andhrajyothy.com



తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కాలేజీల్లో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీటీడబ్ల్యూఆర్ సీఓఈ సెట్) 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు మీడియంలో చదువుకున్నవారు కూడా ఈ టెస్ట్ రాయవచ్చు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ పొందినవారికి అకడమిక్ బోధనతోపాటు ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు ఇంగ్లీష్ మీడియంలో చదవాల్సి ఉంటుంది. సెకండ్ లాంగ్వేజ్ తెలుగు మాత్రమే ఉంటుంది. బాలురకు, బాలికలకు విడివిడిగా కళాశాలలు ఉన్నాయి. భోజనం, వసతి ఉచితం. డ్రెస్‌లు, బుక్స్ ఇస్తారు. స్టేషనరీ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు, మెడికల్ ఖర్చులు, పరీక్ష ఫీజు తదితరాలు కూడా చెల్లిస్తారు.

సీట్ల వివరాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన సీఓఈ కళాశాలల్లో మొత్తం 1140 సీట్లు ఉన్నాయి. ఎంపీసీ గ్రూప్‌లో బాలురకు 335, బాలికలకు 240 సీట్లు; బైపీసీ గ్రూప్‌లో బాలురకు 325, బాలికలకు 240 సీట్లు ఉన్నాయి. ప్రతి గిరిజన గురుకుల సీఓఈ కళాశాలలో ఒక్కో గ్రూప్‌లో కనీసం 40 సీట్లు ఉన్నాయి.

- ప్రీమియర్, నాన్ ప్రీమియర్ సీఓఈ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు దరఖాస్తులో తాము చేరదలచుకొన్న సీఓఈ కళాశాలల ప్రాధాన్య క్రమాన్ని సూచించాలి.

బాలుర సీఓఈ కళాశాలలు

- **ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** రంగారెడ్డి - రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్, ఖమ్మం, వరంగల్-యాకుబ్‌పుర.
- **నాన్ ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** నల్లగొండ-మిర్యాలగూడ, మెదక్-నర్సాపూర్, సిద్దిపేట్-హస్నాబాద్, భద్రాద్రి కొత్తగూడెం(కేఎస్‌డీ సైట్), భద్రాద్రి కొత్తగూడెం-దమ్మపేట గిరిజన గురుకులాలు.

బాలికల సీఓఈ కళాశాలలు

- **ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** వరంగల్, వికారాబాద్-పరిగి
- **నాన్ ప్రీమియర్ సీఓఈ కళాశాలలు:** వనపర్తి, నాగర్‌కర్నూల్-కల్వకుర్తి, నల్లగొండ-దేవరకొండ, భద్రాద్రి కొత్తగూడెం-భద్రాచలం గిరిజన గురుకులాలు

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ విద్యార్థులు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లలోపు ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; నగరాల్లో రూ.2,00,000 మించకూడదు.

ఎంట్రెన్స్ టెస్ట్(సీఓఈ 2024) వివరాలు: ఇందులో రెండు స్ర్కీనింగ్ టెస్ట్‌లు ఉంటాయి. మొదటిది ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. రెండోది డిస్క్రిప్టివ్ టెస్ట్. ప్రశ్నలన్నీ ఎనిమిదో తరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న సిలబస్ ప్రకారం ఉంటాయి. ప్రశ్నపత్రాలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు.

- మొదటి స్ర్కీనింగ్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి 20, మేథ్స్ నుంచి 60, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. బైపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి 20, మేథ్స్ నుంచి 20, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, బయోసైన్స్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ/బ్లాక్ పెన్‌తో గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 160. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.
- రెండో స్ర్కీనింగ్ టెస్ట్: మొదటి టెస్ట్‌లో అర్హత పొందినవారిని 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసి రెండో టెస్ట్‌కు అనుమతిస్తారు. ఇందులో మేథ్స్/బయోసైన్స్‌కు 45, ఫిజిక్స్‌కు 45, కెమిస్ట్రీకి 45, ఇంగ్లీష్‌కు 15 మార్కులు చొప్పున మొత్తం 150 మార్కులు నిర్దేశించారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారమే సీఓఈల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** 200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 12 నుంచి 17 వరకు
- **లెవెల్ 1 స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 18న
- **లెవెల్ 2 స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** మార్చి 10న
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

లిటిల్స్



మీకు తెలుసా?


- తల దగ్గర ఎరుపు, పసుపు పచ్చ రంగు ఉండి రెక్కల మీద చుక్కలు ఉండే ఈ బుజ్జిపక్షిని రెడ్, యల్లో బార్బెట్ అని పిలుస్తారు. ఆఫ్రికాలో ఎక్కువగా కెన్యా, టాంజానియా, ఇథియోపియా, సూడాన్, ఉగండా దేశాల్లో కనిపిస్తాయివి.
- ఆడపక్షులు, యంగ్‌గా ఉండే పక్షుల్లో ఎరుపు, పసుపు పచ్చ రంగు తక్కువగా ఉంటుంది.
- సుమారు 9 ఇంచులు పొడవు ఉండే ఈ పక్షులు కేవలం మూడేళ్లు బతుకుతాయి.
- ఇవి ఇళ్లలో, అడవిలో నిలబెట్టిన కార్ల అద్దాలు క్లోజ్ చేయకుంటే అందులో ఉండే ఆహారాన్ని పసిగట్టి తింటాయి.
- చెట్లమీదతో పాటు మట్టిలో తిరగటానికి ఇష్టపడతాయి. ముఖ్యంగా



చీమల పుట్టల దగ్గర తచ్చాడుతుంటాయి. మట్టిమీదనే గూళ్లు కట్టుకుంటాయి. పురుగులు, కీటకాలు, చిన్నచేపలను తింటాయి.

- ఇవి అలారమ్‌లా కంటిన్యూగా అరుస్తాయి. నాలుగు లేదా ఐదు గుడ్లు మాత్రమే పెడతాయి. రెండు వారాలు పాటు పొదుగుతాయి.
- బరువు 75 గ్రాములు ఉంటాయి. గుంపుగా ఉంటే మాత్రం కనీసం పది పక్షులు ఉంటాయి. చిన్న గుంపుల్లో మూడు పక్షులు కూడా ఉంటాయి.
- ఆఫ్రికాలో వీటి జాతి 42 రకాలు ఉంటే.. ఆసియాలో 30 రకాల బార్బెట్‌లు ఉంటాయి.
- రెయిన్ పారెస్ట్ ప్రాంతాల్లో నివసించటానికే ఇష్టపడతాయి. అక్కడే కనీసం 70 శాతం పక్షులుంటాయి.
- 50 నుంచి 120 ఎకరాల పరిధిలోనే తిరుగుతూ ఉంటాయి.


దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 204

		4			3		5	
5				9	6			
7	6							9
	7			2			8	
	1	8	6		4	7	2	
	3			8			1	
3							9	2
			3	5				1
	4		9			5		

సుడోకు - 203 సమాధానం

1	6	5	4	2	3	9	8	7
8	4	9	7	6	5	1	3	2
3	2	7	8	9	1	6	5	4
7	3	8	6	5	4	2	1	9
5	1	4	2	3	9	8	7	6
6	9	2	1	7	8	5	4	3
4	7	6	5	1	2	3	9	8
9	8	1	3	4	6	7	2	5
2	5	3	9	8	7	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

నిట్ రూర్కెలాలో ఎంబీఏ

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీఆర్‌కేఎల్)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 75 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 40 శాతం, అకడమిక్ ప్రతిభకు 30 శాతం, అనుభవానికి 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 10 శాతం వెయిటేజీ ఇస్తూ కనీసం 50 శాతం స్కోర్ సాధించిన అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఫిబ్రవరి 29
- **జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మార్చి 18, 19
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మార్చి 29
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **మొదటి సెమిస్టర్‌కు రిజిస్ట్రేషన్:** జూలై 22 నుంచి
- **మొదటి సెమిస్టర్ ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 24 నుంచి
- **వెబ్‌సైట్:** www.nitrkl.ac.in

బిట్స్ పిలానీలో ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) - ఎంబీఏ ఇన్ బిజినెస్ అనలిటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. బిజినెస్ అనలిటిక్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (బీఏఏటీ) 2024 మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫైనాన్షియల్ అసిస్టెంట్‌షిప్ సాకర్యం ఉంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ విభాగాలకు సంబంధించి అనలిటికల్ ట్రెయినింగ్ ఇస్తారు. టెక్నాలజీ అప్లికేషన్స్ వివరిస్తారు. క్యాంపస్ తరగతులు ఉంటాయి. ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్క్‌షాప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, ఇండస్ట్రీ ప్రముఖులతో ఇంటరాక్షన్ మీటింగ్స్, ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ఉంటాయి. సెమిస్టర్‌కు నిర్దేశించిన ప్రకారం కోర్ సబ్జెక్టులు, ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 1 నాటికి డిగ్రీ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఇంటర్/పన్నెండోతరగతి/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లకు సంబంధించిన పరిజ్ఞానం ఉండాలి. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/జీమ్యాట్ 2023 అర్హత, ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

బీఏఏటీ 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఈ టెస్ట్‌లో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటిది మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ సెక్షన్. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. రెండోది అనలిటిక్స్ ఆప్టిట్యూడ్ సెక్షన్. పరీక్ష సమయం గంట. ఇందులో కంప్యూటర్స్, మేథమెటిక్స్‌కు సంబంధించిన బేసిక్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు అడుగుతారు.

ఎంపిక: బీఏఏటీ 2024లో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో ఎంపికైనవారికి సంబంధించిన బీఏఏటీ స్కోర్, ఇంటర్వ్యూ స్కోర్, జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, అకడమిక్ మెరిట్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ స్కిల్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.3300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 19
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4 వరకు
- **బీఏఏటీ అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడింగ్:** మార్చి 18 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- బీఏఏటీ 2024 తేదీ: ఏప్రిల్ 7
- **ఆన్‌లైన్ మోడ్‌లో గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 13 నుంచి
- **వెబ్‌సైట్:** www.bitsadmission.com

ఎయిమ్స్ మంగళగిరిలో ఫ్యాకల్టీ

మొత్తం ఖాళీలు **125**

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు

1. **ప్రొఫెసర్:** 20 పోస్టులు
2. **అసిస్టెంట్ ప్రొఫెసర్:** 73 పోస్టులు
3. **అడిషనల్ ప్రొఫెసర్:** 10 పోస్టులు
4. **అసోసియేట్ ప్రొఫెసర్:** 22 పోస్టులు

విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బయోస్టాటిస్టిక్స్, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ, సైకియాట్రీ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ, ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ ఖాళీలకు 58 ఏళ్లు; ఇతర పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్, రిక్రూట్‌మెంట్ సెల్, రూం నెంబరు 216, 2వ అంతస్తు, లైబ్రరీ అండ్ అడ్మిన్ బిల్డింగ్, ఎయిమ్స్, మంగళగిరి, గుంటూరు చిరునామాకు పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29

హార్డ్ కాపీ స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 8

వెబ్‌సైట్: https://www.aiims-mangalagiri.edu.in/

డీఆర్‌డీవోలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు **60**

చెన్నై అవడిలోని డీఆర్‌డీవో- కంబాట్ వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీవీఆర్‌డీఈ)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడ్: కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెడికల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, మెకానిక్, టర్నర్, వెల్డర్

అర్హతలు: సంబంధిత ట్రేడులో ఐటీఐ 2021/2022/2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులు.

వయో పరిమితి: 2023 డిసెంబరు 1 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

స్టయిపెండ్: నెలకు రూ.7,700 నుంచి రూ.8,050

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: వార్తాపత్రికలో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.drdo.gov.in/

సెయిల్‌లో మెడికల్ ఆఫీసర్లు

రౌర్కెలాలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఆఫీసర్(ఇ-1): **05 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(బయో మెడికల్): **1 పోస్టు**

అర్హత: ఎంబీబీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణత

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

వెబ్‌సైట్: sailcareers.com

సీసీఎంబీలో జూనియర్ స్టెనోగ్రాఫర్‌లు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

అర్హత: 10+2/పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు స్టెనోగ్రఫీలో నైపుణ్యం కలిగి ఉండాలి.

వయోపరిమితి: 27 ఏళ్లు మించకూడదు

ఎంపిక: రాత పరీక్ష, ప్రొఫిషియెన్సీ టెస్ట్/ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

దరఖాస్తు హార్డ్ కాపీ స్వీకరణకు చివరి తేదీ: జనవరి 29

వెబ్‌సైట్: www.ccmb.res.in/Careers/ProjectPositions

శ్రీకాకుళంలో పారామెడికల్ పోస్టులు

శ్రీకాకుళంలోని వైద్య సంస్థల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది.

వైద్య సంస్థలు: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

ఖాళీలు: బుక్ బేరర్, డీఈవో/కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, స్పీచ్ థెరపిస్ట్, పర్సనల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, ల్యాబ్ అటెండెంట్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

వెబ్‌సైట్: https://srikakulam.ap.gov.in/

పీడీఐఎల్‌లో ఖాళీలు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్(పీడీఐఎల్).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన తాల్చేర్ ఫర్టిలైజర్ లిమిటెడ్(ఒడిశా) ప్రాజెక్ట్ సైట్‌లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఇంజనీర్/ఎగ్జిక్యూటివ్

విభాగాలు: సివిల్(కన్‌స్ట్రక్షన్), ఎలక్ట్రికల్(కన్‌స్ట్రక్షన్), ఇన్‌స్ట్రుమెంటేషన్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(కన్‌స్ట్రక్షన్), సేఫ్టీ ప్రాసెస్(కమిషనింగ్), ప్లానింగ్, హ్యూమన్ రిసోర్సెస్.

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 17

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి నుంచి 6 వరకు

వేదిక: పీడీఐఎల్ భవన్, నోయిడా

వెబ్‌సైట్: https://www.pdilin.com/

